అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 02-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 183 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

చేనేతరంగంపై కొరటాల విశేష కృషి



కొరటాల సత్యనారాయణకు సెల్యూట్ చేస్తున్న సారంపల్లి మల్లారెడ్డి, నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్

అందువల్లే అప్పట్లో చేనేతకు రూ.30కోట్ల రాయితీ మంజూరు

భూ సమస్యలు, ఇరిగేషన్‌పైనా లోతైన అధ్యయనం : కొరటాల వర్ధంతిలో సారంపల్లి మల్లారెడ్డి

వివరాలు 6లో

రేపు మంత్రివర్గ విస్తరణ?

ఏడో తేదీలోపే అమాత్యుల ప్రమాణాలు

నేడు ఢిల్లీకి సీఎం, డిప్యూటీ సీఎం..

పీసీసీ, 'క్యాబినెట్'పై అధిష్టానంతో చర్చించనున్న రేవంత్, భట్టి

ఆ క్రమంలోనే గవర్నర్‌తో సీఎం భేటీ

పీసీసీకి మహేశ్ కుమార్ గౌడ్ లేదా మధుయాష్కీ?

హోం శాఖకు సీతక్క పేరు ప్రతిపాదన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికార పార్టీకి చెందిన ఎంతోమంది సీనియర్లు ఆశగా ఎదురు చూస్తోన్న మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై తుది చర్చలు జరిపి, వాటిని ఓ కొలిక్కి తెచ్చేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించి వారిరువురూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఆ సమాలోచనల ప్రకారం ఏఐసీసీకి ఒక నివేదికను పంపారు. దానికనుగుణంగా కాంగ్రెస్ పెద్దలు 'అర్హుల' జాబితాను కూడా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈనెల ఏడు నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ఆలోపే మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని సీఎం నిర్ణయించారు. బుధ లేదా గురువారాల్లో విస్తరణ చేపట్టి, ఆ వెంటనే (ఈనెల ఏడులోపు) నూతన మంత్రులతో ప్రమాణ స్వీకారాలు చేయించాలని రేవంత్ భావిస్తున్నారు. అందులో భాగంగానే ఆయన సోమవారం రాష్ట్ర గవర్నర్ రాధకృష్ణన్‌ను కలిసినట్టు సమాచారం. సీఎం, డిప్యూటీ సీఎం... ఢిల్లీ విమానమెక్కనున్న నేపథ్యంలో మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు, కూర్పులు, పీసీసీ నూతన చీఫ్‌పై ఊహాగానాలు జోరందుకున్నాయి. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పాత్రికేయులతో ఇష్టాగోష్టి సందర్భంగా చేసిన వ్యాఖ్యలు కూడా వాటికి బలాన్ని చేకూర్చే విధంగా ఉన్నాయి. క్యాబినెట్ విస్తరణలో ఈసారి సామాజిక పొందికలు కీలకం కానున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముగ్గురు బీసీలకు మంత్రి పదవులిచ్చారు. అందువల్ల ఈసారి తమకు నాలుగు బెర్తులివ్వాలంటూ కాంగ్రెస్‌లోని బీసీలు సీఎం రేవంత్‌ను కోరుతున్నారు. ఆ ప్రకారంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి (మక్తల్), నీలం మధు (మెదక్ నుంచి ఇటీవల ...13లో



గవర్నర్ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

విభజన హామీలను పరిష్కరించుకుందాం

6న సమావేశమవుదాం : సీఎం రేవంత్‌కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ

వివరాలు 13లో

మా గొంతు నొక్కితే సహించం



పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

లోక్‌సభలో నీట్‌పై చర్చకు పట్టు...అంగీకరించని ప్రభుత్వం... నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాల వాకౌట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అందుకోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. ప్రతిపక్షపార్టీలపై మోడీ ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఇండియా ఫోరానికి చెందిన ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ప్రతిపక్షాలను మాట్లాడకుండా చేయడం కోసం.. వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడాన్ని ఆపాలని మోడీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అయితే అవినీతికి పాల్పడిన వారు బీజేపీలో చేరితే, వారు అవినీతికి పాల్పడేందుకు లైసెన్స్ ఇస్తుందని మండిపడ్డారు. ఈ ఆందోళనలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇతర ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు.

లోక్‌సభలో నీట్‌పై చర్చకు పట్టు

లోక్‌సభ సమావేశాలు ఐదో రోజు వాడీవేడిగా కొనసాగాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే టి20 ప్రపంచ కప్ గెలుపొందిన టీమ్ ఇండియాకు ఎంపీలంతా అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించేందుకు అధికార పార్టీ నేత అనురాగ్ ఠాకూర్‌ను స్పీకర్ ఓం బిర్లా పిలిచారు. అయితే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభలో నీట్ అవకతవకల అంశాన్ని ప్రస్తావించారు. ఈ అంశంపై చర్చ జరపాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. ఈ విషయంపై తాము వాయిదా తీర్మానం కూడా ఇచ్చినట్టు పేర్కొన్నారు. అందుకు స్పీకర్ ఓం బిర్లా నిరాకరించడంతో సభ నుంచి ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'మేము నీట్‌పై ఒక రోజు మొత్తం చర్చను కోరుతున్నాం. ఇది చాలా ముఖ్యమైన అంశం. రెండు కోట్ల మందికిపైగా విద్యార్థులు ప్రభావితులయ్యారు. 70 సందర్భాల్లో పేపర్‌లీక్‌లు జరిగాయి. ఈ విషయంలో విద్యార్థులంతా ఆందోళనలో ఉన్నారు. వారికి పార్లమెంట్ నుంచి భరోసా కల్పిస్తూ సందేశాన్ని ఇవ్వాల్సి ఉంది. మీరు ఈ అంశంపై ప్రత్యేక చర్చకు అనుమతిస్తే మేం సంతోషిస్తాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

అయితే రాహుల్ అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వ్యతిరేకించారు. ఆ అంశంపై నోటీసు ఇవ్వాలని, బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే సమయంలో వాయిదా తీర్మానాలు తీసుకునేందుకు నిబంధనలు అంగీకరించవని అన్నారు. ప్రస్తుత సమావేశాల్లో జీరో అవర్, ప్రశ్నోత్తరాలు లేవని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చిద్దామని పేర్కొన్నారు. తీర్మానాన్ని ఆమోదించిన తరువాత ఇతర అంశాలను లేవనెత్తవచ్చని ప్రతిపక్షాల అభ్యర్థనను ఓంబిర్లా తిరస్కరించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రతిపక్షాలు కోరుతున్న అంశాలపై చర్చించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభకు కొన్ని నియమాలు, నిబంధనలు, సంప్రదాయాలు ఉంటాయని అన్నారు. ఎప్పుడు ఏ అంశం చర్చించాలనేదానిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రస్తుతం చర్చను కొనసాగించాలని రాజ్‌నాథ్ కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ముగించే వరకూ ప్రత్యేక చర్చ జరగదని చెప్పారు. దీంతో సభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

మోడీ X రాహుల్

బీజేపీకి గుణపాఠం చెప్పిన రామ జన్మభూమి



లోక్‌సభలో రాహుల్

ప్రజా సమస్యలపై నిలదీత

ఆయన వ్యాఖ్యలపై మోడీ అభ్యంతరం



రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ

వివరాలు 3లో

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం

రాముడు బీజేపీతో లేడని ఎన్నికలే రుజువు చేశాయి

రాజ్యసభలో సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిట్టాస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను లాక్కొని వాటిని ఆర్థికంగా కుంగదీస్తోందని, దీంతో కేరళ, కర్నాటక రాష్ట్రాలు నిరసనలు చేయాల్సి వచ్చిందని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం ఆయన మాట్లాడారు. మైనారిటీలను అవమానిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ సహా ...3లో



కవితకు షాక్

బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు షాక్ తగిలింది. ఆమె దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ప్రమేయం ఉందన్న ...13లో

కేసీఆర్ పిటిషన్ కొట్టివేత

విద్యుత్ కమిషన్ సక్రమమే : స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణాలపై నిజనిర్ధారణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ సక్రమమే అని హైకోర్టు ధర్మాసనం స్పష్టం ...5లో

రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

నీట్‌పై కదం తొక్కిన విద్యార్థి సంఘాలు



- విద్యార్థులను చితకబాదిన పోలీసులు
- అత్యుత్సాహం ప్రదర్శించిన ఖాకీలు
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, మణికంఠరెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, వెంకటేశ్ సహా పలువురి అరెస్టు
- విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- మోడీ స్పందించకుంటే భారత్‌బంద్
- కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ఎన్టీఏను రద్దు చేయాలి : విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలనీ, జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)ను మళ్లీ నిర్వహించాలనీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. నిరసన తెలిపేందుకు రాజ్‌భవన్‌వైపు వెళ్లేందుకు యత్నించిన విద్యార్థి సంఘాల ...13లో

వలసవాద చట్టాల ప్రతిరూపాలే

క్రిమినల్ చట్టాలపై పెల్లుబుకుతున్న నిరసనలు

అభ్యంతరాలు, సిఫారసులను పట్టించుకోని కేంద్రం

నిబంధనలూ బేఖాతరు

మొదటి నుంచి అంతా రహస్యమే

ఆందోళన బాట పడుతున్న బార్ అసోసియేషన్లు





ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), ఎవిడెన్స్ చట్టం స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. ప్రతిపక్షాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, హక్కుల కార్యకర్తలు ఎన్ని విమర్శలు చేసినప్పటికీ గత లోక్‌సభలో ఉన్న సంఖ్యాబలంతో మోడీ ప్రభుత్వం ఈ బిల్లులను ఆమోదింపజేసుకుంది. వాస్తవానికి ఈ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటి నుండే వివాదం రాజుకుంది. నూతన చట్టాలు అమలులోకి వచ్చే నాటికి విమర్శలు సద్దుమణగలేదు సరికదా మరింత అధికమయ్యాయి.

న్యూఢిల్లీ : క్రిమినల్ చట్టాలకు సంబంధించిన బిల్లులను గత సంవత్సరం ఆగస్ట్ 11న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రవేశపెట్టారు. వలస పాలకుల కాలం నాటి చట్టాలను ప్రక్షాళన చేయడమే వీటి ఉద్దేశమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పుకొచ్చారు. బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందినప్పటి నుండీ ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, పౌర సమాజం, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు... ముఖ్యంగా న్యాయ నిపుణుల నుండి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో క్రిమినల్ చట్టాల అమలుపై వ్యక్తమవుతున్న ఆందోళనలను సింహావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముసాయిదా బిల్లులు బయట పెట్టలేదు

నిన్నటి వరకూ అమలులో ఉన్న చట్టాలను ...3లో

అప్రజాస్వామిక చట్టాలను ఆపాలి

కొత్త విద్యా విధానం రద్దుచేయాలి : సీపీఐ(ఎం) డిమాండ్

ముస్లింలపై దాడులకు ఖండన

5లో..

రెండువారాల్లో జాబ్‌క్యాలెండర్!

గ్రూప్స్, ఇతర పోస్టులపై సర్కారు కసరత్తు

సీఎం రేవంత్‌రెడ్డి సూచనతో తుది మెరుగులు

షెడ్యూల్ ప్రకారం పోటీ పరీక్షల నిర్వహణ

పక్కాగా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. రెండు వారాల్లో జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టేందుకు క్యాలెండర్‌ను రూపొందించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. దీంతో గ్రూప్స్, ఇతర పోస్టులకు సంబంధించి నియామకాల ప్రక్రియ ఎప్పుడు చేపట్టాలనే దానిపై అధికారులు సమాలోచన చేస్తున్నారు. అందుకనుగుణంగా జాబ్ క్యాలెండర్ రూపకల్పనలో బిజీగా ఉన్నారు. టీజీపీఎస్సీతోపాటు అన్ని నియామకల బోర్డులు చేపట్టే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ, సంబంధిత షెడ్యూలు వివరాలన్నింటినీ అందులో పొందుపరుస్తారు. నిరుద్యోగులకు భరోసా ఇచ్చేలా ప్రతి ఏటా పక్కాగా క్యాలెండర్ ప్రకారం నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆ సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది మెరుగులు దిద్దుతున్నారు.

టీజీపీఎస్సీ కీలకం

రాష్ట్రంలో కీలకమైన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తెలంగాణ ...13లో

ఈ యాప్స్‌లో బిల్లు చెల్లింపులు కుదరవ్..

బీబీపీఎస్‌తో అనుసంధానం కావాలంటూ ఆర్బీఐ ఆంక్షలు

క్రెడిట్‌కార్డులు, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎమ్, అమెజాన్ పే సహా ఏవీ చెల్లవు

కరెంటు బిల్లుల్ని వెబ్‌సైట్ ద్వారానే కట్టాలంటూ డిస్కంల విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

క్రెడిట్ కార్డుల ద్వారా ప్రభుత్వ బిల్లు చెల్లింపులు కుదరవని చెప్పిన రిజర్వుబ్యాంక్, తాజాగా యాప్స్ ద్వారా కూడా బిల్లు చెల్లింపుల్ని అంగీకరించబోమని స్పష్టం చేసింది. బ్యాంకులు కూడా క్రెడిట్ ...13లో



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య. చిత్రంలో వామపక్షాల నాయకులు

బొగ్గుగనుల వేలాన్ని రద్దు చేయాలి

5న కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు : వామపక్ష పార్టీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని వామపక్ష పార్టీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బొగ్గు బ్లాకులను నేరుగా సింగరేణికి అప్పగించాలని కోరాయి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల ఐదో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేపట్టాలని నిర్ణయించాయి. సోమవా రం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) ...6లో

హిట్ అండ్ రన్ సెక్షన్‌ను రద్దు చేయాలి

రవాణ రంగంలోని ట్రేడ్ యూనియన్స్‌తో చర్చలు జరపాలి

- అప్పటివరకు చట్టాన్ని అమలు చేయొద్దు
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌బాబు : రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్తగా అమల్లోకి వచ్చిన 'భారత న్యాయ సంహిత-2023'లోని హిట్ అండ్ రన్ సెక్షన్స్ 106(1)ని ఉపసంహరించుకోవాలని.. ట్రేడ్ యూనియన్స్‌తో చర్చలు జరిపిన తర్వాతే చట్టం అమలు గురించి ఆలోచించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఎన్ఎస్-2023 హిట్ అండ్ రన్ సెక్షన్స్ 106(1)అమలుకు వ్యతిరేకంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా, హైదరాబాద్ కంటోన్మెంట్‌లోని బాలమురాయ్ సెంటర్, టీఎస్‌టీ ఆర్టీసీ కళ్యాణమండపం డీసీఎం స్టాండ్ సెంటర్ వద్ద, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గణేష్ గుడి సెంటర్‌లలో ఆటో, ట్రాలీ డీసీఎం డ్రైవర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సంహితలోని 106 (1)(2)ను పూర్తిగా రద్దు చేసే వరకు డ్రైవర్ సోదరుల పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 106(2)ను అమలు చేయబోమని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ.. భవిష్యత్‌లో అమలు చేయరనే గ్యారంటీ లేదన్నారు. భారత న్యాయ సంహితలో హిట్ అండ్ రన్ 106(1)(2) కేసుల ప్రకారం.. యాక్సిడెంట్ అయినప్పుడు డ్రైవర్ స్పాట్‌లో ఉండి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి బాధితునికి వైద్యం చేయించని పరిస్థితుల్లో.. 2 నుంచి 5 ఏండ్ల వరకు జైలు శిక్ష అని, స్పాట్‌లో లేకుండా తప్పించుకుంటే సదరు డ్రైవర్‌కు పదేండ్ల జైలు శిక్షతోపాటు రూ.7 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు జరిమానా విధించనున్నారని తెలిపారు. దీని వల్ల డ్రైవర్లను వాస్తవ పరిస్థితులకు భిన్నంగా యాక్సిడెంట్లకు దోషిగా చేసే పరిస్థితి వస్తుందన్నారు. ఈ చట్టం అమలైతే తమ ప్రమేయం లేకుండానే జీవితాలు జైలు పాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా ప్రస్తుతం యాక్సిడెంట్ జరిగితే తప్పులతో సంబంధం లేకుండా బాధితుల తరఫువారు, ప్రజలు ఆవేశకావేశాలకు లోనై డ్రైవర్‌ని తప్పు పట్టడం.. కొట్టడం.. హింసించడం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రాణాపాయం ఉందనుకున్న పరిస్థితుల్లోనే అక్కడినుంచి డ్రైవర్లు తప్పుకుంటారన్నారు.

వాస్తవ విషయాలు పరిగణనలోకి తీసుకోకుండా కొత్త చట్టం వల్ల తాము బలి పశువులమవుతామని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇతర దేశాల్లో యాక్సిడెంట్ జరిగితే డ్రైవరు లేదా అవతలి వ్యక్తి ఎవరు తప్పు చేశారనేది పరిశీలించాక శిక్ష వేస్తారన్నారు. ఇక్కడ అందుకు విరుద్ధంగా యాక్సిడెంట్‌లకు డ్రైవరే కారణమని ఏకపక్షంగా నిర్ణయించడం సరైనది కాదన్నారు. అనుకోకుండా జరిగేదే యాక్సిడెంట్ అని అన్నారు. అందుకు రోడ్ల వ్యవస్థ మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం, ట్రాఫిక్ సిస్టం, సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడం 90శాతం కారణమన్నారు. వాటిని సరి చేయడం మానుకొని డ్రైవర్లను వేధించడం సబబు కాదన్నారు. తక్షణమే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం కేవలం గూడ్స్ ట్రాన్స్‌పోర్టు, ఆటో రవాణా కార్మికులకే కాదని లైసెన్స్ ఉన్న ప్రతి వ్యక్తికీ వర్తిస్తుందన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ఆటో, ట్రాలీ, డీసీఎం, క్యాబ్, టూరిస్ట్ బస్సు, తదితర అన్ని రకాల డ్రైవర్స్ ఐక్యంగా కొట్లాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ సహాయ కార్యదర్శి టి. మహేందర్, ఉపాధ్యక్షులు ఎం. సత్యనారాయణ, నగర నాయకులు కె.రమేష్, మల్లయ్య అజం, అజీమ్, స్థానిక నాయకులు ధర్మన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఆరాంఘర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులుగా చేయొద్దని, కారణాలను పరిశీలించిన తర్వాత కేసును బుక్ చేయడం.. ఇరువురి తప్పిదాన్ని బట్టి కేసులు బుక్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్ఆర్‌టీఎస్ ఇంచార్జి జీఎమ్‌గా అఖిలేష్ పాఠక్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టం-1 (ఎస్ఆర్‌టీఎస్-1) ఇంచార్జి జనరల్ మేనేజర్‌గా అఖిలేష్ పాఠక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టులో ఆయన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు కర్నాటకలోని కొంత భాగంలో సబ్‌స్టేషన్లు, ప్రాజెక్టుల్ని పర్యవేక్షిస్తారు. అఖిలేష్ పాఠక్ మంగళూరు విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 1993లో పవర్‌గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీగా నియమితులయ్యారు. గడచిన 31 ఏండ్లుగా ఆయన పవర్ ట్రాన్స్‌మిషన్ సిస్టం, పవర్ ప్రాజెక్టుల విభాగంలోని ఓ అండ్ ఎమ్, అసెట్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ ఆపరేషన్స్, ప్రాజెక్ట్ ఎన్విరాన్‌మెంట్, సుస్థిర నిర్వహణ, వ్యాపారాభివృద్ధి, కన్సల్టెన్సీ ప్రాజెక్ట్‌లు వంటి పలు విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుత బాధ్యతలు స్వీకరించడానికంటే ముందు ఆయన నేపాల్‌లోని పవర్‌గ్రిడ్ కన్సల్టెన్సీ ప్రాజెక్టులో సదరన్ రీజియన్-1 చీఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది?

- యువత, విద్యార్థుల కోసం పోరాటం : డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా జాబ్ క్యాలెండర్ ఏమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. యువమోర్చా నాయకులపై పోలీసుల దాడిని ఖండించారు. యువత, విద్యార్థులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా పోరాటం చేస్తామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మ్యానిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ పేరుతో సరూర్‌నగర్ స్టేడియంలో సభ పెట్టారనీ, ఓట్ల కోసం ఉద్యోగాల పేరుతో చిక్కడపల్లి లైబ్రరీ ప్రాంతంలో ప్రచారం చేశారని గుర్తుచేశారు. అదనంగా పోస్టులు సృష్టించి ఉద్యోగం ఇస్తామన్న వాగ్దానం ఏమైందని నిలదీశారు. మెగా డీఎస్సీని పదకొండు వేల పోస్టులకే పరిమితం చేశారని విమర్శించారు. నిరుద్యోగులకు చదువుకునే అవకాశం సమయం ఇవ్వకుండా నోటిఫికేషన్లు ప్రకటించి వారిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన ఏమైందని నిలదీశారు. అరెస్టయిన యువతకు ఆస్పత్రిలో వైద్య సేవలు అందించకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగుల కోసం మోతీలాల్ నాయక్ చేస్తున్న దీక్షను విరమించాలని కోరారు. యూనివర్సిటీల్లో కనీస సౌకర్యాలు లేవని విమర్శించారు.

ఎల్‌అండ్‌టీ మెట్రోకు గోల్డెన్ పికాక్ అవార్డు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించడంలో గల నిబద్ధతకు రైల్వేస్ విభాగంలో గోల్డెన్ పికాక్ పురస్కారాన్ని అందుకుంది. ఆదివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన ప్రతిష్టాత్మక 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ 25వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్' కార్యక్రమంలో పురస్కారాల ప్రదానం చేశారు. ఈ అవార్డులను మాజీ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ఉదయ్ యు.లలిత్, కర్నాటక హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రితు రాజ్ అవస్థి ప్రదానం చేశారు. ఎల్‌అండ్‌టీ మెట్రో సీఓఓ సుధీర్ చిప్లుంకర్ సమక్షంలో గోల్డెన్ పీకాక్ పురస్కారాన్ని కేవీబీ రెడ్డి అందుకున్నారు.

మొత్తం 778 దరఖాస్తులు రాగా.. విజేతగా నిలిచిన ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ, భద్రతా ప్రమాణాల పాటింపులో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుందని సంస్థ సీఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. ఉద్యోగుల భద్రత, సంక్షేమం విషయంలో కృషికి ఈ పురస్కారం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ పురస్కారం తమకు ఎంతో స్ఫూర్తినిస్తూ, నిరంతరం కృషి చేసేలా ప్రోత్సాహకరంగా ఉంటుందని చెప్పారు.

మహిళను కారుతో ఢీకొట్టి హత్య



నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ ఉప్పల్‌లో దారుణ ఘటన జరిగింది. మహిళను ఓ వ్యక్తి కారుతో ఢీకొట్టి హత్య చేశాడు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ శ్రీనివాసపురానికి చెందిన చంద్రమౌళి ఉప్పల్ భగాయత్‌లో ఎస్ఎన్ఎస్ రియల్ ఎస్టేట్ పేరుతో ఆఫీస్ నడుపుతూ డైరెక్టర్‌గా ఉన్నాడు. అదే కార్యాలయంలో రామంతాపూర్‌కు చెందిన మంజుల(40) విధులు నిర్వహిస్తున్నది. ఆమెకు వివాహం జరగ్గా.. భర్త చనిపోయాడు. ఇదిలా ఉండగా, కొంత కాలంగా చంద్రమౌళి, మంజుల మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. అయితే మంజుల మూడు నెలల నుంచి మరో వ్యక్తితో చనువుగా ఉండటంతో చంద్రమౌళి అనుమానం పెంచుకున్నాడు. అంతే కాకుండా చంద్రమౌళి వద్ద ఆమె రూ.28 లక్షలు తీసుకున్నట్టు సమాచారం. ఆ డబ్బు కూడా తిరిగివ్వకపోవడంతో చంద్రమౌళి మరింత కోపం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మంజులను అతను కారులో ఉప్పల్ భగాయత్‌కు తీసుకొచ్చాడు. అక్కడ కారుతో ఆమెను ఢీకొట్టి హత్య చేసి అనంతరం ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు... మంజుల మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

- నిరుద్యోగ సమస్యలపై వారం రోజులుగా మోతీలాల్ నిరాహార దీక్ష
- పరామర్శించేందుకు వచ్చిన విద్యార్థులు, నిరుద్యోగుల చెదరగొట్టిన పోలీసులు
- వాగ్వాదం, తోపులాటలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజశ్వేర్‌రెడ్డి సహా పలువురి అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని వారం రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు ఓయూ విద్యార్థులు, నిరుద్యోగులు తరలివచ్చారు. ఈ క్రమంలో వాగ్వాదం, తోపులాట జరిగింది. ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని, గ్రూప్స్ పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో అక్కడకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ నాయకులు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులు పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఓయూ విద్యార్థి జేఏసీ నేత మోతీలాల్ నాయక్ గత నెల 24వ తేదీన ఓయూలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టగా.. ఆ రోజే పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. దాంతో వారం రోజులుగా ఆస్పత్రిలోనూ దీక్ష చేస్తున్నారు. ఆయనను పరామర్శించేందుకు బీఆర్ఎస్‌వీ నాయకులు, విద్యార్థులు, నేతలు భారీగా ఆస్పత్రి వద్దకు వచ్చారు. లోపలికెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్‌వీ నాయకులతోపాటు ఓయూ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. గేట్లు తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించిన వారిని అరెస్టు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. లోపలికి ఎవరినీ అనుమతించకపోవడంతో విద్యార్థులు రోడ్డుపై బైటాయించారు. కొంత మంది విద్యార్థులు గాంధీ మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాల వైపు నుంచి ఆస్పత్రి ప్రాంగణంలోకి చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు హాస్టల్ భవనాల వద్ద ఉన్న క్యాంటీన్ వైపు వెళ్లి నిరుద్యోగులను అడ్డుకున్నారు. గ్రూప్-2 పోస్టులు పెంచాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కొందరు విద్యార్థులు దగ్గరలోని మెట్రో స్టేషన్లలోకి పరుగులు తీశారు. దాంతో మెట్రోనూ మూసేశారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులను అరెస్టు చేయడంతో గొడవ పెద్దదిగా మారింది. ఈ క్రమంలో స్థానిక పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతే హాస్పిటల్‌లోకి పంపించారు. మీడియాను కూడా అనుమతించలేదు. అదే సమయంలో మోతీలాల్‌ను పరామర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. అయినా లోపలికెళ్లేందుకు యత్నించడంతో వారిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆదివారం రాత్రి ఆస్పత్రికి ఎమ్మెల్సీ బల్మూరి

మోతీలాల్‌ను కలిసేందుకు ఆదివారం రాత్రి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రియాజ్, మానవతారాయ్ తదితర కాంగ్రెస్ నాయకులు గాంధీ ఆస్పత్రికి వచ్చారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, ఓయూ విద్యార్థులు వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దాంతో కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలకు నిరుద్యోగులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు ఇరువురినీ చెదరగొట్టారు.

ఇరిగేషన్ స్కామ్ ఆధారాలు బయటపెడతా

- రేషన్‌బియ్యం రీసైక్లింగ్‌తో వందల కోట్ల అవినీతి
- తమతో టచ్‌లో చాలా మంది ఎమ్మెల్యేలు : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీటి పారుదల శాఖలో జరుగుతున్న అవినీతిని త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతానని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. చాలామంది మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారనీ, ఎవరెవరనేది ముున్ముందు మీరే చూస్తారని మరోమారు బాంబు పేల్చారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మీడియాతో మాట్లాడారు. తొందర్లోనే కాళేశ్వరంపై మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. కాళేశ్వరంపై రిటైర్డ్ జడ్జితో కమిటీ వేసి చేతులు దులుపుకునే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఆరు శాఖల్లో జరుగుతున్న అవినీతిపై ఆధారాలిచ్చాక కూడా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ ద్వారా వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఆయన ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క కొత్త బెడ్డుకూడా వేయలేదన్నారు. ఆయన ప్రయివేటు ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఎలా వెళ్లారని నిలదీశారు. ఆయన కార్పొరేట్ ఆస్పత్రులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మీడియాపై ఆంక్షలు విధించడమేంటని ప్రశ్నించారు. డాక్టర్లు నిరసన తెలిపితే ఆంక్షలేంటని అడిగారు. లక్షల ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల ముందు డప్పులు కొట్టాలని చెప్పిన వ్యక్తే ఇప్పుడు ఫిరాయింపులను ఎలా ప్రోత్సహిస్తున్నారని నిలదీశారు. ఓ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసినది చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. పార్టీ ఫిరాయింపు లకు పాల్పడేవారి పై 90 రోజుల్లో చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దానంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనీ, స్పీకర్‌ను అడిగారు. దీనిపై స్పీకర్‌కు ఇప్పటికే రిజిష్టర్ పోస్టు చేశామనీ, ఆయన కార్యాలయంలో ఒకటి, మెయిల్ ద్వారా మరో పిటిషన్ ఇస్తున్నామని చెప్పారు. రాజీనామా చేసిన తర్వాతనే ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ సలహాదారుగా రిటైర్డ్ ఐఏఎస్ శ్రీనివాసరాజు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాసరాజు నియమితులయ్యారు. మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారుగా ఆయన వ్యవహరించనున్నారు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవో నెంబరు 909ని జారీ చేశారు.

గతంలో ఏపీలో పనిచేసిన శ్రీనివాసరాజు ఇటీవలే స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. దీర్ఘకాలం టీటీడీ ఈవోగా పనిచేసిన సంగతి తెలిసిందే.

ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు ఉద్యోగాలివ్వాలి

- సంక్షేమ భవన్ ముందు సంఘాల ధర్నా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు ఉద్యోగాలివ్వాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ముందు ధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కమిటీ సభ్యులు ఎం. ధర్మనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు వి. దాస్‌రాం నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎ. రాంబాబు నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐదో షెడ్యూలును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ హక్కులను కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని సంస్థల్లో స్థానిక గిరిజనులకు ఉద్యోగాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే.. రాబోయే కాలంలో గవర్నర్ కార్యాలయాన్ని కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ట్రైబల్ అడ్వైజరి కమిటీ సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అడవి బిడ్డలను తమ హక్కుల నుంచి దూరం చేసే కుట్ర ప్రభుత్వం చేస్తున్నదనీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల విడుదలలో నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు.

మోడీ X రాహుల్



బీజేపీకి గుణపాఠం చెప్పిన రామ జన్మభూమి

- లోక్‌సభలో రాహుల్ గాంధీ
- ప్రజా సమస్యలపై నిలదీత
- ఆయన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- అభ్యంతరం తెలిపిన మోడీ
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాముడి జన్మస్థలమైన అయోధ్య ప్రజలు బీజేపీని ఓడించి తగిన గుణపాఠం చెప్పారని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోమవారం లోక్‌సభలో మొదట వివిధ కమిటీల నియామకాలకు సంబంధించిన ప్రతిపాదనలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభ ముందుంచారు. ఆ తరువాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు స్పీకర్ ఓంబిర్లా అనుమతించారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభిస్తూ మోడీ నాయకత్వంపై విశ్వాసంతో దేశ ప్రజలు వరుసగా మూడోసారి ఎన్డీఏను గెలిపించారన్నారు. ప్రపంచం మెచ్చిన నాయకుడు ప్రధాని మోడీ అంటూ ప్రశంసించారు. దేశం నుంచి పేదరికాన్ని తరిమికొడతామని కాంగ్రెస్ దశాబ్దాలుగా నినాదాలు ఇస్తోందని, మోడీ ప్రభుత్వం పేదరికాన్ని తరిమివేసేందుకు పనిచేస్తోందని అన్నారు.

ఈ తీర్మానంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సుదీర్ఘంగా ప్రసంగించారు. అయోధ్య రాములవారి ఆలయం నుంచి ప్రతిపక్షాలపై దర్యాప్తు సంస్థల దాడుల వరకు ఆయన మాట్లాడారు. అగ్నిపథ్, ధరల పెరుగుదల, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, జాతీయ భద్రత వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు. రాజ్యాంగంపై దాడిని ఖండించిన వారిపై ఎన్డీఏ సర్కార్ దాడులకు దిగుతోందని, కొందరిని వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని విమర్శించారు. చేయని తప్పులకు శిక్ష అనుభవిస్తూ కొందరు నాయకులు ఇప్పటికీ జైల్లో ఉన్నారని తెలిపారు. పేదలు, దళితులు, మైనారిటీలు, వివిధ వర్గాల ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రశ్నించినందుకు దర్యాప్తు సంస్థలు తనపైనా దాడులకు తెగబడ్డాయని అన్నారు. ఈడీతో 55 గంటల పాటు విచారణ చేయించారని, కానీ ఏమీ లేదని స్పష్టమైందని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగాన్ని రక్షించుకున్నామని, ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగం ముందు తలవంచి జై సంవిధాన్ అనడం ఆనందంగా ఉందని, రాజ్యాంగానికి తాము రక్షణగా ఉంటామని, అధికారం కంటే నిజం గొప్పదని అన్నారు. అయోధ్య విమానాశ్రయం కోసం భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, ఎయిర్‌పోర్ట్ ప్రారంభం కోసం అదానీని పిలిచారని దుయ్యబట్టారు. సామాన్య ప్రజలు మోడీకి గుర్తు రాలేదని, అయోధ్య ప్రజలు ఆయనకు భయపడుతున్నారని విమర్శించారు. రాములవారి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సైతం మోడీ ఇదే ధోరణి అవలంబించారని, ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం చిరు వ్యాపారుల పొట్టపై కొట్టారని విమర్శించారు. రాముడు జన్మించిన భూమి అయోధ్య బీజేపీకి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందంటూ ఎద్దేవా చేశారు.

ప్రధాని మోడీ అభ్యంతరం

ఈ విధంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో తీవ్ర దుమారం రేగింది. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ లేచి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకొని, ఈ విషయం ఎంతో తీవ్రమైందని, హిందూ సమాజాన్ని హింసాత్మకమని పేర్కొనడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు రాహుల్ బదులిస్తూ.. "నరేంద్ర మోడీ ఒక్కరే మొత్తం హిందూ సమాజం కాదు, అలాగే ఆర్ఎస్ఎస్ ఒక్కటే హిందూ సమాజం కాదు" అని చెప్పుకొచ్చారు. తాను కేవలం ప్రధాని మోడీని, బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశానని, మొత్తం హిందూ సమాజాన్ని ఉద్దేశించి కాదని స్పష్టం చేశారు.

శివుని ఫొటో నిషేధమా?

అంతకుముందు.. రాహుల్ గాంధీ శివుని చిత్రం చూపించడంపై కూడా సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలో ప్లకార్డులు, ఫొటోలు ప్రదర్శించడం నిషేధం అని తేల్చి చెప్పారు. ఇందుకు రాహుల్ బదులిస్తూ ఈ సభలో శివుని బొమ్మని చూపించడం కూడా నిషేధమా? అని పదే పదే ప్రశ్నించారు. తన మెడను పాము చుట్టుముట్టినప్పుడు తాను వాస్తవాన్ని అంగీకరిస్తానని శివుడు చెప్పాడని, ఆయన చేతిలో ఉన్న త్రిశూలం అహింసకు ప్రతీక అని వివరించారు. ఒకవేళ హింసకి ప్రతీక అయితే, ఆ త్రిశూలం కుడిచేతిలో ఉండేదని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. తాను శివుని నుంచే ప్రేరణ పొందానని, ప్రతిపక్షంలో ఉన్నందుకు గర్వపడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఫైజాబాద్ ఎంపీ, సమాజవాదీ పార్టీ నేత అవధేష్ ప్రసాద్‌కు రాహుల్ గాంధీ షేక్‌హ్యాండ్ ఇచ్చి.. శభాష్ అని మెచ్చుకున్నారు.

అన్ని మతాల్లో ధైర్యం గురించి ఉంటుందని, హిందూ, ఇస్లాం, సిక్కు ఇలా అన్ని మతాలు ఎన్నో విషయాలను బోధిస్తాయని రాహుల్ చెప్పారు. శివుని ఫొటో చూపిస్తూ.. తమని తాము 24 గంటలపాటు హిందువులమని చెప్పుకునేవారిలో హింస, ద్వేషం, అసత్యం కూరుకుపోయి ఉంటుందని బీజేపీని ఉద్దేశిస్తూ విమర్శించారు. హిందూ మతం పేరు చెప్పి బీజేపీ అందరినీ భయపెడుతోందని ఆరోపించారు. తమని తాము హిందువులని ప్రచారం చేసుకునేవారు విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, అలాంటి వాళ్లు హిందువులే కారని విమర్శించారు. అసలు హింసని ప్రేరేపించే వాళ్లను హిందువులని ఎలా అనగలమని ప్రశ్నించారు.

మాది సామాన్యుడి మాట...

- మోడీది మనసులో మాట
- రాజ్యసభలో ప్రతిపక్షనేత ఖర్గే ఎద్దేవా
- 'అగ్నివీర్'తో యువకుల్లో ఆత్మ స్థైర్యం దెబ్బ
- ఆ తుగ్లక్ స్కీమ్‌ను రద్దు చేయాలి



ప్రధాని మోడీది మనసులోని మాట అయితే ప్రతిపక్షాలది సామాన్యుడి మాట అని రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. సోమవారం రాజ్యసభలో జరిగిన రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష పార్టీలు సామాన్య ప్రజానీకం గురించి మాట్లాడుతుంటే, ప్రధాని మోడీ మాత్రం తన మనసులోని మాట గురించి మాట్లాడుతుంటారని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో రాష్ట్రపతికి కీలక భూమిక ఉందని, తాము రాష్ట్రపతిని గౌరవిస్తామని చెప్పారు. ఈఏడాది రాష్ట్రపతి తొలి ప్రసంగం జనవరిలోనూ, రెండో ప్రసంగం జూన్‌లోనూ చేశారని, ఎన్నికల కోసం తొలి ప్రసంగం చేస్తే, రెండోది దానికి కాపీ మాత్రమేనని అన్నారు. దళితులు, మైనారిటీ వర్గాలు, వెనుకబడిన తరగతుల గురించి ఎక్కడా రాష్ట్రపతి తమ ప్రసంగంలో ప్రస్తావించనే లేదని, రాష్ట్రపతి ప్రసంగానికి ఒక విజన్ కానీ, డైరెక్షన్ కానీ లేదని పేర్కొన్నారు. గత ప్రసంగం తరహాలోనే ఈసారి కూడా ప్రభుత్వాన్ని అభినందించే మాటలే ప్రసంగమంతా ఉన్నాయన్నారు. మణిపూర్ రగులుతుండటాన్ని ఖర్గే ప్రస్తావిస్తూ, నినాదాలు ఇవ్వడంలో ప్రధానమంత్రి నిపుణుడని, ఏడాదిగా మణిపూర్ రగులుతున్నా ఆ రాష్ట్రంలో ఒక్కసారి కూడా ఆయన పర్యటించలేదని ధ్వజమెత్తారు. పార్లమెంటు కాంప్లెక్స్‌లోని మహాత్మా గాంధీ, అంబేద్కర్, ఇతర నాయకుల విగ్రహాలను తిరిగి యథాస్థానంలో ఉంచాలని డిమాండ్ చేశారు. అగ్నివీర్ పథ కాన్ని రద్దు చేయాలని, ఎలాంటి ప్రణాళిక లేకుండా తీసుకు వచ్చిన అగ్నివీర్ వంటి తుగ్లక్ స్కీముల వల్ల యువత మనో స్థైర్యం దెబ్బతిందని అన్నారు. అంతకు ముందు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్షల పేపర్ లీక్ వ్యవహా రంపై ఎంపీలు ఇచ్చిన నాలుగు నోటీసులను రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ తోసిపుచ్చారు. దీనిపై నిష్పాక్షిక విచారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించి నందున నోటీసులను తిరస్కరిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.



కూలుతున్న వంతెనలు

- పది రోజుల వ్యవధిలో ఐదు నేలమట్టం
- ఎట్టకేలకు మేల్కొన్న బీహార్ ప్రభుత్వం
- వివరణ ఇవ్వాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు

పాట్నా : బీహార్‌లో వంతెనలు కూలిపోతున్న ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. పది రోజుల వ్యవధిలో ఐదు వంతెనలు కూలిపోవటం ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ ఘటనల అనంతరం ఎట్టకేలకు బీహార్‌లోని రాష్ట్ర ప్రభుత్వం మేల్కొన్నది. నితీశ్ కుమార్ సర్కారు వివిధ శాఖల నుంచి వివరణాత్మక నివేదికలను కోరింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ వంతెనలను నిర్మించటంలో పాలుపంచుకున్న ఏజెన్సీలు, ప్రయివేటు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రహదారి నిర్మాణ, గ్రామీణాభివృద్ధి వంటి విభాగాలను కోరింది. తదుపరి చర్య తీసుకునే ముందు మేము వారి నివేదికల కోసం ఎదురు చూస్తున్నామని ముఖ్యమంత్రి కార్యాలయంలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వం జోక్యం లేకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదమున్నదని బీహార్ ఇంజినీరింగ్ సర్వీసెస్ అసోసియేషన్(బీఈఎస్ఏ) హెచ్చరింపుల తర్వాత బీహార్ సర్కారు నుంచి ఈ చర్య ప్రారంభం కావటం గమనార్హం. "ఇంజినీర్లను సస్పెండ్ చేయటం, కాంట్రాక్టర్లను శిక్షించటంతో ఎటువంటి ప్రయోజనం ఉండదు. కాబట్టి థర్డ్-పార్టీ తనిఖీ అవసరం" అని సామాజిక కార్యకర్త ఒకరు అన్నారు. మధుబనిలోని కోసి నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన నుంచి 77 మీటర్ల గిర్డర్ కూలిపోయిన రెండు రోజుల తర్వాత ప్రభుత్వం నుంచి పై ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రతిపక్షాలు ఆగ్రహం

వంతెనలు కూలిపోయిన ఘటనలు బీహార్‌లో షరా మామూలే అని తెలుస్తున్నది. ఏప్రిల్ 2022 నుంచి రాష్ట్రంలో 13 వంతెనలు కూలిపోయాయి. గత జూన్‌లో భాగల్‌పూర్‌లో రూ. 1,700 కోట్లతో నిర్మాణంలో ఉన్న అగువానీ-సుల్తాంగంజ్ వంతెనలో కొంత భాగం కూడా ఇందులో ఉండటం గమనార్హం. వంతెనలు కూలిపోయే ఘటనలు రాష్ట్రమంతటా ప్రమాద ఘంటికలు మోగించిందని ప్రతిపక్షాలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ నేతలు తమ ప్రమాణ స్వీకారాన్ని చేపట్టారని అన్నారు. రాజస్థాన్‌లోని బాన్సువాడలో ఎన్నికల ప్రచారంలో మోడీ చేసిన ప్రసంగంలో.. ముస్లింలను చొరబాటుదారులుగా, ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చే వారిని అవమానించారని అన్నారు. బీజేపీ బుల్డోజర్ పార్టీగా మారుతోందని, కమలం చిహ్నాన్ని ఇప్పుడు బుల్డోజర్‌గా మార్చవచ్చని ఎద్దేవా చేశారు.బీజేపీతో శ్రీరాముడు లేడనే విషయాన్ని లోక్‌సభ ఎన్నికలు రుజువు చేశాయని అన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మించినా ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోయిందని తెలిపారు. నాథూరామ్ బీజేపీలో ఉన్నారని, శ్రీరాముడు కాదని విమర్శించారు. నివాళులర్పించేందుకు అయోధ్యకు వెళ్లిన మోడీ మణిపూర్ వైపు వెనుదిరిగి చూడలేదని ధ్వజమెత్తారు. కేంద్రం నిర్వహించే అన్ని పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అవుతున్నాయని, లక్షల మంది విద్యార్థుల కలలు కల్లోలం అయ్యాయని, పరీక్షల నిర్వహణను రాష్ట్రాలకే వదిలేయాలని డిమాండ్ చేశారు. దక్షిణాది విద్యార్థులకు ప్రవేశాన్ని నిరాకరించడానికి జేఎన్‌యూ సహా కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో కొత్త ప్రవేశ పరీక్షను ప్రవేశపెట్టారని విమర్శించారు. పాఠ్యపుస్తకాలు కవిత్వీకరించబడ్డాయని, గాంధీజీ జ్వరంతో చనిపోయాడని, ఆస్పత్రికి తీసుకెళ్లినది నాథూరామ్ అని రేపు బోధిస్తారని విమర్శించారు.


బ్రిట్టాస్ ప్రసంగంపై చైర్మెన్ జోక్యం



రాజ్యసభలో ధన్యవాద తీర్మానం సందర్భంగా జాన్ బ్రిటాస్ ప్రసంగానికి చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ పదే పదే అంతరాయం కలిగించారు. బ్రిట్టాస్ ప్రసంగంలో సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోడీపై తీవ్ర విమర్శలు చేయడంతో ధన్‌ఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రచారకులకు లీక్ అవుతున్న ప్రశ్నాపత్రాలను రికార్డు నుంచి తొలగించాలని బ్రిట్టాస్‌ను ధన్‌ఖర్ కోరారు. ఆర్ఎస్ఎస్ అనే పదం ఎప్పటి నుంచి 'అన్‌పార్లమెంటరీ'గా మారిందని బ్రిట్టాస్ చైర్మెన్‌ను ప్రశ్నించారు. బ్రిట్టాస్ ప్రసంగం తప్పుదారి పట్టించిందని, అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారని ధన్‌ఖర్ అన్నారు. దీంతో మీరే తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని బ్రిట్టాస్ తిప్పికొట్టారు. చైర్మెన్ స్వయంగా ప్రసంగాన్ని అడ్డుకోవడం సరైన చర్య కాదని బ్రిట్టాస్ అన్నారు. బీజేపీ సభ్యులు కూడా పలుమార్లు జోక్యం చేసుకున్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ, మహువా మొయిత్రా, ఎ రాజా, మనీష్ తివారీ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే, సంజయ్ సింగ్, మనోజ్ ఝూ, తిరుచ్చి శివ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. లోక్‌సభలో అనురాగ్ ఠాకూర్ ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బాన్సూరి స్వరాజ్ మద్దతుగా మాట్లాడారు. మంగళవారం లోక్‌సభలో చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇవ్వనున్నారు.

కొత్త చట్టాల కింద మధ్యప్రదేశ్‌లో తొలి కేసు

ఢిల్లీలోనూ ఒకటి



న్యూఢిల్లీ : నూతన నేర చట్టాలను జులై 1 అర్ధరాత్రి నుంచి మోడీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. అమల్లోకి వచ్చి 20 నిమిషాలు కూడా గడవక ముందే మధ్యప్రదేశ్‌లో ఈ నూతన చట్టల కింద తొలి కేసు నమోదయింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని హనుమాన్‌గంజ్ పోలీస్‌స్టేసన్‌లో 12:16 ఎఎం గంటలకు కొత్త చట్టాల కింద ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. దీనికి 11 నిమిషాలకు ముందు జరిగిన సంఘటనపై ప్రఫుల్ చౌహన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ నమోదయింది. తాను భోజనం తరువాత టీ తాగడానికి వెళ్లేతే అక్కడ టీ విక్రేత పాత వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని తనపై దుర్భాషలు ఆడారని ప్రఫుల్ చౌహన్ ఫిర్యాదు చేశాడు. దీంతో కొత్త చట్టం భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 296 కింద పోలీసులు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తున్నట్టు ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి ప్రకటించారు. కొత్త చట్టం కింద తొలి కేసును వీధి వ్యాపారిపై నమోదు చేయడం సరికాదనే అభిప్రాయంతో ఈ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసినట్టు తెలిపారు. ఎఫ్ఐఆర్‌ను సమీక్షించే నిబంధన కింద అధికారులు ఎఫ్ఐఆర్ రద్దు చేసినట్టు చెప్పారు. అయితే మధ్యప్రదేశ్‌లోనే ఈ కొత్త చట్టాల కింద తొలి కేసు నమోదైనట్టు అమిత్‌షా వెల్లడించారు. అమిత్ షా వివరాల ప్రకారం గ్వాలియర్ జిల్లాలోని హజీరా పోలీస్ స్టేషన్‌లో జులై 1, సమయం 12:24 ఎఎం గంటలకు ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు. అర్ధరాత్రి అయిన కొన్ని నిమిషాల తరువాత తన యమహా ద్విచక్ర వాహనం దొంగతనానికి గురయిందని సౌరబ్ నర్వరియా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ప్రకారం ఈ బైక్ విలువ రూ. 1.10 లక్షలు.

అలాగే, కొత్త చట్టాల కింద ఢిల్లీలోనూ కేసు నమోదయింది. కమ్లా నగర్ పోలీసుస్టేషన్‌లో ఈ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్టు అధికారులు చెప్పారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్నప్పుడు బీహార్‌లోని పాట్నాకు చెందిన పంకజ్ కుమార్ అనే విక్రేత ప్రజలకు అడ్డంకులు కల్పిస్తున్నాడని ఆరోపిస్తూ హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. దీంతో బిఎన్ఎస్ సెక్షన్ 285 (పబ్లిక్‌వే లేదా నావిగేషన్ లైన్‌లో ప్రమాదాలు, అడ్డంకులు సృష్టించడం) కింద కేసు నమోదు చేశారు. ఈ నేరం కనుక రుజువయితే రూ. 5 వేలుతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తారు. అలాగే భారతీయ నాగరిక సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 173 కింద కూడా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ)లకు గత డిసెంబర్‌లోనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో మోడీ ప్రభుత్వం సోమవారం నుంచి వీటిని అమల్లోకి తీసుకొచ్చింది.

ఈ చట్టాలపై ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీ మధ్య మొదటి నుంచి వివాదం నడుస్తోంది. ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేసి మరీ మోడీ ప్రభుత్వం వీటిని గత ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో మోడీ ప్రభుత్వం ఆమోదించుకుంది. కొత్త చట్టాలు పేద, శ్రామిక, బలహీన వర్గాలపై అణిచివేతకు సాధనంగా ఉపయోగపడతాయని ప్రతిపక్ష నాయకులు ప్రధానంగా ఆరోపిస్తున్నారు.

వలసవాద చట్టాల ప్రతిరూపాలే

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2020లో ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రణబీర్ సింగ్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ చట్టాలకు చేయాల్సిన సమగ్ర సవరణలపై ప్రభుత్వం గవర్నర్లు, ముఖ్యమంత్రులు, హైకోర్టులు, సుప్రీంకోర్టు, బార్ కౌన్సిల్స్, లా యూనివర్సిటీలు, పార్లమెంట్ సభ్యుల నుండి సూచనలు, సిఫార్సులు కోరింది. అదే సమయంలో కమిటీ కూడా ప్రజల నుండి సూచనలు కోరింది.



రాజ్యాంగ విరుద్ధమని చెప్పినా...

ఉద్దేశపూర్వకంగా చేయకపోయినా నిర్లక్ష్యంగా, వేగంగా వాహనాన్ని నడిపి వ్యక్తి మరణానికి కారకుడైతే పది సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించేందుకే బీఎన్ఎస్‌లో క్లాజ్ 104 (2)ని ఉద్దేశించారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసు అధికారికి లేదా మెజిస్ట్రేటుకు సమాచారం ఇవ్వకుండా పారిపోయినా ఈ శిక్షకు గురవుతారు. దీనిని నిరసిస్తూ ట్రక్కు, బస్సు, ఇంధన ట్యాంకర్ డ్రైవర్లు దేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. ఈ క్లాజును తిరగరాయాలని కమిటీ సూచించింది. నిబంధన స్పష్టంగా లేదని అభిప్రాయపడింది. పైగా అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 20 (3)కి విరుద్ధంగా ఉన్నదని తెలిపింది. డ్రైవర్ల నిరసన కొన్ని చోట్ల హింసకు దారితీయడంతో ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ ప్రతినిధులతో చర్చించిన తర్వాతే చట్టాన్ని అమలు చేస్తామని కేంద్ర హోం కార్యదర్శి హామీ ఇచ్చారు. అయితే క్లాజును కొనసాగిస్తూ చట్టాన్ని రూపొందించారు.



అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ముసాయిదా బిల్లులను బహిర్గతం చేయలేదు.

కమిటీ సూచనలు బుట్టదాఖలు

బిల్లులను 2023 ఆగస్ట్ 24న హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపారు. ఈ కమిటీ కొన్ని సవరణలు ప్రతిపాదించింది. సిఫార్సులు చేసింది. ముఖ్యంగా బీఎస్ఎస్, బీఎన్ఎస్ఎస్‌పై కనీసం మూడు అసమ్మతి నోట్లు అందజేసింది. కాగా సమీక్ష కోసం ఏర్పడిన కమిటీ కేవలం 12 సమావేశాలు మాత్రమే నిర్వహించి మమ అనిపించింది. బిల్లులను పరిశీలించడానికి మరింత సమయం అవసరమని కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరికి కమిటీ గత సంవత్సరం నవంబర్ 19న ముసాయిదా నివేదికను సమర్పించింది. క్రిమినల్ చట్టాలకు అంగీకారం తెలిపింది. అయితే కమిటీ చేసిన పలు సిఫారసులకు ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.

నిబంధనలు బేఖాతరు

ముసాయిదా బిల్లులను కానీ లేదా వాటిలోని కీలక అంశాలను కానీ కనీసం 30 రోజులు పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, ఆ తర్వాతే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని నిబంధనలు ఉన్నాయి. అయితే చట్టసభలో ప్రవేశపెట్టేంతవరకూ వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచలేదు. ఉభయ సభలకు చెందిన 146 మంది సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పార్లమెంటులో ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న సమయంలోనే ప్రభుత్వం క్రిమినల్ చట్టాలను ఆమోదింప జేసుకుంది. క్రిమినల్ చట్టాల అమలు ఆచరణలో ఎన్నో సమస్యలకు దారితీస్తుందని ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

బిల్లుల ఆమోదంలో ప్రభుత్వం చూపిన తొందరపాటుపై అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ అవన్నీ అరణ్య రోదనలే అయ్యాయి.

బార్ అసోసియేషన్ల నిరసన

నూతన చట్టాల అమలును నిలిపివేయకపోతే నిరవధిక ఆందోళనలు, నిరసనలు తప్పవని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సహా పలు బార్ అసోసియేషన్లు ప్రకటించాయి. పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్ సోమవారాన్ని 'బ్లాక్ డే'గా పాటించింది. క్రిమినల్ చట్టాలపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. నేషనల్ లా యూనివర్సిటీ కూడా నూతన చట్టాలపై విమర్శలు కురిపించింది. వలసవాద తరహా అధికారాలు కొనసాగుతాయని, పైగా అవి మరింత విస్తరిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. నూతన చట్టాల కారణంగా క్రిమినల్ వ్యాజ్యాల సంఖ్య 30 శాతం మేర పెరుగుతుందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ తెలిపారు. చట్టాల అమలుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆమె కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు ఓ లేఖ రాశారు.

12 మార్పులతో సరి

క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని జూన్ 23న పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) ఓ బహిరంగ లేఖ రాసింది. అమలును వాయిదా వేస్తే ఆకాశమేమీ ఊడిపడదని హెచ్చరించింది. పాత చట్టాల నుండి నూతన చట్టాలకు మారాలంటే వాటిని అమలు చేయాల్సిన సంస్థలు, వ్యక్తులకు తగినంత శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని అంటూ కేవలం 26 రోజులు మాత్రమే శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకున్నారని తెలిపింది. నూతన చట్టాలలో మెజారిటీ నిబంధనలేవీ మారలేదని, కేవలం 12 మార్పులు చేసి అయిందనిపించారని, ఐదు పేజీల సవరణతో సరిపెట్టారని ఎత్తిచూపింది.

న్యాయ సంహితలోని సెక్షన్ 106(1)(2)లను రద్దు చేయాలి

తెలంగాణ పెట్రోలియం గ్యాస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత న్యాయ సంహిత చట్టంలోని హిట్ అండ్ రన్ సెక్షన్106(1),(2)లను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ పెట్రోలియం అండ్ గ్యాస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదాలు జరిగిన తర్వాత డ్రైవర్ అక్కడే ఉండకపోతే ఏడేండ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించాలని చట్టంలో రూపొందించడం దారుణమని పేర్కొన్నారు. అక్కడే ఉంటే ఆవేశంలో డ్రైవర్లను కొట్టి చంపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ట్రాన్స్‌పోర్టు రంగంలో లక్షలాది డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు. ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధపడటం లేదనీ, 80 శాతం ప్రమాదాలకు రోడ్లు సరిగా లేకపోవడమేనని వివరించారు. డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రమాదాలకు డ్రైవర్లను కారణం చేస్తూ కఠిన శిక్షలు, భారీ పెనాల్టీలు విధించడం దారుణమని పేర్కొన్నారు.

నవతెలంగాణ

నువ్వు నడిచే దారిలో అరుస్తున్న ప్రతి కుక్కకి సమాధానం
చెప్పుకుంటూ పోతే, ఎప్పటికీ గమ్యాన్ని చేరలేవు - శ్రీశ్రీ

మంగళవారం 02 జులై 2024
www.navatelangana.com

సంపాదకీయం

మనసులేని మాటలు...



ప్రధాని మాట్లాడుతున్న మనసులో మాటలు ఎవరివి? ప్రజలు ఎన్నుకున్న ప్రధానమంత్రివా? లేక నరేంద్ర దామోదరదాసు మోడీవా? అర్థం కావడం లేదు. అవి కేవలం మోడీ మాటలే అయితే సమస్యే లేదు. కాదు ఆయన 140 కోట్ల మందికి ప్రతినిధి అయితే ఆయన మనసు నుండి రావాల్సిన మాటలు ఇవి కావు. ఈ దేశ ప్రధానిగా ప్రజలకు ఒక నమ్మకాన్ని విశ్వాసాన్ని కలిగించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. భావోద్వేగ భాషకు, ఆవేశం ఉట్టిపడే హావభావాలకు పెట్టింది పేరు మన ప్రధానమంత్రి... మోడీ వక్తృత్వ పటిమ నిజంగానే గొప్పది. గొంతు చించుకుని మాట్లాడే మోడీ "మన్ కీ బాత్" ప్రసంగాలలో మాత్రం చాలా మంద్రంగా మాట్లాడ తారు. ఆ ప్రసంగాలలో సారం కన్నా ప్రసంగించే తీరుకే అధిక ప్రాధాన్యం. ఆదివారంనాటి మన్‌కీ బాత్ 111వ ఎపిసోడ్‌లో ప్రధాని జాతీయ అంతర్జాతీయ విషయాలు అనేకం మాట్లాడారు. కానీ, అందులో ప్రజా సమస్యల ప్రస్తావన లేకపోవడం శోచనీయం.

ప్రపంచంలో ఏ దేశంలోనూ ఏ నాయకుడూ మా నాయకుడికి సరిపోరని వత్తాసు పలికే గోడీ మీడియా మచ్చుకైనా వారి పాలనలో బయటపడిన స్కాముల గురించి ప్రస్తావించదు. ప్రజాస్వామ్య దేశంలో పాలకుల మనసులో మాటలు ప్రజలు వినడమే కాదు. ప్రజల మనసులో మాటలు కూడా పాలకులు వినగలగాలి. కానీ, మన ప్రధాని మోడీ గారిదంతా 'వన్ వే ట్రాఫికే' తప్ప ఎన్నడూ ప్రజా సమస్యలు తెలుసుకున్న పాపాన పోలేదు. అనేకానేక జాతీయ, అంతర్జాతీయ ఘటనలపై మన్ కీ బాత్‌లో లెక్చర్లిచ్చే మోడీ, నీట్, నెట్లపై మూగనోము ఎందుకు పట్టారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

చాలా చిన్న చిన్న విషయాలను కూడా మహా నాటకీయంగా చెప్పగల నేర్పరి మన ప్రధాని. 'కర్తుంబి గొడుగులు' తయారు చేసే గిరిజన సోదరీ మణుల గురించి ఆయన మన్‌కి బాత్‌లో మాట్లాడు తుంటే... మణిపూర్ గిరిజనుల గోడుపట్టని ప్రభుత్వం ఇతనిదేనా?అనిపిస్తుంది! ఆల్ ఇండియా రేడియో సంస్కృత బులెటిన్ ప్రసారమై 50 ఏండ్లు పూర్తి చేసుకుందన్న వారి పలుకుల్లో రానున్న రోజుల్లో వేదాధ్యయనం తప్పనిసరన్న ఆయన అంతరంగమే బోధ పడుతోంది. టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనను చారిత్రాత్మక విజయంగా శ్లాఘించడం, టోక్యో ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్ల ప్రదర్శనకు పులకరించిన ఆనందాన్ని పంచుకున్న ప్రధాని... ఢిల్లీ వీధుల్లో పోరాడి పోరాడి అలసిపోయిన రెజ్లర్ల గురించి ఎందుకు మాట్లాడలేదో వివరిస్తే బాగుండేది. అయినా ఆయనదంతా 'వన్ వే ట్రాఫిక్' విన్యాసం కదా! ఇవన్నీ అడిగే వారెవరూ, అడుగు దామన్నా అవకాశమెక్కడిది?

అరకు ఏజెన్సీలో పండించే ప్రత్యేక కాఫీ గురించి ఆయన దేశానికి చెబుతుంటే అది ఆ రాష్ట్రాన్ని ప్రత్యేక హోదాకు దూరం చేసే ఎత్తుగడ అన్న సంగతే మనం గుర్తించలేము. చివరకు కాఫీ పండించే గిరిజన రైతులకు గిట్టు బాటు ధర, భరోసా కల్పిం చడంలో తన వైఫల్యాల గురించి చెప్పకుండా చాలా చాకచక్యంగా వ్యవహరించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' అంటూ ప్రతి ఒక్కరు తమ తల్లి పేరు మీద మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు బాగానే ఉంది' మరి అదే నోటితో ఈ దేశంలో భద్రతలేని ఆడబిడ్డల బతుకుల గురించి కూడా ప్రస్తావించాలి కదా ? 'మనందరి జీవితంలో తల్లికి అత్యున్నత స్థానం ఉంది' అని చెప్పిన పెద్దమనిషి ఆ అమ్మల జీవితాలకు ఏం భరోసా ఇచ్చారు? చిత్తశుద్ధీ, ఆచరణ లేకుండా ఎన్ని నినాదాలు ఇచ్చినా ఏం ఉపయోగం?

జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న తరుణంలో శ్రీనగర్‌లో యోగా దినోత్సవం నాడు తన యోగ నిద్రాపారవశ్యం గురించి చెప్పారు బాగానే ఉంది కానీ, ఆ మాయా నిద్ర వీడితేనే కదా దేశంలో సామాన్యుల పరిస్థితి తెలిసేది. యోగా దినోత్సవాన్ని కూడా ఒక ప్రచార విన్యాసంగా ఎన్నికల కోసం ఉపయోగించుకోవడం వీరికే చెల్లుతోంది. ప్రపంచంలోని 24 మంది ప్రముఖ కవుల విగ్రహాలను తుర్క్ మెనిస్థాన్ అధ్యక్షుడు ఆవిష్కరించిన విషయాలను చెప్పిన నాయకునికి.. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేసిన నీట్, నెట్ స్కాంల గురించి మాట్లాడేందుకు మాత్రం నోరు పెగ లదు. భావి భారత పౌరుల జీవితాల గురించిన ఆలోచన దేశ ప్రధాని మనసులో లేకపోవడం కడు విచారకరం అంటూ ఆ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ప్రపంచంలో ఏ దేశంలోనూ ఏ నాయకుడూ మా నాయకుడికి సరిపోరని వత్తాసు పలికే గోడీ మీడియా మచ్చుకైనా వారి పాలనలో బయటపడిన స్కాముల గురించి ప్రస్తావించదు. ప్రజాస్వామ్య దేశంలో పాలకుల మనసులో మాటలు ప్రజలు వినడమే కాదు. ప్రజల మన సులో మాటలు కూడా పాలకులు వినగలగాలి. కానీ, మన ప్రధాని మోడీ గారిదంతా 'వన్ వే ట్రాఫికే' తప్ప ఎన్నడూ ప్రజా సమస్యలు తెలుసుకున్న పాపాన పోలేదు. అనేకానేక జాతీయ, అంతర్జాతీయ ఘటనలపై మన్ కీ బాత్‌లో లెక్చర్లిచ్చే మోడీ, నీట్, నెట్లపై మూగనోము ఎందుకు పట్టారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కనీసం నష్టపోయిన విద్యార్థులకు ఓదార్పు మాటలు చెప్పడానికి కూడా ప్రధానికి నోరు రాలేదు. ప్రజల ప్రస్తావన లేని, వారి సందేహాలకు జవాబులు దొరకని కార్యక్రమమేదైనా ప్రజల మన్నన పొంద జాలదు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా వారి వెనకటి బుద్ధి మారలేదు. 'మన్‌కీ బాత్'లో వినసొంపైన ప్రసంగాలు, నీతి బోధలు తప్ప. ప్రజా సమస్యల ప్రస్తావనే ఉండదు. ఇదంతా 'పులి-బాటసారి' కథ బాపతే.

మెయిల్ @ నవతెలంగాణ

నగరాల్లో నీటి ఎద్దడిని నివారించలేమా?


దాదాపు గత ఐదు దశాబ్దాలుగా ధరిత్రి దినోత్సవమని, ప్రపంచ జల దినోత్సవమని, పర్యావరణ దినోత్సవమని ప్రపంచ దేశాలతో సహా మన దేశంలోనూ జరుపుతున్నారు. కానీ ఆ దినోత్సవాల ఆశయాల దిశగా పయనం ఉన్నదా? అంటే లేదనే చెప్పాలి. లక్ష్యాలు పెట్టుకున్నంత మాత్రాన చిత్తశుద్ధి లేకపోతే సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటాయి. ఎందుకంటే భూమ్మీద అనేక విపత్తులు సంభవిస్తున్నాయి. పారిశ్రామికీకరణ వలన అడవులు నరికివేత, వివిధ రకాల కాలుష్యాలు పెరగటం, ఆధునీకరణ పేరుతో పట్టణాలు, నగరాలు జనాభాతో కిటకిట, హరిత విప్లవం ద్వారా అధిక దిగుబడులు నిమిత్తం వాడే ఫెర్టిలైజర్స్ వాడకం, పెస్టిసైడ్స్ వలన భూగర్భ జలాలు కలుషితం, అవసరాలకు మించి భూగర్భ జలాలు తోడటం, ప్లాస్టిక్ వాడకం పెరుగుట ద్వారా మొత్తం జల వ్యవస్థని ప్రశ్నార్థకం చేస్తోంది. దీనికి తోడు, చెరువులు, కుంటలు, బావులు ఆక్రమణలకు గురవడంతో భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతో మొత్తం మెట్రో నగరాల్లో తాగునీటికి కటకట ఏర్పడింది. బిందె నీళ్ల కోసం గంటల తరబడి వేచి చూసే పరిస్థితి. దీనికి కారణం మానవ తప్పిదాలే అని ఇకనైనా అందరూ గుర్తించాలి, గ్రహించాలి.

దక్షిణ ఆఫ్రికా రాజధాని కేప్‌టౌన్ ఎంత నీటి ఎద్దడిని అనుభవిస్తుందో, త్వరలో మనదేశంలో చాలా నగరాలు, పట్టణాలు నీటి బాధిత నగరాలుగా ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే బెంగళూరు, చెన్నయ్, దేశ రాజధాని న్యూఢిల్లీలో మంచినీటి కొరత తీవ్రంగా ఉంది. దీనికి ప్రధాన కారణం భూగర్భ జలాలు అడుగంటి పోవడమే. మితిమీరిన జనాభా పెరగటం. అవసరాలకు మించి నీటి వినియోగం పెరగడం. బోరుబావులు ఎక్కువగా వేయడం. ఇక గ్లోబల్ వార్మింగ్ వలన వాతావరణ మార్పులు సంభవిస్తూ, కాలాలు గతి తప్పుతున్నాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవు తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో ఉత్తర భారతదేశంలో పగటి ఉష్ణోగ్రతలు భారిగా పెరుగు తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో కూడా గత 120 సంవత్సరాల క్రితం రికార్డు అయిన ఉష్ణోగ్రతలను బ్రేక్ చేసి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భూగర్భజలాలలు అడుగంటాయి. భవిష్యత్తులో మరింత నీటి ఎద్దడిని ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ముఖ్యంగా అడవులు రక్షించుకోవాలి.మొక్కలు పెంచాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. గుంతలు ఏర్పాటు చేయాలి. బోరు బావులుపై నియంత్రణ ఉంచాలి. పట్టణ పరిపాలన శాఖ, టౌన్ ప్లానింగ్, నీటి సరఫరా వ్యవస్థ పకడ్బందీగా పని చేయాలి. ప్రతీ పౌరుడు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలి. నీటిని వృథా చేయరాదు. చెరువులు కుంటలు పూడికలు తీయాలి. ఆక్రమాలను తొలగించాలి. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం, నియమనిబంధనలు అనుసరించి ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలి. ప్రకఅతి వనరులు దోపిడిపై నిఘా పెంచాలి. వ్యర్థాలు నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి. వలసలు నియంత్రణ చేయగలిగితే చాలావరకూ సమ స్యలు పరిష్కారమవుతాయి. ముఖ్యంగా ప్రభుత్వాలు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో, సహకారంతో పనిచేయటం ద్వారానే నీటి సమస్యలను అధిగమించగలం. అదే విధంగా రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ సక్రమంగా జరగాలి. సమస్యలు పరిష్కారం చేసుకోవాలి. నదుల కాలుష్యం తగ్గించాలి. పూడికలు తీయాలి. కాలువలు చెరువుల నిర్వహణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు అన్ని ప్రాంతాల్లో లభించే విధంగా పరిశ్రమలు, వ్యవస్థలు నెలకొల్పాలి.అప్పుడు ఎక్కడిక్కడే ఉపాధి దొరకడం ద్వారా మెట్రో నగరాల్లో ఒకేచోట జనాభా కేంద్రీకరణ తగ్గుతుంది. ఇలా అనేక సమస్యల నుంచి బయటపడే అవకాశముంది. పాలకులు దృష్టి పెట్టి నీటి కొరత లేకుండా, భవిష్యత్తులో రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- రావుశ్రీ

పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం- ప్రత్యేకతలు



ప్రభాత్ పట్నాయక్

ఆర్థిక వ్యవస్థ అనేది ఏ కాలం నాటిదైనా, పేదరికం అనేది ఒకే విధంగా ఉంటుంది అనే అభిప్రాయం కొందరికి ఉంది. కొంతమంది పేరు గడించిన ఆర్థికవేత్తలు సైతం ఇదే అభిప్రాయంతో ఉంటారు. కాని అంతకు మునుపు ఉన్న వ్యవస్థలతో పోల్చితే పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం పూర్తి విభిన్నంగా ఉంటుంది. ఉత్పత్తి విధానం ఏదైనప్పటికీ, కొన్ని కనీస అవసరాలను పొందగలిగే స్తోమత గనుక లేకుంటే దానిని పేదరికంగా గణాంకవేత్తలు పరిగణిస్తారు. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థకు స్వత:సిద్ధమైన సామాజిక సంబంధాల ఫలితంగా కేవలం కనీస అవసరాలను పొందలేని పరిస్థితి మాత్రమే గాక తీవ్రమైన అభద్రత, ఆత్మగౌరవాన్ని సైతం కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయి. ఇదంతా కలిసి ఆ పేదరికపు స్థితిని దుర్భరం చేస్తాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని పేదరికానికి నాలుగు లక్షణాలు ఉంటాయి. మొదటిది: వారి పరిస్థితులతో నిమిత్తం లేకుండా ప్రభుత్వానికి వారు చెల్లించవలసినది తప్పనిసరిగా చెల్లించితీరాలి. దీని వలనవాళ్లు తమకున్న ఆస్తులను పోగొట్టుకుని, మరింత పేదరికంలోకి దిగజారి చివరికి దిక్కు లేనివారుగా అయిపోతారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు మునుపు ఉన్న వ్యవస్థలో, ఉదాహరణకు, మొగల్ చక్రవర్తుల కాలంలో రైతులు ప్రభుత్వానికి తాము పండించిన పంటలో ఒకానొక భాగాన్ని శిస్తుగా చెల్లించవలసి వుండేది. అంటే పంటలు సరిగా పండని కాలంలో వాళ్లు తక్కువ మొత్తంలో శిస్తు చెల్లించేవారు. పంటల దిగుబడి తగ్గినందువలన పడే భారాన్ని రైతులు కొంత, రాజు కొంత పంచుకునేవారు. కాని బ్రిటిష్ హయాంలో నెలకొన్న పెట్టుబడిదారీ విధా నంలో పండిన పంటతో నిమిత్తం లేకుండా కేవలం కొంత భూభాగాన్ని ఉపయోగించి వ్యవసాయం చేయడానికి అనుమతి పొందినందుకుగాను, భూమిశిస్తు చెల్లించవలసిన విధానం అమలులోకి వచ్చింది. పంటలు పండినా, పండకపోయినా, ఈ శిస్తు మాత్రం తప్పదు. అంటే కరువు, కాటకాల భారాన్ని ప్రభుత్వం పంచుకోదు. పేదలే భరించాలి. ప్రభుత్వానికి రావలసిన ఆదాయం తగ్గదు. ఆ శిస్తులు చెల్లించలేక క్రమంగా రైతులు అప్పులపాలై, తమ భూములను వడ్డీ వ్యాపారులకు కోల్పోయి మరింత దిగజారిపోయేవారు. ఆ విధంగా పేదలు తమకుండే కొద్దిపాటి భూమినీ కోల్పోయి దిక్కూ మొక్కూ లేని స్థితికి దిగజారడం పెట్టుబడిదారీ విధానంలో ఒక లక్షణంగా మనకి కనిపిస్తుంది. జరిగిన ఉత్పత్తిలో ఒక భాగాన్ని చెల్లించే పద్ధతి బదులు దానితో నిమిత్తం లేకుండా, ఉత్పత్తి జరిగినా, జరగకపోయినా ఒక నిర్దీత మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సిందే. ఈ సూత్రం కారణంగా పేద రైతులు తమ భూములను వడ్డీ వ్యాపారుల పరం చేసి నిరాధారంగా మరింత దారిద్ర్యంలోకి దిగజారివడం జరుగుతుంది. అంటే పెట్టుబడిదారీ విధానం పేదలను దరిద్రం లోంచి బయటకు లాగేందుకు కాక, వారిని మరింత దారిద్ర్యం లోకి నెడుతుంది. పేదరికంలో ఉన్నవారి వినియోగ శక్తిని పెంచే బదులు, వారి దగ్గర మిగిలి వున్న కొద్దిపాటి సంపదను సైతం హరిస్తుంది. ఇది ఏదో యథాలాపంగా జరిగే ప్రక్రియగా కాకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థలో నిబిడీకృతమై ఉండే ప్రక్రియగా మనం చూడాలి.

ఇప్పుడు మన దేశంలో దాదాపు ఎనబై కోట్ల మంది ప్రజానీకానికి నెలకు తలా ఐదు కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఎంత మేరకు కిందిదాకా సవ్యంగా అందుతోంది అన్న విషయంగాని, ఎంతకాలం ఈ పథకాన్ని కొనసాగిస్తారన్న విషయంగాని చూడాల్సిందే. అదలా ఉంచితే ఇటువంటి స్కీముని శాశ్వతంగా కొనసాగిస్తే అదే పేదరికాన్ని పరిష్కరిస్తుంది అని భావించడం పొరపాటు. పేదరికాన్ని ఈ పెట్టుబడి దారీ వ్యవస్థలో లేకుండా చేయాలంటే, అందరికీ ఉపాధిని కల్పించడం, విద్య, వైద్యం. వృద్ధాప్యంలో భద్రత, ఆహారం కల్పించడం జరగాలి. అప్పుడే పేదలు కోల్పోయిన తమ ఆత్మగౌరవాన్ని తిరిగి పొంద గలుగుతారు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో తాము సమాన భాగస్వాములమేనని అనుకోగలుగుతారు. కాని ఈ పనులు జరగాలంటే అది నయా ఉదారవాద పెట్టుబడిదారీ చట్రాన్ని అధిగమించి బయటపడాల్సిందే.

ఇక రెండవ లక్షణం: పెట్టుబడిదారీ దశలో పేదలు వ్యక్తులుగానో, వ్యక్తిగత కుటుంబాలుగానో ఆ పేదరికపు ఈతి బాధల్ని భరిస్తారు. అదే అంతకు ముందున్న సమాజాలలో ఏదైనా కష్టం వస్తే ఒక సమూహంగా -అది కుల సమూహంగా కాని, లేదా మొత్తం గ్రామ ప్రజలంతా కాని- దానిని భరించే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా కరువు కాటకాల సమయంలో ఇది వ్యక్తం అయేది. పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తి లేదా వ్యక్తిగత కుటుంబం ఒక స్వతంత్ర ఆర్థిక యూనిట్‌గా పరిగణించబడుతుంది. అందుచేత ఈ సమాజంలో పేదలు ఆ పేదరికపు కష్టాలను వ్యక్తులుగా, తమ సమూహంతో సంబంధం లేకుండా ఎవరికి వారుగా అనుభవించాల్సి వుంటుంది.

మార్క్సిస్టులు తప్ప తక్కిన ఆర్థికశాస్త్ర నిపుణులు ఎవరూ ఈ తేడాలను చూడలేరు. ఎందుకంటే వారికి చారిత్రక పరిశీలన ఉండదు. చరిత్ర పట్ల గుడ్డితనాన్ని ప్రదర్శించే సాంప్రదాయ ఆర్థికవేత్తలను మార్క్స్ నిశితంగా విమర్శించాడు. ఒక వ్యక్తిని అతడు లేదా ఆమె జీవించివున్న కాలంతో, అప్పటి పరిస్థితులతో నిమిత్తం లేకుండా చూడడం, ఏ కాలంలోనైనా వ్యక్తి అదే వ్యక్తిగా మార్పు లేకుండా ఉంటాడని అనుకోవడం సాంప్రదాయ ఆర్థిక వేత్తల విధానం. నయా సాంప్రదాయ ఆర్థికవేత్తలైన కార్ల్ మెంజెర్, స్టాన్లీ జెవోన్స్ వంటి వారు కూడా వ్యక్తిని అతడి చుట్టూ ఉండే సామాజిక పరిస్థితుల నుండి విడదీసి కాలానికి అతీతమైన 'వ్యక్తి' చుట్టూ తమ ఆర్థిక విశ్లేషణలను అల్లేవారు. ఆ కారణంగా వీరంతా పెట్టుబడిదారీ వ్యవస్థలోని పేదరికానికి, అంతకు పూర్వపు దశలలోని పేదరికానికి గల తేడాను చూడలేకపోయారు. వ్యక్తిగా పేదరికపు ఈతిబాధలను ఒంటరిగా భరించడానికి, సామూహికంగా అంతకు ముందుకాలంలో భరించినదానికి తేడా వారి పరిగణనలో లేదు.

సమూహం నుండి విడిపోయిన, పరాయీకరణ చెందిన వ్యక్తులుగా పెట్టుబడిదారీ దశలో పేదలు ఉంటారు. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడానికి వారు మళ్లీ సంఘాల రూపంలో సామూహిక ప్రతిఘటనలకు పూనుకునే వరకూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఆ విధంగా ఒంటరిగా మిగిలిపోవడం వలన పేదరికపు ఈతిబాధలనే గాక, వాటి పర్యవసానంగా కలిగే తీవ్ర మానసిక ఒత్తిళ్లకు కూడా వారు లోనవుతారు.

ఇక మూడో లక్షణం గురించి చూద్దాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకవైపు హీనమైన వేతనాలతో పనులు చేసేవాళ్లు. మరోవైపు ఉద్యోగ అవకాశాలే లేనివాళ్లు ఉంటారు. ఇలా అవకాశాలు లేనివాళ్లనే రిజర్వు సైన్యం అంటాం. ఈ రిజర్వు సైన్యానికి పేదరికపు కష్టాలు మరీ ఎక్కువగా ఉంటాయి.



తాము ఎందువలన పేదరికంలో మగ్గవలసి వచ్చిందో ఆ కారణాలు పేదలకు స్పష్టంగా తెలియకపోవడం. అంతకు ముందున్న సమాజాల్లో జరిగిన ఉత్పత్తి ఎంతో, దానిలో భూస్వామి లేదా రాజు ఎంత వాటా పట్టుకుపోతున్నాడో స్పష్టంగా కళ్ల ముందు కనపడేది. ఒకవేళ ఉత్పత్తి తగ్గితే దానివలన తమ అవసరాలను ఏమేరకు కుదించుకోవలసి వస్తుందో వారికి స్పష్టంగా తెలిసేది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో తమకు ఎందుకు ఉపాధి దొరకడం లేదో అందులో జీవించే పేదలకు తెలియదు. అలాగే ఉన్నట్టుండి ధరలు ఎందుకు పెరుగుతాయో, దాని ఫలితంగా అనేకమంది పేదరికపు ఊబిలో ఎందుకు దిగబడిపోతారో ఆ పేదలకే అంతుబట్టని ఒక రహస్యంగా మిగిలిపోతుంది.

భారతదేశంలోనైతే ఉపాధి పొందుతున్న వాళ్లకి, రిజర్వు సైన్యానికి మధ్య విభజనరేఖ స్పష్టంగా ఉండదు. కొద్దిమంది తప్ప తక్కిన వారందరూ కొన్ని రోజులు పనుల్లో ఉంటారు, మరి కొన్ని రోజుల్లో వాళ్లకి పనులు దొరకవు. దొరికిన రోజుల్లో కూడా పూర్తి గంటలపాటు పనులు దొరకవు. పనులు దొరక్కపోవడం వలన కలిగే మానసిక ఒత్తిడులు వారందరి మీదా తీవ్ర ప్రభావం చూపుతాయి. ఎవరికైనా పని దొరకలేదంటే అది అతడి లేదా ఆమె వ్యక్తిగత వైఫల్యంగా కనిపిస్తుంది. అందుచేత ఆ పరిస్థితి వారి ఆత్మగౌరవాన్ని బలంగా దెబ్బతీస్తుంది. పేదరికం వలన కలిగే కష్టాలకు ఇది అదనం.

నాలుగో లక్షణం: తాము ఎందువలన పేదరికంలో మగ్గవలసి వచ్చిందో ఆ కారణాలు పేదలకు స్పష్టంగా తెలియకపోవడం. అంతకు ముందున్న సమాజాల్లో జరిగిన ఉత్పత్తి ఎంతో, దానిలో భూస్వామి లేదా రాజు ఎంత వాటా పట్టుకుపోతున్నాడో స్పష్టంగా కళ్ల ముందు కనపడేది. ఒకవేళ ఉత్పత్తి తగ్గితే దానివలన తమ అవసరాలను ఏమేరకు కుదించుకోవలసి వస్తుందో వారికి స్పష్టంగా తెలిసేది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో తమకు ఎందుకు ఉపాధి దొరకడం లేదో అందులో జీవించే పేదలకు తెలియదు. అలాగే ఉన్నట్టుండి ధరలు ఎందుకు పెరుగుతాయో, దాని ఫలితంగా అనేకమంది పేదరికపు ఊబిలో ఎందుకు దిగబడిపోతారో ఆ పేదలకే అంతుబట్టని ఒక రహస్యంగా మిగిలిపోతుంది.


1943లో బెంగాల్‌లో సంభవించిన కరువు మీద సత్యజిత్ రే 'దూరపు ఉరుము' అనే చిత్రాన్ని తీశారు. కరువు విజృంభించక మునుపే, జపాను సైన్యాలు సింగపూర్ ను ఆక్రమించిన అనంతరం, బెంగాల్‌లో ధరలు ఎలా పెరిగాయో అందులో వివరించారు. ఇప్పుడు కూడా ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఆహారధాన్యాల ధరలు పెరుగుతున్నాయి. దాని పర్యవసానాలు ఆఫ్రికాలోనో, ఇండియాలోనో మారుమూల ప్రాంతాల్లో నివసించే పేదలు అనుభవిస్తున్నారు. పెట్టుబడిదారీ విధానంలో పేదరికం ఎందుకు కలుగుతుందో, దాని మూలాలు ఎక్కడున్నాయియో పైకి కనపడవు. కాని ప్రపంచంలో ఎక్కడెక్కడో జరిగే పరిణామాల పర్యవసానాలు వేరే ఎక్కడో మారుమూల జీవించే ప్రజల మీద పడుతున్నాయి. దీనికి కారణం పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా మూల మూలకూ విస్తరించి సంబంధాలు నెలకొల్పుకోవడం. ఇది అంతకు పూర్వం ఉన్న సమాజాల్లో లేదు.

నేను పైన పేర్కొన్న నాలుగు ప్రత్యేక లక్షణాల కారణంగా ఎటువంటి పర్యవసానాలు ఉంటాయి అన్నది చూడాలి. ఇక్కడ నేను ఒక్కదాని గురించి మాత్రమే ప్రస్తావిస్తాను. చాలామంది సదుద్దేశం ఉన్నవాళ్లు దేశంలో పేదరికం తగ్గాలన్నా, లేకపోతే పూర్తిగా నిర్మూలించబడాలన్నా, అందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌లో పేదలకు కేటాయింపులు పెంచి వారి అందేట్టు చూడాలని అంటారు. తద్వారా అందరికీ సార్వత్రిక కనీస ఆదాయం వచ్చేట్టు చేయగలుగుతామని అంటారు. కాని ఈ విధంగా పూర్తి స్థాయిలో ఎక్కడా ఇంతవరకూ జరగలేదు. అందుచేత ఒక సామాజిక సమస్యగా పేదరికం కొనసాగుతూనే వుంది. పైగా ఇటీవల మరింత పెరుగుతోంది కూడా. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ఆహారధాన్యాల ధరలు పెరగడం, అదే సమయంలో ఆర్థిక మాంద్యం నెలకొనడం మనం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో పేదలకు తోడ్పాటు అందించే విధానాన్ని ఎక్కడైనా అమలు చేసినా, అది చాలా స్వల్పంగానే ఉంది. ఐతే ఈ పరిష్కారం ఏ సమాజంలోని పేదరికానికైనా ఒకేవిధంగా వర్తించేటటువంటిది. సహాయం అందించడం ద్వారా పేదలకు ఊరట కలిగించడం అనేది పెట్టు బడిదారీ సమాజంలోనే కాదు, అంతకు పూర్వపు సమాజాలలో కూడా అదే ఫలితాన్ని ఇస్తుంది. మరి పెట్టుబడిదారీ సమాజానికి సంబంధించిన పేదరికపు ప్రత్యేక లక్షణాలను ఈ చర్య (ప్రభుత్వం సహాయపడడం) ఏ విధంగా పరిష్కరిస్తుంది? వ్యక్తిగత ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసే నిరుద్యోగం ఫలితంగా కలిగే మానసిక వేదనను ఈ విధమైన సహాయ చర్యలు ఏ విధంగా పరిష్కరించగలుగుతాయి? అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థ కారణంగా ఏర్పడే పేదరికాన్ని తొలగించడానికి ఒకే పరిష్కారం సార్వత్రికంగా ఉపాధిని కల్పించడం. కీన్స్ మహాశయుడు పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలే అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యం అనే అభిప్రాయాన్ని కలిగి వుండేవాడు. కాని అతడి అభిప్రాయం తప్పు అని తేలిపోయింది. నేనీ విధంగా చర్చిస్తున్నానంటే దానర్థం ప్రభు త్వం నుండి ఏ ఆర్థిక సహాయమూ పేదలకు అందించకూడదని ఎంత మాత్రమూ కాదు. అటువంటి సహాయం ఎంత అందించినా, అది ఈ సమాజంలో పేదరికానికి మూలం ఏమిటో దానిని పరిష్కరించలేదు అని నేను చెప్పదలిచాను.

ఇప్పుడు మన దేశంలో దాదాపు ఎనబై కోట్ల మంది ప్రజానీకానికి నెలకు తలా ఐదు కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఎంత మేరకు కిందిదాకా సవ్యంగా అందుతోంది అన్న విషయంగాని, ఎంతకాలం ఈ పథకాన్ని కొనసాగిస్తారన్న విషయంగాని చూడాల్సిందే. అదలా ఉంచితే ఇటువంటి స్కీముని శాశ్వతంగా కొనసాగిస్తే అదే పేదరికాన్ని పరిష్కరిస్తుంది అని భావించడం పొరపాటు. పేదరికాన్ని ఈ పెట్టుబడి దారీ వ్యవస్థలో లేకుండా చేయాలంటే, అందరికీ ఉపాధిని కల్పించడం, విద్య, వైద్యం. వృద్ధాప్యంలో భద్రత, ఆహారం కల్పించడం జరగాలి. అప్పుడే పేదలు కోల్పోయిన తమ ఆత్మగౌరవాన్ని తిరిగి పొంద గలుగుతారు. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో తాము సమాన భాగస్వాములమేనని అనుకోగలుగుతారు. కాని ఈ పనులు జరగాలంటే అది నయా ఉదారవాద పెట్టుబడిదారీ చట్రాన్ని అధిగమించి బయటపడాల్సిందే. నయా ఉదారవాద విధానాలు అమల్లో ఉన్నంతకాలమూ ఎన్ని సహాయ కార్యక్రమాలు చేసినా, వాటిద్వారా పేదరికాన్ని నిర్మూలించడం మాత్రం సాధ్యం కాదు.

(స్వేచ్ఛానుసరణ)

వ్యాధుల కాలం



జంధ్యాల రఘుబాబు
9849753298

సురుకు

ఆరోగ్యం బాగా క్షీణిస్తోంది యాద్‌గిరి
ఏమైంది బాగానే కనిపిస్తున్నావు కదా నర్సింగ్
నా ఆరోగ్యం గురించి కాదు యాద్‌గిరీ...
మరి....
ప్రజల ఆరోగ్యం..
అంతే కదా, ఇప్పుడు సీజన్ మారింది. దోమలు పెరుగుతాయి. మలేరియాలు అవీ వస్తాయి. ఇది వ్యాధుల కాలం నర్సింగన్నా
మనమేమీ చేయలేమా
ఎందుకు చేయలేము? ఎక్కడికక్కడ ప్రజల్ని జాగ్రత్తగా ఉండమని, దోమలు ఎక్కువ కాకుండా చూసుకొమ్మని సైన్సును ప్రచారం చేసే సంస్థలు చేస్తున్నాయి కదా. అందులో కలిస్తే సరి.
అంతేనా
అంతగాక.... ఎవరో వస్తారని చూడొద్దు బ్రో. మనమూ కలుద్దాం వాళ్లతో.
పద మరి.....

****

నర్సింగన్న చెప్పినట్టే ఇది వ్యాధుల కాలం. ముఖ్యంగా అంటు వ్యాధుల కాలం. వర్షాలు పడి, కాలువల్లో, గుంతల్లో దోమలు పెరిగి, ఎక్కడెక్కడున్న కాలుష్యమంతా నీళ్లలో కొట్టుకొచ్చి, అవి మంచి నీటిలో కలిసి, వైరల్ జ్వరాలు, మలేరియాలు, వాంతులు, విరోచనాలు ఇలా ఒకటేమిటి అన్నీ మనిషిని ఒక్కసారిగా చుట్టుముట్టే కాలం. ఇప్పుడొచ్చేవే కాక ఈపాటికే ఉన్న వ్యాధులు అలాగే ఉంటాయి. వాటితో పోరాడుతూనే కొత్తవాటినీ పారదోసే క్రమంలో ఉండాలి మనమంతా. ఇలా ప్రజల్ని పట్టి పీడిస్తున్న రోగాలేమిటో ఒక్కసారి తెలుసుకుందామన్న ప్రయత్నంలో చాలా చాలా వ్యాధులు బయటపడ్డాయి మనసు లోంచి. అవన్నీ జాగ్రత్తగా చూద్దాం. సమాజంలో ప్రజల మనసులను అనారోగ్యం పాలు చేసి వాళ్లను కులాలు, మతాల పేరు మీద విడగొట్టి సామాజిక వర్గం అన్న ఆరోగ్యకరంగా కనిపించే పేర్లు పెట్టి మరీ అనా రోగ్యాన్ని మనసుల్లోకి పంపుతున్నారు. అలా విడగొట్టి ఏకం చేసిన వాళ్లతో ఓట్లు వేయించుకొని తమ ఆరోగ్యాలు బాగా చూసుకుంటున్నారు రాజకీయ జనాలు. ఇక చదువులు, చరిత్ర, సంస్కృతికి చెందినవాటిల్లో కూడా వైరసు ప్రవహిస్తోంది. వాటిని మార్చి విద్యార్థుల పాఠ్యాంశాల్లో పెట్టి మన చరిత్ర ఇది కాదు అది అని మెల్లమెల్లగా వేమన్న చెప్పినట్టు వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును, చీడ పురుగు చేరి చెట్టు జెరచు, కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా అన్నట్లు వేరుపురుగులు, చీడపురుగులు విజృంభిస్తున్న కాలమిది. అందరం జాగ్రత్తగా ఉండాలి.

మనుషులుగా మనం రోజూ సమాజంలో తిరుగుతూ ఉంటాము. ఎందరినో కలుస్తుం టాము వాళ్లలో మిత్రులు, బంధువులు, తెలిసినోళ్లు, సాటి ఉద్యోగులు, టీచర్లు, సాటి మను షులకు వైద్యం చేసే డాక్టర్లు, రోడ్లు, బ్రిడ్జీలు వేసే ఇంజ నీర్లు, వాళ్ల చేతి కింద కూలీలు, బస్సు డ్రైవరన్నలు, కండక్టర్లు, వ్యాపారం చేసుకునేవాళ్లు, సినిమా హాళ్ల ఇలా రకరకాలుగా సేవలు చేసేవాళ్లు. మొన్ననే ఉస్మానియా ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రుల్లో గదులు సరిగా లేవని, బాత్ రూములు, టాయిలెట్లు సరిగా లేవని, పై కప్పు పెచ్చులూడేలా ఉం దని, ఒక్కో మంచంపై నలుగురు రోగులు పడుకొని ఒకరి రోగాలు ఒకరికొస్తున్నాయని, వీళ్లందరికీ సేవలు చేసే జూనియర్ డాక్టర్లు తమ సమస్యలను ఎత్తి చూపుతూ సమ్మె చేసి కొన్ని సాధించు కున్నారు. చెప్పకుండానే చూసు కోవలసిన ప్రభుత్వాలు ఎంత అనా రోగ్యంతో ఉంటే ఇంత అలసత్వంతో ఉంటాయో చెప్పండి. నిజంగా మనిషి ఆరోగ్యం బాగా లేకపోతే అన్నీ ఉన్నా లేనట్టే అని మనకు శుభోదయం సందేశాల్లో వస్తూ ఉంటాయి. మనిషి మొదట తన ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం చూసు కుంటాడు. అది కామన్. కొందరు ప్రజల ఆరోగ్యం కూడా చూసు కుంటారు. అది అసాధారణం, వారి గురించి తెలియని వారికి. తెలిసినోళ్లకు ఆశ్చర్యమేమీ లేదు. ఈ మధ్య బొర్రా గోవర్ధన్ గారి పుస్తక మొకటి చదుతుంటే అందులో రాశారు, మెదడువాపు వ్యాధి పందివల్ల వస్తుంది, అందుకే పందులను చంపేయండి అనే మేధావులు న్నారు. పంది, గుర్రం, పశువులు ఇలా అన్నింటి లోకీ దోమలు వైరసు గుడ్లను పెట్టి పొదిగించి, మళ్లీ వాటినుండి మనుషుల్లోకి వైరసు ఎక్కించి, తమ నోట్లోని లాలాజలంలో పెట్టుకొని వ్యాపించేలా చేస్తాయి దోమలు. మొత్తం మీద రక రకాల జంతువులను కుట్టినా ముఖ్య కారణం దోమ వల్లే ఆ వైరసు వ్యాపిస్తుంది తప్ప ఆ జంతువులు సీదాగా వచ్చి మనుషులకు వ్యాధి తెప్పించవు. అందుకే దోమల్ని నివారించడం ముఖ్యం. అప్పుడు అందరి మెదళ్ల ఆరోగ్యం బాగుంటుంది. రోగ మెలా వస్తుందో, దానికి సరైన కారణమేమిటో కనుక్కోవడం ఇక్కడ ముఖ్యం.

అలా రకరకాల చోట్ల పనిచేస్తున్న వాళ్లు తమ సమస్యలతో పోరాడుతున్నారు. వాళ్లందరూ కులం, మతం అని చూసు కోవడంలేదు. అంతా ఒక వర్గం అనుకొని పోరాడుతున్నారు. ముందే చెప్పుకున్నట్టు ఒక్కో పని చేసేటోళ్లు ఒక్కో వర్గం కదా. అందుకే వాళ్లంతా కలిసి వాళ్లు పనిచేసే చోట ఉన్న రోగాల్ని వాళ్లే నయం చేసుకుంటున్నారు. అక్కడ వాళ్ల కులం, మతం డాక్టర్లు, ఇంజనీర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, కూలీలు, టీచర్లు, మునిసిపాలిటీ ఉద్యోగులు ఇలా అందరూ ఒక్కటే. అది అసలైన వర్గం, వాళ్లు అంత కలిసి సమ్మె చేస్తున్నది అసలైన మార్గం. ఏ రోగాలు వాళ్ల మెదళ్లలో ప్రవేశించవు అలాంటి సమయాల్లో. తరువాత కూడా వాటినుండి జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే నిజమైన ఆరోగ్యం.



అలా రకరకాల చోట్ల పనిచేస్తున్న వాళ్లు తమ సమస్యలతో పోరాడుతున్నారు. వాళ్లందరూ కులం, మతం అని చూసు కోవడం లేదు. అంతా ఒక వర్గం అనుకొని పోరాడుతున్నారు. ముందే చెప్పుకున్నట్టు ఒక్కో పనిచేసేటోళ్లు ఒక్కో వర్గం కదా. అందుకే వాళ్లంతా కలిసి వాళ్లు పనిచేసే చోట ఉన్న రోగాల్ని వాళ్లే నయం చేసుకుంటున్నారు. అక్కడ వాళ్ల కులం, మతం డాక్టర్లు, ఇంజనీర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, కూలీలు, టీచర్లు, మునిసిపాలిటీ ఉద్యోగులు ఇలా అందరూ ఒక్కటే. అది అసలైన వర్గం, వాళ్లు అంతా కలిసి సమ్మె చేస్తున్నది అసలైన మార్గం. ఏ రోగాలు వాళ్ల మెదళ్లలో ప్రవేశించవు అలాంటి సమయాల్లో. తర్వాత కూడా వాటినుండి జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే నిజమైన ఆరోగ్యం. కొత్త కొత్త రోగాలొ స్తుంటాయి, ఇంకా కొత్త కొత్త మందుల్ని మనం కనిపెడుతూ ఉండాలి. ఇది ముందే వ్యాధుల కాలం మరి.

రాజ్యం...భోజ్యం

తెల్లోడు కడుపుకు తిండి పెట్టాకే
వళ్లు చిట్లగొట్టి రక్తం పిండాడు
చెమట నష్టంతో ఊడ్చిన కష్టం కలిపి
వ్యాపార రాజ్యం విస్తరించాడు

ఇపుడు గద్దెనెక్కిన నాయకుడు
త్యాగాలతో తెచ్చిన త్రివర్ణంలో
గద్దెను గద్దలా తన్నుకెళ్లి
కలవాళ్ల కాళ్ల పీఠం చేశాడు
తిండినీ, పనినీ గాలిలో దీపం చేశాడు

వాడు ప్రపంచ శక్తిగ నిలవడానికి పిండేస్తే
వీడు ప్రపంచ శక్తిగా ఎదగడానికి పీడిస్తున్నాడు
ఎవడైతేనేం ప్రతివాడూ 'సంపద' బొక్కేవాడే
నిజం దాచగ మతం దేవుని పక్క నక్కినోడే

బంగారు రాళ్లేసినా త్రాసులో నిజం తూగలేదు
సుత్తీ కొడవలి వేశాకే తూకం మొగ్గు తేలింది
చెమటా రక్తం మిళితమై రాజ్యమేలితేనే
భుక్తీ భవనం విద్య వైద్యం జనం హక్కవుతాయి

- ఉన్నం వెంకటేశ్వర్లు

పాసుబుక్కులివ్వండి

- సచివాలయం ఎదుట నారాయణపురం రైతుల ధర్నా, అరెస్ట్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పట్టాదారు పాసుపుస్తకాలివ్వాలంటూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట ధర్నా చేశారు. పదులసంఖ్యలో వచ్చిన రైతులు సౌత్‌గేట్ ఎదురుగా నిల్చుని నిరసన తెలిపారు. పాత పాసుపుస్తకాలను ప్రదర్శించారు. ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేపట్టారు. నినాదాలు చేశారు. కొద్దిసేపటి అనంతరం సంబంధిత రైతులను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గత ఆరేండ్లుగా మాకు రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ యోజన పథకాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దాదాపు రూ. 15 కోట్ల మేర తమ గ్రామ రైతులు నష్టపోయినట్టు ఈ సందర్భంగా రైతులు వ్యాఖ్యానించారు. ధరణిలో తమ భూములు నమోదు కాకపోవడం వల్లే నష్టం జరుగుతున్నదన్నారు. రైతు పేరు అడవి, తండ్రీ పేరు అడవి అని ఆయా కాలమ్స్‌లో నమోదు కావడంతో 250 ఖాతాలకు చెందిన 950 ఎకరాల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో గత బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనలో 1827 ఎకరాల భూమిని అటవీభూములుగా పేర్కొంటూ రైతుల పట్టాలను రద్దుచేశారని ధర్నాలో చెప్పారు. 60 ఏండ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు పాసుపుస్తకాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, నిధులు తమ గ్రామానికి అందడం లేదన్నారు. పదే పదే సీసీఎల్ఏ వద్ద ధర్నా చేయగా, 700 ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారనీ, మిగతా వారికి ఇవ్వడం లేదని చెప్పారు. గత రెండేండ్లుగా పదే పదే సీసీఎల్ఏకు చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చినా, పాసుబుక్కులు రాకపోవడాన్ని తప్పుబట్టారు .ఇప్పటికైనా నారాయణపురంలోని 1200 ఎకరాల్లోని 800 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలిచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా ఐక్యపోరాటం

- 10న సింగరేణి బ్రాంచ్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు
- 17న హైదరాబాద్ సింగరేణి భవన్ వద్ద ధర్నా : తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్‌లో నిర్ణయం

5న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని బొగ్గు గనుల్ని వేలం వేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చాయి. దానిలో భాగంగా ఈనెల 5న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించారు. 10వ తేదీ సింగరేణి శాఖా కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. వేలం జరిగే 17వ తేదీ నాడు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామంటూ కార్యాచరణ ప్రకటించారు. రాష్ట్రానికి చెందిన ఎంపీ జీ కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖను కేటాయించి, హైదరాబాద్ నుంచే వేలం ప్రక్రియను ప్రారంభించడాన్ని కార్మిక సంఘాలు తప్పుపట్టాయి. రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు, సింగరేణి కాలరీస్ భవిష్యత్ దృష్ట్యా గోదావరి పరీవాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలంను తక్షణమే నిలుపుదల చేసి, దాన్ని సింగరేణికే కేటాయించాలని కార్మికసంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సింగరేణికి శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ కేటాయించాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు బావుల వేలాన్ని రద్దు చేయాలి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు జనక్‌ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్డీ చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కే సూర్యం, బీఆర్‌టీయూ అధ్యక్షులు జీ రాంబాబు, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు అనూరాధ, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఎమ్‌కే బోస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బీ మధు తదితరులు పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్ భూపాల్ సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి అన్ని జాతీయ, కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయి. భవిష్యత్ కార్యాచరణను ఉమ్మడిగా అమల్లోకి తేవాలని నిర్ణయించాయి. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సింగరేణి భవిష్యత్ గురించి వివరించి, శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలాన్ని నిలుపుదల చేసేలా కోరాలని సమావేశం నిర్ణయించింది. ఆ బాధ్యతను ఐఎన్‌టీయూసీ నేతలు తీసుకోవాలని కోరగా, వారు అందుకు అంగీకరించారు. అలాగే ప్రతిపక్షనేత, బీఆర్ఎస్ అధ్యక్షులు కే చంద్రశేఖరరావును కూడా కలిసి మద్దతు కోరాలనీ, ఆ బాధ్యతను బీఆర్‌టీయూ నాయకులు తీసుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయి కార్మిక సంఘాల ఐక్యతను సింగరేణిలో క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని చెప్పారు. కేంద్రం ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్‌లు ఇప్పటి వరకు పార్లమెంటు ఆమోదం పొందలేకపోయాయనీ, దీనికి జాతీయ కార్మిక సంఘాల ఐక్య పోరాటాలే కారణమని విశ్లేషించారు. రైతు నల్లచట్టాల్ని కేంద్రం వెనక్కి తీసుకోకతప్పలేదనీ, అదే స్ఫూర్తితో ఉద్యమిస్తే, సింగరేణి పరిరక్షణతో పాటు బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకోగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బొగ్గు గనుల వేలం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పక్కనే కూర్చుని ఉన్నారనీ, శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలాన్ని మాత్రం నిలువరించలేకపోయారని విమర్శించారు. సింగరేణి సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలకోట్ల రూపాయలు డివిడెండ్లు, పన్నుల రూపంలో చెల్లిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ.30వేల కోట్లు చెల్లించాల్సి ఉందనీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సింగరేణి పాత్రను కీలకంగా గుర్తించలేకపోతున్నారని ఆక్షేపించారు. కార్మిక సంఘాలు ఇచ్చిన ఆందోళనల్లో సింగరేణి ఉద్యోగులతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘాల ఆందోళనలకు అంగన్‌వాడీ, వీఆర్ఏ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్లు సంఘీభావం ప్రకటించాయి. సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్ జే వెంకటేష్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పీ సుధాకర్, వై సోమన్న, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాజ్‌కుమార్, కరుణ తదితరులు పాల్గొన్నారు.



అప్రజాస్వామిక చట్టాలను ఆపాలి

- కొత్త విద్యా విధానం రద్దుచేయాలి సీపీఐ(ఎం) డిమాండ్
- ముస్లింలపై దాడులకు ఖండన



న్యూఢిల్లీ : ఎలాంటి చర్చలు జరపకుండా, అత్యంత అప్రజాస్వామ్యంగా ఆమోదించిన కొత్త క్రిమినల్ చట్టాల అమలును తక్షణమే నిలిపివేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. అలాగే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్రమైన మానసిక వేదన కలిగించేలా ఇటీవల ఎన్‌టిఎ నిర్వహించిన నీట్ పరీక్ష తీరును తప్పుబట్టింది. తక్షణమే ఎన్‌టిఎను రద్దు చేయాలని కోరింది. విద్యను కేంద్రీకృతం చేస్తూ తీసుకువచ్చిన కొత్త విద్యా విధానం పట్ల తీవ్ర విముఖత వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్షించింది. దేశవ్యాప్తంగా మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖండించింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కేంద్ర కమిటీ జూన్ 28-30 తేదీల్లో ఢిల్లీలో సమావేశమై పలు అంశాలపై కూలంకషంగా చర్చించింది. అనంతరం ఒక ప్రకటన విడుదల చేసింది.

18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

ఇటీవల జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కేంద్ర కమిటీ కూలంకషంగా చర్చించింది. ఈ ఫలితాలు బిజెపిని దారుణంగా దెబ్బతీశాయని అభిప్రాయపడింది. జీవనోపాధి పరిస్థితులు దారుణంగా క్షీణించడం పట్ల తీవ్రంగా ఆందోళనలు వ్యక్తం చేస్తూ, అలాగే రాజ్యాంగాన్ని, దేశ లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించేందుకు గానూ ప్రజలు గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా ఈసారి బిజెపికి మెజారిటీ ఇవ్వలేదు. 400కి పైగా సీట్లు ఇవ్వాలని పదే పదే బిజెపి నేతలు చేసిన ప్రకటనలను తిరస్కరిస్తూ, కేవలం 240సీట్లతో సరిపెట్టారు. 2019 లోక్‌సభలో కన్నా ఇవి 63సీట్లు తక్కువే. మొత్తమ్మీద బిజెపి 92 సిట్టింగ్ సీట్లు కోల్పోయింది. కానీ 29కొత్త సీట్లను గెలిచింది. అంటే నష్టపోయింది 63సీట్లు. దీంతో మెజారిటీ కన్నా 32సీట్లు తక్కువ వచ్చాయి. అయితే, మిత్రపక్షాలు అదనంగా 52సీట్లను గెలవడంతో 292మంది ఎంపీల మద్దతుతో నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన మెజారిటీ కన్నా కేవలం 20సీట్లే ఎక్కువ.

ఇండియా బ్లాక్ పార్టీలన్నీ కలిసి 234సీట్లు గెలిచాయి. ఇక్కడ మెజారిటీ కన్నా 38సీట్లు తక్కువ. ఎన్డీఏ కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు పోలైన ఓట్లలో 42.5శాతం ఓట్లు వచ్చాయి. ఇండియా బ్లాక్ పార్టీలకు మొత్తంగా 40.6శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ రెండు కూటముల మధ్య ఓట్ల వాటాలో తేడా 2శాతం కన్నా తక్కువగానే -1.9శాతం వుంది. ఇంత ప్రతికూలంగా ఫలితాలు వచ్చినా, సంకీర్ణ ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు వచ్చినా, మోడీ గుత్తాధిపత్యాన్ని తిరిగి స్థాపించేందుకు బీజేపీ అవిశ్రాంతంగా దాడిని ప్రారంభించింది. అయితే, మొత్తంగా ఓటు వాటా ఒక శాతం కన్నా కొంచెం మేరా క్షీణించిందన్న వాస్తవాన్ని దృష్టిలో వుంచుకుని గత దశాబ్ద కాలంగా అనుసరిస్తూ వచ్చిన హిందూత్వ చైతన్యాన్ని మరింత సంఘటితపరిచేందుకు చూస్తోంది.

మతోన్మాద ధోరణులకు మరింత పదును పెట్టేందుకు గానూ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుండే ముస్లిం మైనారిటీలపై వరుసగా దాడులు ఆరంభించింది. మరోవైపు, సిపిఎంతో సహా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్ర సంస్థలను ఆయుధాలుగా మలుచుకోవడాన్ని కొనసాగిస్తోంది. జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు, కేజ్రివాల్‌ను తిరిగి సిబిఐ అరెస్టు చేయడం, అరుంధతి రాయ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వడం వంటి చర్యలు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్నాయి. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ)ను, ప్రధాని ప్రధాన కార్యదర్శిని పునర్నిర్మించిన మోడీ జీ7 నేతలను కలుసుకునేందుకు ఇటలీ వెళ్ళారు. ఈ సమావేశంలో భారత్‌కు ఎలాంటి ఎజెండా లేదు. ఎన్నికైన మాజీ మంత్రులందరినీ దాదాపుగా తిరిగి క్యాబినెట్‌లోకి తీసుకుని అవే శాఖలను కేటాయించారు. దాదాపాటు 150మంది ఎంపీలను సస్పెండ్ చేసిన ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్‌గా తిరిగి ఎన్నుకున్నారు. మోడీ నేతృత్వంలో అంతా సాధారణంగానే సాగుతోందన్న భావన కల్పించడానికి కష్టపడుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో మెజారిటీ ప్రజల జీవనోపాధులు మెరుగుదల కోసం పోరాటాలు చేయడంతో పాటూ భారత రాజ్యాంగం, లౌకిక ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, ప్రజల పౌర స్వేచ్ఛల పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, వెలుపల పోరాటాలను ఉధృతం చేయాల్సి వుంటుందని కేంద్ర కమిటీ పేర్కొంది. ఈ బృహత్తర కర్తవ్యాన్ని దేశవ్యాప్తంగా ఇతర లౌకిక ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి, అలాగే స్వతంత్రంగా సీపీఐ(ఎం) చేపట్టనుంది.

> **సీపీఐ(ఎం) పనితీరు**
>
> మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టడంలో, ఆర్ఎస్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా లౌకికవాద శక్తులను సమీకరించడంలో, తద్వారా ఇండియా బ్లాక్‌ను బలోపేతం చేయడానికి కార్మికులను సమీకరించడంలో సీపీఐ(ఎం) కీలక పాత్ర పోషించింది. అయితే, ఎన్నికల్లో పార్టీ పనితీరు నిరాశజనకంగా వుంది. 2019లో 71 స్థానాలకు పోటీ చేస్తే ఈసారి 52 స్థానాలకు సిపిఎం పోటీ చేసింది. వీటిలో, నాలుగు సీట్లను (తమిళనాడులో రెండు, కేరళ, రాజస్థాన్‌ల్లో ఒక్కోటి) గెలుపొందింది. మొత్తంగా వామపక్షాలు 8సీట్లను గెలుచుకున్నాయి. వీటిల్లో సీపీఐ(ఎం)కు 4, సీపీఐ కు 2, సీపీఐ(ఎంఎల్)కు -2 స్థానాలు లభించాయి. పోటీ చేసిన అన్ని రాష్ట్రాల్లో పార్టీ పనితీరును కేంద్ర కమిటీ కూలంకషంగా సమీక్షించింది. తీవ్రమైన స్థాయిలో ఆత్మ పరిశీలన చేపట్టింది. బలహీనతలు, లొసుగులు, లోపాలను గుర్తించింది. ఈ లోపాలను అధిగమించి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రూపొందించిన చర్యలు, కర్తవ్యాల అమలును పార్టీ రాష్ట్ర కమిటీలు ముందుకు తీసుకెళ్ళాలి.

మైనారిటీలపై దాడులు

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎదురు దెబ్బలు తిన్న నేపథ్యంలో దేశంలో పలు ప్రాంతాల్లో ముస్లింలపై వారి జీవనోపాధులపై, ఆస్తులపై విచ్చలవిడిగా జరుగుతున్న దారుణమైన దాడులను కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది.

చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, యూపీలోని అలీఘడ్, గుజరాత్‌లోకి చికొద్రాల్లో ముస్లింలపై జరిగిన దాడుల్లో మొత్తంగా ఐదుగురు మరణించారు.

గో వధ జరిగిందని, లేదా గొడ్డు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నామనే నిరాధార ఆరోపణలతో మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలో 11మంది ముస్లింల ఇండ్లను ధ్వంసం చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని నహన్‌లో ముస్లింకు చెందిన ఒక దుకాణాన్ని విధ్వంసం చేయగా, అనేకమంది దుకాణాలను బలవంతంగా మూసివేయించారు. ఒడిశాలోని బాలాసోర్‌లో ఘర్షణ చోటు చేసుకుంది.

గుజరాత్‌లోని వడోదరలో తక్కువ ఆదాయ వర్గాల గృహ నిర్మాణ సముదాయంలో తనకు కేటాయించిన ఫ్లాట్‌ను తీసుకోనివ్వకుండా ముస్లిం మహిళను అడ్డుకున్నారు. ఢిల్లీలోని సంగమ్ విహారాలో గో కళేబరాన్ని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో హిందూత్వ సంస్థల కార్యకర్తలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంతో అక్కడవారు పారిపోయారు. జబల్పూర్‌లో, ముస్లింలను నగరం వదిలి పారిపోవాలని బెదిరిస్తూ హిందూత్వ సంస్థలు ఒక ప్రదర్శన నిర్వహించాయి.

ఎన్నికల్లో బీజేపీ మెజారిటీని సాధించలేని పరిస్థితుల్లో మతోన్మాద దాడులు, ధోరణులు ఇలా పెచ్చరిల్లి పోవడమంటే మరింత ప్రతీకారేచ్ఛతో హిందూత్వ మతోన్మాద శక్తులు రగిలిపోతూ దాడులను ఉధృతం చేస్తున్నాయన్న వాస్తవం స్పష్టమవుతోంది.

బీజేపీ, ఇతర మతోన్మాద సంస్థలు పన్నుతున్న ఇటువంటి నీచమైన ఎత్తుగడలు, కుయుక్తులకు వ్యతిరేకంగా అప్రమత్తంగా వుండాల్సిందిగా పార్టీ శాఖలన్నింటికీ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపిచ్చింది. ఇటువంటి విషపూరితమైన దాడులు, చర్యలకు వ్యతిరేకంగా పార్టీ శాఖలు తక్షణమే నిరసన కార్యాచరణ చేపట్టాలని కోరింది.

> **24వ పార్టీ మహాసభ**
>
> 2025 ఏప్రిల్‌లో సీపీఐ(ఎం) 24వ జాతీయ మహాసభలు నిర్వహించేందుకు గానూ ఈ ఏడాది సెప్టెంబరు నుంచి అన్ని స్థాయిల్లో పార్టీ మహాసభల నిర్వహణకు టైమ్ టేబుల్‌ను కేంద్ర కమిటీ ఆమోదించింది.

పరీక్షల కుంభకోణాలు మంత్రి రాజీనామా చేయాలి

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షల చుట్టూ కమ్ముకున్న కుంభకోణాలతో ప్రభావితమైన లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతరులు ఎదుర్కొంటున్న మానసిక ఆవేదన, తగిలిన దెబ్బల పట్ల కేంద్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్యను కేంద్రీకరించాలని, వాణిజ్యకరించాలని, వర్గీకరించాలని పేర్కొంటున్న నూతన విద్యా విధానం 2020 పట్ల కేంద్ర కమిటీ తీవ్ర వ్యతిరేకతను పునరుద్ఘాటించింది. పరీక్షల వ్యవస్థను కేంద్రీకృతం చేయడం ఈ డ్రైవ్‌లో భాగంగా వుంది. వ్యాపం కుంభకోణంలో చేసిన మాదిరిగానే ఇందులో కూడా సీబీఐకి దర్యాప్తును అప్పగించడమంటే కేవలం కంటితుడుపు చర్యేనని కేంద్ర కమిటీ అభిప్రాయపడింది.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇక పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారు. తక్షణమే ఆయన తన రాజీనామాను అందచేయాలి. కేంద్రీకృత పరీక్షా వ్యవస్థను రద్దు చేయాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ఎన్‌టీఏను రద్దు చేసి, విద్యా వ్యవస్థను కేంద్రీకృతం చేసే దిశగా తీసుకున్న చొరవలన్నింటినీ ఉపసంహరించుకోవాలని కోరింది.

క్రిమినల్ చట్టాల అమలు వద్దు

మోడీ ప్రభుత్వం పట్టుదలగా కొత్త క్రిమినల్ చట్టాలను జులై 1 నుంచి అమలు చేయడం పట్ల కేంద్ర కమిటీ తీవ్ర విముఖతను వ్యక్తం చేసింది.

ఎలాంటి చర్చ జరపకుండా, తీవ్రమైన నిరంకుశత్వంతో, అప్రజాస్వామిక రీతిలో తొందరపాటుతో ఈ చట్టాలను అమలు చేశారు. పార్లమెంట్‌లో పెద్ద సంఖ్యలో ప్రతిపక్షాల సభ్యులు సస్పెండైనపుడు ఈ చట్టాలను ఆమోదించారు.

దేశద్రోహాన్ని నిర్వచిస్తున్న ఐపీసీలోని సెక్షన్ 124ఎను సుప్రీం కోర్టు చాలా సరిగ్గానే తొలగించింది. కానీ కొత్త భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 152గా రహస్యంగా తీసుకువచ్చారు. దానితో పాటుగా 124ఎ ఒరిజినల్ సెక్షన్‌లో లేని భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతల ప్రస్తావన తీసుకువచ్చారు. ఈ చర్య, సుప్రీం కోర్టు తీర్పును దారుణంగా నీరుగార్చడమే కాకుండా ప్రజలను జాతి వ్యతిరేకులుగా ముద్ర వేసి, వారిని దోషులుగా పేర్కొనడం ఈ కొత్త చట్టానికి మరింత సులభతరం చేయనుంది.

పౌరులకు హాని కలిగించేలా పోలీసు అధికారాలను పెంచుతూ అనేక నిబంధనలు ఇందులో వున్నాయి. ఉదాహరణకు, గత చట్టంలో నిందితుడి పోలీసు కస్టడీ 15రోజుల పరిమితి వుండగా ఈ కొత్త చట్టంలో అంతకుమించి అవకాశం కల్పించారు. కొత్త నిబంధన ప్రకారం, న్యాయమూర్తి, నిందితుడిని 90 రోజుల వరకు పోలీసు కస్టడీకి పంపవచ్చు. గుర్తించదగిన నేరం జరిగిన కేసులో పోలీసు అధికారి 15 రోజుల పాటు విచారణ జరిపిన తర్వాత మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు.

ఉపా కింద అభియోగాలను సీనియర్ పోలీసు అధికారి విచారిస్తుండగా, కొత్త సెక్షన్ 152 కింద నమోదయ్యే అభియోగాలను పోలీసు స్టేషన్‌లో దర్యాప్తు అధికారి విచారించడం చాలా దారుణమైన, ప్రమాదకరమైన కోణంగా వుంది. ఉపా కింద ఒకరిని ప్రాసిక్యూట్ చేయడానికి ప్రభుత్వం అనుమతినివ్వాల్సి వుంటుంది. అదే కొత్త న్యాయ సంహిత నిబంధనల కింద తీవ్రవాద అభియోగాలకు ఎవరినైనా సాధారణ పోలీసు అధికారి ప్రాసిక్యూట్ చేయవచ్చు.

'నేరం జరిగిన సమయంలో అది నేరమైతే తప్ప ఎవరినీ కూడా దోషిగా నిర్ధారించలేం' అన్నది చట్టం ప్రాథమిక సూత్రంగా వుంది. జులై 1 తర్వాత జరగబోయేది ఏమిటంటే, జులై 1కి ముందు నమోదైన ఎఫ్ఐఆర్‌కు ఆ సమయంలో అమల్లో వున్న చట్ట నిబంధనలే అమలవుతాయి. కానీ జులై 1 తర్వాత దాఖలైన ఎఫ్ఐఆర్‌లకు కొత్త చట్టం వర్తిస్తుంది.

అంటే రెండు చట్టాలు ఒకేసారి అమలవుతాయి. ఏ వ్యవస్థను వర్తింప చేయాలనే అంశంపై వివాదాలు రగులుతాయి. అప్పీళ్ళు కూడా చాలా క్లిష్టతరంగా మారుతాయి. చట్టం ఏం చెబుతోంది, ఏది ఆమోదయోగ్యమనే విషయంలో ఈ కొత్త చట్టాలు అనిశ్చితిని, అస్పష్టతను, అసందిగ్ధతను తీసుకువస్తాయి. ఇప్పటికే లక్షలాదిగా పెండింగ్‌లో పడిన క్రిమినల్ కేసులకు ఇది మరింత సమస్యను తెచ్చిపెడుతుంది.

ఇప్పటికే వ్యక్తం చేసిన న్యాయమైన ఆందోళనలను, వాటి తిరోగమన, నిరంకుశ స్వభావాన్ని దృష్టిలో వుంచుకుని కొత్త చట్టాల అమలును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన బార్ అసోసియేషన్లు, పౌర సమాజ సంస్థలు, పౌరులతో సిపిఎం చేతులు కలిపింది.

తల్లీ ముగ్గురు కుమార్తెల ఆత్మహత్యాయత్నం

- ఇద్దరు పరిస్థితి విషమం
- ఇంటిపెద్ద వేధింపులే కారణం..



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

బాధ్యతగా ఉండాల్సిన ఇంటి పెద్ద నిత్యం మద్యం తాగి భార్యాపిల్లలను వేధించడంతోపాటు గ్రామస్తులతోనూ గొడవలు పడుతుండటంతో.. విసిగిపోయిన భార్య తన ముగ్గురు కుమార్తెలతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన సోమవారం సాయంత్రం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని గజ్జిగూడ గ్రామంలో జరిగింది. బాధితులు, రూరల్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం..గజ్జిగూడ గ్రామానికి చెందిన చిలుకూరి ప్రతాప్‌కు భార్య, నలుగురు కూతుళ్లున్నారు. ప్రతాప్ నిత్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. సోమవారం ఉదయం కూడా గొడవ పడ్డాడు. దాంతో విసిగిపోయిన భార్య అనిత(55) సాయంత్రం కుమార్తెలు లక్ష్మి(21), రమ్య(16), ఐశ్వర్య(14)ను తీసుకొని పొలానికెళ్లింది. అక్కడే పురుగుల మందు తాగి, తన కూతుళ్లకూ తాగించింది. అపస్మారక స్థితిలో ఉండగా.. స్థానికులు గమనించి కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. నలుగురికి వైద్య చికిత్స అందించారు. కాగా కూతుళ్ల లక్ష్మి, రమ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్లు చెప్పారు. రూరల్ సీఐ అల్లం రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రతాప్ భార్యతో తరచూ గొడవ పడుతున్నాడని, దాంతో భార్య అనిత, కూతుళ్లతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు చెప్పారు. ప్రసాద్‌పై గతంలో హత్యాయత్నం కేసు నమోదైందని తెలిపారు. ఇటీవలపై బెయిల్‌పై వచ్చినట్టు సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ప్రతాప్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం

- జోగులాంబ గద్వాల కలెక్టరేట్‌లో ఘటన



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

తన భూమిని కబ్జా చేశారని, న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లంపూర్ నియో జకవర్గం, ఐజ మండలం, గుడిదొడ్డి గ్రామానికి చెందిన రైతు పరశురాముడుకు సర్వే నంబర్ 321లో ఐదె కరాల భూమి ఉంది. అయితే, ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. ఈ విషయాన్ని బాధితుడు ఐజ తహసీల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించు కోలేదు. దీంతో కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్ర`మానికి రైతు పరశురాముడు వెళ్లి తన సమస్యను పరిష్కరిం చాలంటూ అధికారులకు మొరపెట్టుకున్నాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. వెంటనే అక్కడున్న సిబ్బంది గమనించి అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు.

కేసీఆర్ పిటిషన్ కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ఈ కమిషన్ నియామకాన్నే సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం ధర్మాసనం కొట్టివేసింది. జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారనే ఏకైక కారణం తప్ప, ఆయన పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని నిరూపించే ఏ ఒక్క ఆధారాన్నీ పిటిషనర్ కోర్టుకు సమర్పించలేకపోయారని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ తరపు న్యాయవాదుల వాదనను హైకోర్టు తిరస్కరించింది. అసలు ఈ పిటిషన్‌కు విచారణార్హతే లేదంటూ అడ్వకేట్ జనరల్ చేసిన వాదనను న్యాయస్థానం సమర్థించింది. విద్యుత్ కమిషన్ విచారణను కొనసాగించవచ్చని స్పష్టం చేసింది.

పిటిషనర్ (మాజీ సీఎం కేసీఆర్)కు జారీ చేసిన నోటీసుల్లో కమిషన్ చైర్మెన్ ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించలేదని తేల్చిచెప్పింది. విద్యుత్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణం గురించి తెలుసుకోవడానికే ఆయనకు నోటీసులు జారీ చేశారని వివరణ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్‌కు విచారణార్హతే లేదంటూ కొట్టివేసింది.

"నర్సింహారెడ్డి పక్షపాతంగా ఉన్నారని కేసీఆర్ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపలేదు. పక్షపాతమనే పదానికి తగిన నిర్వచనం కూడా లేదు. కమిషన్‌కు విచారణ పరిధి లేదని కేసీఆర్ చెప్పడం చట్ట వ్యతిరేకం. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సి)లే విచారణ చేయాలనీ, ఆపై అప్పిలేట్ ట్రిబ్యునల్, ఆ తర్వాత సుప్రీంకోర్టుల్లో మాత్రమే సవాలు చేయాలని కేసీఆర్ చేసిన వాదన సరికాదు. ఈఆర్‌సీల పరిధి కంటే కమిషన్ పరిధి పెద్దది. ఈఆర్‌సీల పరిధిలోని అంశాల కంటే కమిషన్ విచారణకు నిర్దేశించిన విధివిధానాల పరిధి ఎక్కువ. కాబట్టి కమిషన్ విచారణ చట్టబద్ధమే. విచారణకు ఆదేశించే అధికారం రాష్ట్రానికి ఉంది. విలేకరుల సమావేశంలో జస్టిస్ నర్సింహారెడ్డి కొన్ని విషయాలు చెప్పినంతనే అది పక్షపాతం కిందకు రాదు. విచారణలో ఉన్న విషయాలు మాత్రమే చెప్పారు. అదే ప్రామాణికంగా ఉంటుందని కమిషన్ చెప్పలేదు. కేసీఆర్‌పై ఆరోపణలు కూడా చేయలేదు. ఫైళ్లను పరిశీలించాకే కమిషన్ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని తేల్చి కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చింది. ఎంక్వయిరీస్ యాక్ట్‌లోని 8బి కింద నోటీసులు జారీ చేయడం చట్టబద్ధమే. వీటిని కొట్టేయాలన్న కేసీఆర్ పిటిషన్ చెల్లదు. కాబట్టే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం.." అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

గ్రేటర్ విపత్తు నిర్వహణ పరిధి పెంపు

- ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరణ
- నగర ఖ్యాతి పెంచేలా పనులు చేపట్టండి
- చారిత్రక, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయండి
- మూసీ ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచండి : జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీహెచ్ఎంసీ విపత్తు నిర్వహణ విభాగానికి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఎండీఏ, మూసీ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌ను భౌగోళికంగా విస్తరిం చనున్న దృష్ట్యా విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీలకు సేవలందించేందుకు అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగానికి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, తదితర విభాగాల నుంచి నైపుణ్యం కలిగిన వారిని ఇందులో నియమించాలని సూచించారు.

బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ

చట్టాలను ఉపసంహరించాలి

- హైకోర్టు బార్ కౌన్సిల్ ఎదుట న్యాయవాద సంఘాల ధర్నా
- ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధం:పార్థసారథి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలు న్యాయవాద సంఘాలు ధర్నా నిర్వహించాయి. మంగళవారం హైకోర్టు ఆవరణలోని బార్‌కౌన్సిల్ గేటు దగ్గర ఆలిండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్), ఇండియన్ లాయర్స్ యూనియన్(ఐఎల్‌యూ) ఆధ్వర్యంలో నాయవాదులు మధ్యాహ్నం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. పార్థసారథి, ఇతర సంఘాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ చేయకుండా, వివిధ తరగతులు, మేధావుల అభిప్రాయాలు సేకరించకుండా ఒంటెద్దు పోకడలతో కొత్త చట్టాలను తెచ్చి అమలుచేయడం సరికాదన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రధానంగా సమానత్వం, జీవించే హక్కులను హరించడమేనని వ్యాఖ్యానించారు. ఈ కొత్త చట్టాల ద్వారా సామాన్యుల హక్కులను కాలరాసి దేశ వ్యవస్థని పోలీసుల చేతుల్లో పెట్టి అవినీతిని ప్రోత్సహించడమే అవుతుందని గుర్తు చేశారు. కొత్త చట్టాల అమలు ద్వారా ప్రశ్నించే గొంతుకల్ని నొక్కి వాక్ స్వాతంత్రాన్ని సైతం హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్ మంజూరి వ్యవస్థను కొత్త చట్టాలు మరింత క్లిష్ట తరం చేశాయనీ, సామాన్యులను జైల్లో మగ్గేలా కొత్త చట్టాలను రూపొందించారని విమర్శించారు. నేర నమోదు ప్రక్రియను పోలీస్‌లు జాప్యం చేయడంతోపాటు బాధితులను పీడించే చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మూడు చట్టాలపై పార్లమెంట్‌లో చర్చించి పున:సమీక్ష చేయాలని కోరారు. ప్రజల స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మూడు సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మోతీలాల్‌కు మద్దతుగా

ఓయూలో భారీ ర్యాలీ

- విద్యార్థులు, నిరుద్యోగుల అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం వారం రోజులకుపైగా గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఓయూ జేఏసీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. పోలీసులు విద్యార్థులను అరెస్టు చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ మహారాజ్ మాట్లాడుతూ.. గత పదేండ్లలో కేసీఆర్ చేసిన నియంతృత్వం, మోసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని విమర్శించారు. వాళ్ల రాజకీయ పదవులే నింపుకుంటున్నారు తప్ప నిరుద్యోగుల డిమాండ్‌లను గాలికి వదిలేశారని అన్నారు. గ్రూప్-1 మెయిన్స్ ఎలిజిబిలిటీ 1:100కు పెంచాలని, గ్రూప్-2లో 2000, గ్రూప్-3లో 3000 ఉద్యోగాలు కలపాలని అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, జీవో 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను మోసం చేసి పదవులు అనుభవిస్తున్న ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న దీనికి నైతిక బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోదండరామ్ నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలన్నారు. నిరుద్యోగుల సమస్యల మీద ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వేలాది మందితో నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు హనుమంత్ నాయక్, వినోద్ నాయక్, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు లింగయ్య మహారాజ్, శివ మహారాజ్, ప్రసాద్ రాజు గణేష్ సుభాష్, నిరుద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుల భద్రత, సంరక్షణపై మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలోని ఎయిర్‌పోర్టుల్లోని ప్రయాణీకుల సంరక్షణకు, భద్రతకు తీసుకోవాల్సిన అత్యవసర మార్గదర్శకాలపై వారం రోజుల్లో భద్రత తనిఖీలు (సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనను ఆదేశించారు. వారం రోజుల్లో సేఫ్టీ ఆడిట్‌ను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదికను అందజేయాలని సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈమేరకు ఆదేశాలు ఇచ్చారు.

ఎనిమిది మంది ఏఎస్పీల బదిలీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో ఎనిమిది మంది ఏఎస్పీ హోదాగల యువ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా సోమవారం ఆదేశాలు జారీ చేశారు. వారిలో భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్‌ను కొత్తగూడెం ఓఎస్డీగా బదిలీ చేశారు. గతంలో ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌ను బదిలీ చేస్తూ జారీ అయిన ఉత్తర్వులను రద్దు చేసి తిరిగి ఆయనను రాష్ట్ర గవర్నర్ ఓఎస్డీగా నియమించారు. ఏటూరునాగారం ఏఎస్పీ గితె మహేశ్ బాబాసాహెబ్‌ను ములుగు ఓఎస్డీగా నియమించి, భైంసా ఏఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాశ్‌ను బదిలీ చేసి హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డీసీపీగా నియమించారు. జనగామ ఏఎస్పీ అంకిత్ కుమార్ శంఖావర్‌ను భద్రాచలం ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. గ్రేహౌండ్స్ అస్సాల్ట్ కమాండర్ అవినాశ్ కుమార్‌ను బదిలీ చేసి భైంసా ఏఎస్పీగా నియమించారు. గ్రేహౌండ్స్‌కు చెందిన మరో ఇద్దరు అస్సాల్ట్ కమాండర్లు శేషాద్రిని రెడ్డిని వేములవాడ ఏఎస్పీగా, శివం ఉపాధ్యాయకు ఏటూరునాగారం ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.

బొగ్గుగనుల వేలాన్ని రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రమ అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించా రు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహా, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు రామచందర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం శ్రీనివాస్, ఆకుల పాపయ్య, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యూసీఐ(సీ) నాయకులు ధర్మతేజ, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈనెల ఐదో తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మోడీ పాలనలో చేనేత రంగం కుదేలు

- ఎత్తేసిన సబ్సిడీలను వెంటనే పునరుద్ధరించండి
- కార్మికుల సమస్యల పరిష్కారం కోసం "నేతన్న పోరుయాత్ర"
- జులై 7న సిరిసిల్లలో ప్రారంభం, 15న హైదరాబాద్‌లో ముగింపు : తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి
- యాత్రకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు: పాలడుగు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నరేంద్ర మోడీ పదేండ్ల పాలనలో చేనేత రంగం కుదేలయిందని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేనేత రంగం అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన అన్ని రకాల బోర్డులను బీజేపీ సర్కార్ రద్దు చేసిందని ఆరోపించారు. మహత్మాగాంధీ బుస్కర్ యోజనా పథకం, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం, హౌస్ కం వర్క్‌షెడ్ తదితర పథకాలను పక్కన పెట్టిందని అన్నారు. ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసిన కేంద్రం, పరిశ్రమలో ఉపయోగించే రసాయనాలు, రంగులపై 18శాతం అదనంగా జీఎస్టీ భారాన్ని మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏడు నెలల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్న కేంద్రం పట్ల మెతక వైఖరి అవలంబించడాన్ని ఆయన తప్పు పట్టారు. త్రిఫ్ట్ పథకం చెల్లింపులు రాష్ట్ర సర్కార్ చేయక పోవడంతో ఈ రంగంలో పని చేసే కార్మికులు తీవ్రంగా నష్ట పోతున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను కొత్తగా ఇవ్వక పోవడంతో నేత కార్మికులకు ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన ఈ స్కీంపై అభ్యంతరాలుంటే పేరు మార్చి వెంటనే ప్రవేశ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజకీయాలేమైనా ఉంటే రెండు పార్టీలు పరస్పరం చూసుకోవాలే తప్ప నేత కార్మికుల బతుకు దెరువుపై కాదని సూచించారు. రాష్ట్రంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జులై 7 నుంచి 15 వరకు నేతన్న పోరు యాత్ర చేపట్టినట్టు తెలిపారు. సిరిసిల్లలో ప్రారంభమయ్యే బస్సుయాత్ర హైదరాబాద్‌లో జరిగే నేతన్న గర్జనతో ముగుస్తుందని వెల్లడించారు. తొమ్మిది రోజులు సాగే యాత్రలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజెప్పి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ నేతన్న పోరు యాత్రకు సీఐటీయూ దాని అనుబంధ సంఘాలు సంపూర్ణ మద్దతిస్తున్నట్టు ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు సిరిసిల్లలో చేనేత కార్మికుల చుట్టూ తిరిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల తర్వాత వారి గురించి పట్టించు కోవడం లేదని విమర్శించారు. గత సర్కార్ చేసిన తప్పులనే తిరిగి కాంగ్రెస్ చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల వద్ద పేరుకు పోయిన నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మూతపడ్డ సేల్స్ సెంటర్లను వెంటనే తెరిపించాలని కోరారు. తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 11 మంది నేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలకు బట్టలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయాలని కోరారు.

నేతన్నపోరుయాత్ర "డిమాండ్స్"

1). చేనేత, పవర్ లూమ్స్ కార్మికులకు ఉపాధి కల్పించాలి
2). బతుకమ్మ చీరల పథకాన్ని కొనసాగించాలి లేదా జనతా వస్త్రాల పథకాన్ని అమలు చేయాలి
3).వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయడంతో పాటు చేనేత రంగానికి రూ.1000 కోట్లు కేటాయించాలి
4). త్రిఫ్ట్ ఫండ్, యారన్ సబ్సిడీ, నేతన్న బీమా పథకాలను అమలు చేయాలి.
5). చేనేత, పవర్‌లూం రంగాలకు బకాయిలను చెల్లించడంతో పాటు ఉచిత విద్యుత్ అందించాలి.
6). వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలి
7). చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాలను ఏర్పాటు చేయాలి.
8). పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలను పెంచి అమలు చేయాలి.
9). యారన్ సబ్సిడీ నిధులను కార్మికుల అకౌంట్లలో వేయాలి
10). కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్దిదారులకు చేనేత వస్త్రాలను ఇవ్వాలి
11). సహకార సంఘాలు, మ్యాక్స్ సొసైటీలకు క్యాష్ క్రెడిట్ పెంచాలి
12). ప్రతి నేతన్న కుటుంబానికి రూ.5 లక్షల పెట్టుబడి సహాయం అందించాలి
13). కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి. 92 శాతం సబ్సిడీపై పట్టు, నూలు పరికరాలు ఇవ్వాలి.
14). వస్త్ర ఉత్పత్తి కేంద్రాల్లో నూలు డిపోలను ఏర్పాటు చేయాలి
15). ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయాలి

అన్ని రకాల పోస్టుల భర్తీకి చర్యలు

- టీపీహెచ్‌డీఏ వేడుకల్లో మంత్రి దామోదర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో అన్ని రకాల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీపీహెచ్‌డీఏ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రాథమిక కేంద్రాల నుంచి రిఫరల్ ఆస్పత్రుల వరకు అన్నింటిని అనుసంధానిస్తామని తెలిపారు.



అనంతరం టీపీడీహెచ్‌ఏ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్ మాట్లాడుతూ 435 ప్రజారోగ్య వైద్యుల పోస్టులు మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియామకాల్లో వయస్సుకు ప్రాధాన్యతనిస్తూ సీనియార్టీ పాయింట్లు కలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే మిగిలిన శాఖల్లో ఉన్న వైద్యుల పోస్టులను కలిపి పోస్టుల సంఖ్యను పెంచాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ పూర్ణచందర్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అభిరామ్, డాక్టర్ శశి కుమార్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ వంశీ, డాక్టర్ భరత్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు మహిళ ఆత్మహత్య

- భర్త, కుటుంబీకులపై తండ్రి ఫిర్యాదు

నవతెలంగాణ - జవహర్‌నగర్



(ఫైల్)

వరకట్నం వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ ప్రాణం తీసుకుంది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల శ్రావణి(23)కి నాగులవంచ హేమ సుందర్‌తో 2023లో వివాహం జరిగింది. దంపతులిద్దరూ చిట్టినగర్ విజయవాడకు చెందినవారు కాగా హైదరాబాద్ వచ్చి ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వివాహ సమయంలో శ్రావణి తల్లిదండ్రులు కట్న కానుకలు ఇచ్చారు. అయితే, షాపు పెట్టుకునేందుకు మరికొంత నగదు కావాలని సుందర్ భార్యను వేధిస్తున్నాడు. దాంతోపాటు వివాహం జరిగి సంవత్సరానికి పైగా అయినప్పటికీ పిల్లలను కనడం లేదని శ్రావణిని భర్త, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు వేధించేవారు. వేధింపులు ఎక్కువవడంతో తట్టుకోలేక శ్రావణి ఆదివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తన కూతురి ఆత్మహత్యకు భర్త, ఇతర కుటుంబ సభ్యుల వరకట్న వేధింపులే కారణమని మృతురాలి తండ్రి వేముల ఏడుకొండలు సోమవారం జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యా? ఆత్మహత్యనా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైఫిల్, పిస్టల్ షూటింగ్ చాంపియన్లకు సీఎం అభినందన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"ఎయిర్ గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్" ఆధ్వర్యంలో గోవాలో జరిగిన 10వ నేషనల్ రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన భూక్య మోనాలిసా, భూక్య సోనాలిసాను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

సోమవారం సెక్రటేరియట్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసారు. రైఫిల్ అండ్ పిస్టల్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వీరు పట్టుదలతో ముందుకు సాగి అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ సత్తాను చాటాలని ఆయన వారిని ప్రోత్సహించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయసహకారాలను అందిస్తుందని భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం యువత క్రీడాకారులుగా ఎదిగే దిశగా ప్రభావవంతమైన కార్యాచరణ, ప్రణాళికను రూపొందించేందుకు కృషి చేస్తున్నదని సీఎం తెలిపారు.

చేనేత రంగంపై 'కొరటాల' విశేష కృషి



- అందువల్లే అప్పట్లో చేనేతకు రూ.30కోట్ల రాయితీ మంజూరు
- భూ సమస్యలు, ఇరిగేషన్‌పైనా లోతైన అధ్యయనం : కొరటాల వర్ధంతిలో సారంపల్లి మల్లారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగంపై విశేష కృషి చేసిన వ్యక్తి కొరటాల సత్యనారాయణ అని ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య తర్వాత ఇరిగేషన్ శాఖలపై ఆ స్థాయిలో అధ్యయనం చేసిన వ్యక్తి కొరటాల అని కొనియాడారు. సోమవారం హైదరాబాద్‌లోని నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం (ఎంహెచ్‌భవన్)లో కొరటాల సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కొరటాల చిత్రపటానికి సారంపల్లి మల్లారెడ్డి, నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. కొరటాల సత్య నారాయణ తనకు అత్యంత ఆప్తమిత్రుడన్నారు. ఏ విషయమైనా సూటిగా చర్చించేవారని చెప్పారు. ఒక దశలో రాజ్యసభకు అవకాశం వస్తే.. పార్టీ సెక్రెటరీగా ఉండటంతో విరమించు కున్నారని గుర్తుచేశారు. ఇరిగేషన్ శాఖలపై నిరంతర అధ్యయనం చేసిన వ్యక్తి అని, రాష్ట్రంలో ఎక్కడ నీటి వనరుల సమస్య వచ్చినా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేసే వారని చెప్పారు. భూ సమస్యలు, ఇరిగేషన్, రైతాంగ సమస్యలపైనేగాక.. చేనేత రంగానికి చేసిన కృషి అంతా ఇంతా కాదన్నారు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్.. స్వయంగా కొరటాల సత్యనారాయణను పిలిచి చేనేత కార్మికుల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.30కోట్ల రాయితీ మంజూరు చేశారని వివరించారు.

కొరటాల చేనేత రంగానికి సంబంధించిన వ్యక్తి కాకపోయినా.. చనిపోయేదాక ఆ రంగంపై నిరంతర అధ్యయనం చేశారన్నారు. అంతేగాక సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే భూ సమస్య ఎజెండా తెర మీదకు వచ్చిందని, అది కొరటాల హయాంలోనే జరిగిందని అన్నారు. ఎజెండా మీదకు తెచ్చిన భూ సమస్యతోపాటు ఇరిగేషన్, ఇతర ప్రజా సమస్యలపై కొరటాల స్ఫూర్తితో ఉద్యమాలు చేసి.. విజయం సాధించామన్నారు. అవినీతి, నిరుద్యోగంపై ఎన్నో పోరాటాలు చేశామని తెలిపారు. అన్ని ప్రజా సంఘాలకు మార్గదర్శకంగా కొరటాల పనిచేశారన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వేలకోట్ల అవినీతి, కుంభకోణాలు జరిగాయన్నారు. ప్రాజెక్టులకు ఖర్చు చేసిన సొమ్ము అంతా వృథా అయిందని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉచితాలపై ఉన్న శ్రద్ధ.. ధరణిపై లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో మీడియా ఒడిలో రాజకీయ నాయకులు నిద్రపోతు న్నారన్నారు. ప్రజల కోసం పని చేసే పత్రికను నిలబెట్టేందుకు సుందరయ్య, కొరటాలతో పాటు కార్యకర్తలు ఎంతో మంది తమ ఆస్తులు ఇచ్చారని గుర్తు చేశారు. నవతెలంగాణ, ప్రజాశక్తికి ఒక ప్రామాణికత ఉందని, ఈ పత్రికలు ఒక లక్ష్యం కోసం పని చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్భయంగా, నిర్మొహమాటంగా రాస్తున్న నవతెలంగాణ పత్రికని కొరటాల స్ఫూర్తితో మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్ మాట్లాడుతూ.. కొరటాల సత్యనారాయణకు.. పత్రికా రంగానికి ఎనలేని సంబంధం ఉందన్నారు. సాహితీ సంస్థ చైర్మెన్‌గా ప్రజాశక్తి కొత్త ఎడిషన్లు, కలర్ పేజీలు, పేజీల సంఖ్య పెంపు, టాబ్లాయిడ్స్ పెంచడంతో పాటు ఎంహెచ్ భవన్ స్థలం, నిర్మాణంలోనూ ప్రముఖమైన పాత్ర పోషించారన్నారు. ప్రస్తుతం వాడుతున్న మిషనరీతో పాటు బుక్‌హౌస్‌కు మంచి గుర్తింపు రావడం ఆయన హయాంలోనే జరిగిందన్నారు. సాహితీ సంస్థ చైర్మెన్‌గా ఆయన పాత్ర అపూర్వమైనదన్నారు. ఆయనతో దాదాపు 22 ఏండ్లు సుదీర్ఘకాలం పాటు పనిచేసే అవకాశం తనకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్, బుక్‌హౌజ్ ఎడిటర్ ఆనందాచారి, జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, బోర్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

25,036 మంది ఎస్జీటీల బదిలీ

- రంగారెడ్డిలో 955 మంది స్కూల్ అసిస్టెంట్ ట్రాన్స్‌ఫర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా 25,036 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)ల బదిలీలు ప్రభుత్వం చేపట్టింది. సోమవారం వారికి బదిలీల ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో) జారీ చేశారు. వారు బదిలీ అయిన కొత్త పాఠశాలల్లో చేరతారు. గతనెల ఎనిమిదో తేదీ నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మల్టీజోన్-1లో 11,177 మంది, మల్టీజోన్-2లో 7,765 మంది కలిపి మొత్తం 18,942 మంది ప్రభుత్వ స్థానిక సంస్థల పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించిన విషయం తెలిసిందే. హైకోర్టులో కేసు ఉండడంతో రంగారెడ్డి జిల్లాలో అప్పుడు ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం 955 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి. వారికి డీఈవో సుశీందర్‌రావు బదిలీల ఉత్తర్వులను జారీ చేశారు.

సర్కారు బడుల హేతుబద్ధీకరణ

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల హేతబద్ధీకరణ ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ చేపట్టింది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలోనే అంతర్లీనంగా ఆ ప్రక్రియను నిర్వహించింది. అందులో భాగంగానే సర్కారు బడుల్లో ఒకటి నుంచి పది మంది వరకు విద్యార్థులుంటే ఒకరు, పది మంది నుంచి 40 మంది వరకు ఇద్దరు, 41 నుంచి 60 వరకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టింది. అందుకనుగుణంగా బదిలీల ప్రక్రియలో ఖాళీలను చూపెట్టారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులను కేటాయించారు.

బదిలీ పొందిన వారిని రిలీవ్ చేయాలి : తపస్

బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏండ్ల తరబడి ఒకేచోట పనిచేస్తూ స్థానచలనం దొరికిందని భావించే తరుణంలో హేతుబద్ధీకరణ పాటిస్తూ కొన్ని ఖాళీలనే చూపించి కౌన్సెలింగ్ నిర్వహించారని తెలిపారు. బదిలీ పొందిన ఎస్జీటీలందరినీ వెంటనే కొత్త పాఠశాలకు రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. అవసరం ఉన్న చోట విద్యావాలంటీర్లను తీసుకోవాలని కోరారు.

ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలి : టీఆర్టీఎఫ్

బదిలీ పొందిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని టీఆర్టీఎఫ్ అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్గత సర్దుబాటు చేసిన తర్వాతే ఖాళీలను విద్యాశాఖ చూపించిందని తెలిపారు. ఇప్పుడు వారిని రిలీవ్ చేయకపోవడం సరికాదని పేర్కొన్నారు. అవసరం మేరకు విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు. ఎస్జీటీ బదిలీల్లో జరుగుతున్న నష్టాన్ని నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారని తెలిపారు.

నిమ్స్‌లో వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, జనరల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ నవల్ చంద్ర సోమవారం ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇమ్యూనైజేషన్ ప్రాధాన్యతను తెలుసుకునేందుకు, ప్రతి ఒక్కరికి అవసరమైన టీకాలను అందించేందుకు క్లినిక్ ఉపయోగపడుతుందని తెలిపారు. రోగనిరోధక వ్యవస్థ మార్పులు, అనారోగ్యం బారిన పడిన వారి ఉపశమనానికి టీకాలను వినియోగించుకోవచ్చని సూచించారు. దీర్ఘకాలికంగా రోగాలతో పోరాడుతున్న వారు వ్యాధులు నయం కాకపోవడంతో ప్రతి ఏటా 25 లక్షల మంది మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెబుతున్నాయని గుర్తుచేశారు. క్లినిక్ ద్వారా అంటువ్యాధులను వేగంగా గుర్తించే అవకాశముందని చెప్పారు. క్లినిక్ సేవలు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

నవతెలంగాణ
ఎల్బీనగర్ -మహేశ్వరం
7
మంగళవారం | జులై 02, 2024 | www.navatelangana.com

నాగోల్ చెరువు సుందరీకరణ పనులను చేపట్టాలి

సీపీఐ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ

నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ చెరువు సుందరీకరణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ సోమవారం సీపీఐ జిల్లా సమితి సభ్యులు కృష్ణ జోనల్ కమిషనర్ పంకజకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నాగుల్ చెరువు పనులకు గతంలో కొన్ని పనులను చేపట్టి నిలిపివేశారని, దీంతో పరిసర ప్రాంతాలలోని కాలనీవాసులకు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ లేక శారీరక వ్యాయామాలకు నోచుకోలేక పోతున్నారని ఆయన పేర్కొన్నారు. వెంటనే స్పందించి చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టి నిలిచిపోయిన నాగుల్ చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి చెరువు పరిసర ప్రాంత కాలనీ ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్ ,వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల ప్లేయింగ్ షర్ప్స్, పార్కులను ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో నోటు పుస్తకాలు అందజేత



నవతెలంగాణ-హయత్ నగర్

తాను చదువుకున్న పాఠశాలలో తన వంతుగా ఎంతో కొంత సాయం చేయాలనే తపన ఉండడం తో స్థానిక వాసి పోచబోయిన జగదీష్ యాదవ్ మన్సూరాబాద్ లోని బీ సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో పేద పిల్లలకు సోమవారం ఉచితంగా నోటు పుస్తకాలు,పలకలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ కూడా సమాజానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత,ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ సమస్య పరిశీలన



నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ లోని కమల నగర్ లో ఉన్న భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్ కు సరైన అవుట్ లెట్ వ్యవస్థ లేకపోవడంతో కాలనిలోని డ్రయినేజీ మ్యాన్ హోల్స్ తరచు పొంగి, మురుగు నీరు కాలనీ రోడ్ల పై ప్రవహిస్తూ అవస్థలు పడుతున్నామని, వర్ష కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువైతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డికి వివరించారు. ఈ మేరకు సమస్యను పరిశీలించిన కార్పొరేటర్.. భూగర్భ డ్రయినేజీ అవుట్ లెట్ పైప్ లైన్ నిర్మాణం కోసం లెవెల్స్ పరిశీలించాలని, సంబంధిత హెచ్ఎం డబ్ల్యూఎస్ ఎస్‌బీ సూపర్వైజర్ బాలు నాయక్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టీవీ రావు, కార్యదర్శి సుబ్బారావు, సంక్షేమ సంఘం సభ్యులు గణేష్, మల్లికార్జున్, రామ చంద్ర మూర్తి, మదన్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారాల్సిన అవసరం సబితమ్మకు లేదు

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



నవతెలంగాణ - చైతన్యపురి

పార్టీ మారాల్సిన అవసరం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డికి లేదని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. సోమవారం గ్రీన్ హిల్స్ కాలనీలోనీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబితా ఇంద్రారెడ్డి పార్టీ మారుతుందంట సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ నాయకులే ప్రచారం చేసి, వారే దిష్టి బొమ్మ దగ్ధం చేయడం ఆ పార్టీ దిగజారిన రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. పలు వేదికలపై పార్టీ మారడం లేదని స్వయంగా సబితా ఇంద్రారెడ్డి వెల్లడించినా కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి కేసీఆర్ నాయకత్వం లోనే బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతారన్నారు. ప్రజా తీర్పును శిరసావహిస్తూ 5 ఏండ్లు ప్రజా సమస్యల పై పోరాటం చేస్తాం అని అన్నారు. హామీల అమలు పై దష్టి సారించకుండా ప్రతి పక్ష ఎమ్మెల్యే లను ప్రలోభాలకు గురి చేయడం లో కాంగ్రెస్ వారు బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. గతం లో సబితా ఇంద్రారెడ్డి నియోజక వర్గ అభివద్ధికి రూ.240 కోట్లు తీసుకువచ్చి అభివద్ధి పనులు ప్రారంభిస్తే ఈ ప్రభుత్వం రాగానే ఆ నిధులను ఆపేసింద న్నారు. వెంటనే ప్రజా శ్రేయస్సుకు ఆ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మహేశ్వరం నియోజకవర్గము కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నియోజక అభివద్ధికి సహకరించా లని హితవు పలికారు. నియోజక వర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. అందరికీ సబితా ఇంద్రారెడ్డి అండగా ఉంటుంద ని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని పిలుపు నిచ్చారు.

ఏరియా ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ నందు జరిగిన రివ్యూ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది పలు సమస్యలను సుధీర్ రెడ్డి దష్టికి తీసుకువచ్చారు. దానిలో భాగంగా హాస్పిటల్ ఆవరణలో నూతన బి.టీ.రోడ్డు నిర్మాణం, లిఫ్ట్ సౌకర్యం, డయాలసిస్ సేవలు మెరుగుపరచడం, మంచినీటి సౌకర్యం, అలాగే కొన్నిచోట్ల డ్రయినేజీ పైప్ లైన్స్ పగిలిపోయినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే లిఫ్ట్ సౌకర్యం గురించి అధికారులతో మాట్లాడామని అలాగే డయాలసిస్ సేవలు మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. నూతన మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. హాస్పిటల్ నందు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ఆర్ ఎం ఓ డాక్టర్ హరిప్రియ, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్ రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులుగా మంగ రాఘవరావు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాశిబుగ్గ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సంఘం సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల అధికారులు అక్కినపల్లి వెంకటేశ్వర్ రావు,కట్టెకోల రత్నాకర్ రావుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మంగ మాధవరావు,ప్రధాన కార్యదర్శిగా బోర్పట్ల విరాట్ స్వరూపాచార్య, కోశాధికారిగా బళ్ళమూడి రాంబాబు,ఉపాధ్యక్షులుగా మంత్రాల శ్రీరామ మూర్తి, బి.ఎల్.నవీన్ కుమార్, వేముల కవిత,సహాయ కార్యదర్శులుగా వింజమూరి మధుసూదన్ రావు,నందూరి ప్రకాష్,ఇంగువ కిరణ్,కార్య నిర్వాహక కార్యదర్శిగా నూకల సతీష్ కుమార్,ప్రచార కార్యదర్శిగా వేముల రవి కుమార్,సాంస్కృతిక కార్యదర్శిగా పొట్లూరి విజయ లక్ష్మి, సభ్యులుగా పోగులపాటి శ్రీనివాస్ రావు,జనగాం ఉమా శంకర్, గంపా మాధవ రావు,సిరిపురం నరేందర్,మాధురి,మైథిలి, అవదానుల శారద, గుండమ రాజు,బద్రినాథ్, వెజ్జెళ్ళ కార్తిక్,అతుకూరి జగన్నాథ్, ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం కుటుంబాల అభివద్ధి సంక్షేమ కోసం తన వంతు కషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివద్ధికి కృషి చేస్తాం



- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి
- నూతన డిజిటల్ తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - హస్తినాపురం

ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి కషి చేస్తామని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హస్తినపురం డివిజన్ పరిధిలోని నందనవనం (మూసానగర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పాఠశాలకు మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణాలు, మౌలిక వసతులతో పాటు అదనపు సిబ్బందిని నియమించాలని ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావు కోరారు. సమస్యల పట్ల స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి పదో తరగతి ప్రారంభమవ్వడం శుభపరిణామమన్నారు. గతం లో పాఠశాల రెండు అంతస్తుల భవనం కోసం నిధులు మంజూరు చేయించడం జరిగిందని, వాటి నిర్మాణాలు త్వరలో చేపడతామని.. పాఠశాలకు అవసరమయ్యే అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్పొరేటర్ మాట్లడుతూ కార్పోరేటు పాఠశాలలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తూ విద్యార్థులను అన్ని రంగాలాలో ఉన్నతులుగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. ఇక్కడ నివసిస్తున్న విద్యార్థులు ఉన్నత పాఠశాల చదువు కోసం ఇబ్బంది పడుతూ వేరే చోటుకు వెళ్లాల్సి వచ్చేదని ఇక పై ఎలాంటి సమస్యలు ఉండవని సుజాత నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మ శ్రీనివాస్ నాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి,కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి,నాయకులు నారగోని శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, నరసింహ, సతీష్ గౌడ్ ,మమత మల్లేష్ గౌడ్,ఆది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ- నాగోల్

ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. నాగోల్ పోలీసు స్టేషన్ ఎస్ హెచ్‌వో సుధీర్ కృష్ణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాకేష్ మాలిక్ (25) అనే యువ కుడు నాగోల్ డివిజన్ పరిధిలోని ఆనంద నగర్ చౌరస్తాలో తన స్నేహితులతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సోమవారం అద్దె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ప్లంబర్ పనిచేస్తూ జీవనోపాధి పొందుతూ ఉండేవాడు. కైలాస్ మాలిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు వివరించారు.

డ్రయినేజీ సమస్యలను పరిష్కరిస్తాం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీలో డ్రయినేజీ సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ రఘు అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ వేంకటేశ్వర కాలనీ, 8వ డివిజన్ జయ సూర్యపట్నం కాలనీల్లో డ్రయినేజీల మ్యాన్ హెూల్స్‌లో మురుగు నీరు ఉప్పొంగిందని కాలనీ వాసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, ఇంద్రసేనలతో కలిసి డీఈఈ జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్‌తో కలిసి కమిషనర్ పర్యటించారు. అన్ని డివిజన్లలో ఉన్న డ్రయినేజీలకు మరమ్మతులు చేపిస్తామని తెలిపారు.

పొంగిపొర్లుతున్న మురుగునీరు



ఐఎస్ సదన్ డివిజన్‌లో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-సంతోష్ నగర్

ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వద్ద డ్రయినేజీ మురుగునీరు పొంగిపొర్లుతుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంకేశ్వరం బజార్ వెళ్ళే రోడ్డు మీదకు రావడంతో చిన్నచిన్న వాణిజ వ్యాపారస్తులు దుర్వాసనతో ఆందోళన చెందుతున్నారు. 15 రోజుల నుంచి డ్రయినేజీ మురికి నీరు పొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. వాటర్ వర్కర్స్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో నిత్యం డ్రయినేజీ మురుగునీరు రోడ్డుపై పొంగి పొర్లుతూ ప్రవహిస్తున్నది. ప్రతిరోజు ధోబి ఘాట్ చౌరస్తా, సంతోష్ నగర్, ఐఎస్ సదన్, మాదన్నపేట్, సైదాబాద్, మలక్ పేట, కోటి, మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌ల వద్ద ప్రతిరోజు ప్రయాణికులు వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. దాంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు చూసినా అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని దీంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో అయోమయంగా ఉందని ప్రజలు అంటున్నారు.కింది స్థాయి సిబ్బంది తమకు ఏమీ తెలియదని తప్పించుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. మామూలు సమయంలో నిత్యం పొంగిపొర్లుతూ రోడ్లన్ని దుర్గంధం వెదజల్లుతూ జలాశయాలను తలపిస్తున్నాయి. వర్షాలు కురిస్తే వరదనీటితో పొంగిపొర్లి డ్రయినేజీ మ్యాన్ హెూల్ మూతలు సైతం పోతాయని అలాంటి సమయాలలో రాకపోకలు సాగించడానికి భయాందోళనలకు గురవుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. ప్రాణాలు పోతే తప్ప వాటర్ వర్కర్స్ అధికారులు పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. అలాగే ఈ మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డ్రయినేజీ పొంగి పొర్లుతున్నడంతో పనులు నిలిచిపోయాయి. వెంటనే సమస్యలు పరిష్కరిం చకపోతే కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కొందరు స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్కర్స్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పొంగిపొర్లుతున్న డ్రయినేజీ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి సోమవారం మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్ లోని పద్మావతి కాలనీ, సాయి నగర్ కాలనీలలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.కాలనీ రోడ్లపై మట్టి పేరుకపోయి ఉండటంతో వర్షాలు పడి బురదగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని కాలనీ వాసులు తెలపడంతో కార్పొరేటర్ వెంటనే బాబ్కట్ యంత్రాంగం సహాయంతో రోడ్డుపై పేరుకుపో యిన మట్టిని తొలగించారు. కాలనీలో పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ పారిశుధ్య కార్మికుల విధుల నిర్వాహణపై అసంతప్తి వ్యక్తం చేశారు. కాలనీలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం ఉండడంతో కాలనీ వాసుల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుందని కార్మికులకు వివరించి కాలనీ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్పొరే టర్ కాలనీలో ఉన్న సమస్యలను, చేపట్టవలసిన అభివద్ధి కార్యక్రమాలను కాలనీ వాసులను అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య , కాలనీ అధ్యక్షులు రఘుపతి రావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అమర్నాథ్, యాదగిరి రెడ్డి ఉన్నారు.

తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారు



- మొద్దు లచ్చిరెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్స్ అందరికీ వైద్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కనిపించని దైవాన్ని పూజిస్తాము కనిపించే దైవంగా డాక్టర్లను భావిస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రోగుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా డాక్టర్లు పని చేస్తారని తెలిపారు. పగలు, రాత్రి ప్రజా సేవకే తమ జీవితాన్ని అంకితం చేస్తారన్నారు. డాక్టర్లు తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి రోగులకు సేవలందిస్తారని, ప్రతి డాక్టర్‌కు, వారికి సహకరిస్తున్న కుటుంబ సభ్యులకు పేరు పేరునా మరోసారి అభినందిస్తున్నానని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి నిధులు మంజూరు చేయాలని, సంబంధిత శాఖలో డాక్టర్లను నియమించాలని, స్కానింగ్ సెంటర్, డయాలసిస్ యూనిట్లను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్డెంట్ హరిప్రియ, డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది, వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, పార్టీ నాయకులు రఘురాం నేత, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి, రమేష్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాటోత్ ఠాణు నాయక్ జయంతి



నవతెలంగాణ-సంతోష్‌నగర్

సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠానునాయక్ 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గిరిజన విద్యార్థి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధారావత్ సురేష్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ సాయుధ పోరాటంలో దున్నే వాడిదే భూమి అన్న నినాదంతో బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసే దిశగా జాటోత్ ఠాణు నాయక్ నాటి ఆ పోరాటంలో ముందు వరుసలో పాల్గొని ప్రాణాలను తెగించి సబ్బండ వర్గాలకు న్యాయం చేసిన యోధుడు అన్నారు. గిరిజన భూములని ఆక్రమించుకొన్న పట్వారీ పటేళ్లను గడ గడలాడించిన మహనీయుడు అని గుర్తు చేశారు. ఠాణు నాయక్ 100 ఎకరాల భూమిని భూస్వామి పెత్తం దారుల నుంచి వీరోచిత పోరాటం చేసి వారి భూములు వారికి దక్కేలా పోరాటం సాగించిన గొప్ప నాయకుడు ఠాణు నాయక్ అని.. గిరిజనుల కోసమే కాకుండ అన్ని సబ్బండ వర్గాల కోసం పోరాటం చేసి న్యాయం చేసిన నాయకుడు అన్నారు. ఠాణు నాయక్ త్యాగాన్ని గుర్తించి ప్రభుత్వం ఆయన విగ్రహాన్నిట్యాంక్ బండ్ మీద పెట్టేలా చర్యలు తీసుకోవాలని, ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఘనంగా టెస్ కాబ్ వైస్ చైర్మెన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తుర్కయంజాల్

టెస్కాబ్ వైస్ చైర్మెన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య జన్మదిన వేడుకలను తుర్కయంజాల్‌లో ఘనంగా నిర్వహించారు. సత్తయ్య పుట్టినరోజు సందర్భంగా యంజాల్ హైస్కూల్‌లో, కమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సత్తయ్య మనవరాలు ధన్విక చేతుల మీదుగా కేక్ కట్ చేయించి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో తిలక్, నాయకులు కొల్లూరు నిరంజన్ రెడ్డి, మేతరి శంకర్, రవీందర్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు గాలయ్య పాల్గొన్నారు.

కంటికి కనిపించే దేవుళ్లు వైద్యులు

నవతెలంగాణ-సంతోష్ నగర్

కన్ను తెరిస్తే జననం కనుమూస్తే మరణం రెప్పపాటే జీవితం అయినా మనిషి ఆయుష వందేండ్లు పుట్టుక మొదలు చనిపోయే వరకుఎదుర్కొనే మానసిక శారీరక ఇబ్బందుల నుంచి కాపాడేది వైద్యం అని గాంధీ హాస్పిటల్ ఆర్ ఎం డాక్టర్ ఉపేందర్ అన్నారు. కనిపించే దేవుళ్లు వైద్యులు అని చెప్పారు. రంగారెడ్డి జిల్లా చంపాపేట్ డివిజన్ పరిధిలోని కాలనీలో తన గృహంలో ఏర్పాటు చేసిన డాక్టర్ డే వేడుకల్లో వారు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పోరాటం చేసే వైద్యులకి సిబ్బందికి డాక్టర్స్ డే శు భాకాంక్షలు అన్నారు. వైద్యం వ్యాపారమయంగా మారిపోయిన ఈ రోజుల్లో కూడా ఆదర్శప్రాయమైన డాక్టర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ ఉంటుందని కానీ వైద్య వత్తికి ఎటువంటి విరమణ ఉండదన్నారు. వారు చనిపోయే వరకు వైద్యం అందిస్తూనే ఉంటారని తెలిపారు. కరోనా సమయంలో ఎంతోమంది ప్రాణాలు కాపాడిన వైద్యులు సేవలు చాలా గొప్పవన్నారు. అయితే అక్కడక్కడ రోగులకు సంబంధించిన బంధువులు హింసాత్మకమైన సంఘటనలకు పాల్పడుతున్నారని.. అందుకే. ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రతి వైద్యుడు సేవా దక్పథం కలిగి ఉండాలన్నారు. డాక్టర్ బీసీ రాయిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



తమిళనాడు పర్యటనలో రవాణాశాఖ అధికారులు



- ఆ రాష్ట్రంలో అమలవుతున్న రవాణా విధానాలపై అధ్యయనం
- త్వరలో కమిషనర్‌కు పూర్తి నివేదిక అందజేస్తాం: డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖలో మరిన్ని కీలక సంస్కరణలతో పాటు ప్రజలకు సులభతర సేవలందించేందుకుగాను పొరుగు ఉన్న రాష్ట్రాలు రవాణాశాఖలో అనుసరిస్తున్న విధానా లను అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే కర్నాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్రలో ఈ బృందాలు పర్యటించగా, తమిళనాడుకు రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ ఆర్టీవో వాణి, కామారెడ్డి ఎంవీఐ జింగ్లి శ్రీనివాస్ అధికారుల బృందం బయలుదేరి వెళ్లింది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఆదేశాల ఈ అధికార బృందం తమిళనాడులో అమలవు తున్న రవాణా విధానాలను రెండు రోజుల పాటు అధ్యయనం చేయనుంది. ఈ సందర్భంగా వారు తమిళ నాడు రవాణా శాఖ కమిషనర్ షణ్ముగ సుందరంతో భేటీ అయ్యారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్, వాహన్ పోర్టల్, స్క్రాపింగ్ పాలసీ, పన్నుల విధానం, ఆదాయ వివరాలు, చెక్ పోస్టుల పని తీరు, ఆన్ లైన్ సర్వీసులు తదితర అంశాలపై అక్కడ అమలవుతున్న తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నట్టు డీటీసీ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తెలంగాణ అధికారుల బృందం అధ్యయనానికి తోడ్పాటు గా తమిళనాడు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్, ఆర్టీవో సంపత్ కుమార్, ఎంవీఐ కార్తీక్‌లను తమిళనాడు రవాణా శాఖ నియమించింది. అధ్యాయనం చేసిన అంశాలను సవివరంగా త్వరలోనే కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తామని చంద్రశేఖర్ గౌడ్ వివరించారు.

డాక్టర్ రమేష్‌కు నాచారం కార్పొరేటర్ శాంతి సన్మానం



నవతెలంగాణ-కాప్రా

రాఘవేంద్ర నగర్‌లో చాలా కాలంగా శివ నర్సింగ్ హోమ్ పేరుతో ఎంతో మంది పేదలకు తక్కువ ధరకే వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్‌ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ సోమవారం సన్మానించారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన సేవలను గుర్తించి సన్మానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబు సంజన్న చారి, అశోక్, ఏలియా, ప్రకాష్, ప్రీతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ తిరుమలానగర్ లయన్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో డిస్టిక్ లెవెల్‌లో డాక్టర్స్ డే సెలబ్రేషన్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుమలానగర్ తరఫున జడ్పీ మల్లేష్ గౌడ్, ప్రెసిడెంట్ మురళీకృష్ణ,సెక్రటరీ మురళి చారి, సురేష్‌గౌడ్, సీహెచ్ రాజు, ఆల్ క్లబ్ మెంబర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాస్ రావును సన్మానించారు. -నవతెలంగాణ,కాప్రా

పాఠశాలలో మరమ్మతు పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి మంజూరైన సీఎస్ఆర్ నిధులతో మరమ్మతు పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ జనరల్ మేనేజర్స్ శ్రీనివాస్, సీహెచ్. విశ్వనాథన్, కందుకూరి రవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ చేయడం అభినందనీయం అన్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్న భారత్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రూ.15లక్షలతో పాఠశాలకు ప్రహరీ గోడ, నీటిపంపు, టాయిలెట్స్, మెయిన్ గేటు ఏర్పాటుకు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్ రెడ్డి, సిబ్బంది, స్థానిక నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, యాదగిరి, వెంకటాచారి, సుధాకర్, భూపతి అశోక్, ఉల్లెం బాలరాజు, కత్తుల రాజ్ కుమార్, కొయ్యడ జైపాల్, పూస రమేష్, గడియారం రామకృష్ణ, చక్రవర్తి, నిస్సార్ అహ్మద్ గోరి, భూపాల్ గౌడ్, వసంతరావు, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని నాగారం వాటర్ ట్యాంక్ దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్ రావు నగర్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ సాయి హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్లబ్ నూతన అధ్యక్షురాలు లయన్ శ్రీదేవి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు తమ క్లబ్ ద్వారా మరింత విస్తృతంగా సేవలందిస్తామన్నారు. శిబిరంలో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ ఆప్టోమెట్రిస్ట్ అనీల్ బృందం కంటి పరీక్షలు చేశారు. పద్మసాయి డెంటల్ (సాకేత్, దమ్మాయిగూడ, నాగారం) డాక్టర్ దినేష్ నమిలే బృందం దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ భవాని ప్రసాద్ జనరల్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరమైన వారందరికీ ఉచితంగా మందుల పంపిణీ చేశారు. సియాన్ కాన్సర్ క్లినిక్ డాక్టర్ సుష్మిత బృందం ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేశారు. శిబిరంలో 172 మంది పరీక్షలు చేశారు. అందులో 12మందికి ఉచిత కాటరాక్ట్ ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి చనమోలు వరప్రసాద్, సభ్యులు ఆర్‌పీ.సేథ్, కే.విజయకుమార్, నరేష్, చందన్ రాజు, సునీల్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



- కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి
- కమిటీ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-కాప్రా

నాచారం మహంకాళి దేవాలయం అభివృద్ధికి ఆలయ కమిటీ చైర్మెన్ గుంటుక కృష్ణారెడ్డి, ఆలయ ధర్మకర్తలు బాధ్యతతో కృషి చేయాలని కాంగ్రెస్ ఉప్పల్ నియోజక వర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి ఆలయ ఎండోమెంట్ నూతన చైర్మెన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ కమిటీ చైర్మెన్, ఇతర కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించినందుకు ఆలయం అభివృద్ధికి నిరంతరం పని చేయాలని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు చేయించేందుకు తాను సహకరిస్తానని తెలిపారు. మహంకాళి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని కమిటీకి సూచించారు. ఆలయ కమిటీ చైర్మెన్‌గా గుంటుక కృష్ణారెడ్డి, సభ్యులుగా కతుకూరి శ్రీనివాస్ రెడ్డి, కొప్పోజి ప్రవీణ్, బొమ్మన పూర్ణిమ, మేడల ప్రేమ్ కుమార్ గౌడ్, వర్కల మహేష్ యాదవ్, కాసుల మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించిన శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని డీసీ కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, డాక్టర్స్ కాలనీలోని నెలకొన్న డ్రయినేజీ సమస్యను చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిష్కరించారు. గత మూడు రోజులుగా డ్రయినేజీకి మరమ్మతులు చేపట్టి సోమవారం పూర్తి చేయడంతో ఆయా కాలనీవాసులతో కలిసి డ్రయినేజీ పనులను పరిశీలించారు. మూడు కాలనీల ప్రజలతో మాట్లాడి ఎవరికీ ఆటకం కలగకుండా పనులు పూర్తి చేశామని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుగౌడ్, లక్ష్మీనగర్ కాలనీ ప్రెసిడెంట్ పి. శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, డీసీ కాలనీవాసులు నరసింహ గౌడ్, కుమార్, డాక్టర్స్ కాలనీ వాసులు రాజేష్, రాజు, తదితరులున్నారు.

సైబర్ సెక్యూరిటీ పై జాతీయ సదస్సు



నవతెలంగాణ-బోడుప్పల్

సైబర్ సెక్యూరిటీపై అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అధ్యయనాలు చేయాలని అరోరా పీజీ కాళశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల అన్నారు. హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) - హైదరాబాద్ చాప్టర్ ' సైబర్ సెక్యూరిటీ కరెంట్ పర్స్పెక్టివ్స్ ' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఎస్ఐ ఆన్యువల్ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2024 అందజేశారు. వాటిలో అరోరాస్ పీజీ కాలేజీ, ఉప్పల్ సీఎస్ఐ స్టూడెంట్ బ్రాంచ్‌కు 'బెస్ట్ ఎమర్జింగ్ స్టూడెంట్ బ్రాంచ్' అవార్డు వరించింది. దీంతో డైరెక్టర్ జె. శ్రీకాంత్, కాలేజీ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డి. శివ రంజాన్ దాస్, స్టూడెంట్ బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఈసీఐఎల్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖాన వైద్యాధికారులు పుష్పగుచ్చాలు, శాలువాలతో వైద్యాధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికీ డాక్టర్స్ డే సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రాణాంతక కరోనా మానవాళిపై విరుచుకుపడ్డప్పుడు డాక్టర్లు చేసిన సేవలు విస్మరించలేనివి అనీ, జిల్లాలో చాలా మంది వైద్యులు కరోనా బారినపడ్డ విషయాన్ని గుర్తు చేశారు. డాక్టర్లు తమ దగ్గరకు వచ్చిన రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధను, సంరక్షణను చూపించాలని తెలిపారు. అదే విధంగా రోగులు సైతం వైద్యుల పట్ల బలమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలనీ, అటు వైద్యులు, ఇటు రోగులు పరస్పరం గౌరవపూర్వకమైన భావనను పెంపొందించుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో వైద్యులు, హాస్పిటల్స్‌పై దాడులు చోటు చేసుకొంటున్నాయనీ, ఇలాంటి అవాంఛనీయ ఘటనల నుంచి రక్షణ అవసరమని వైద్య నిపుణులు విన్నవించారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన డీఎంఅండ్‌హెచ్‌ఓకు వైద్యాధికారులు అభినందనలు తెలిపారు.



పనితీరులో అగస్త్య సమర్థుడు



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అందరినీ సమన్వయం చేసుకుంటూ, పనితీరులో సమర్థుడైన అధికారిగా అభిషేక్ అగస్త్య మంచి పేరు తెచ్చుకున్నారని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కొనియాడారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) అభిషేక్ అగస్త్య ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతి శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అగస్త్య జిల్లాకు చేసిన సేవలు మరవలేమని అధికారులు కొనియాడారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు కూడా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యను శాలువాలతో సన్మానించి, మోమెంట్‌లు అందజేశారు.

వీరశైవ సమాజం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

కాప్రా వీరశైవ సమాజం నూతన కార్యవర్గాన్ని కాప్రా విజయ హై స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు పృట జ్ఞానేశ్వర్ ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా యావపురం విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా కత్తి శివానంద, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్, సిద్దేశ్వర్, మస్కురి శివ, శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా రామ్ శెట్టి, శంభు లింగం, గిరిజపతి, బసవరాజు, న్యాయ సలహాదారులుగా బసప్ప, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శంకరయ్య స్వామి, రాజేశ్వరరావు, మటం శివ, జగదీష్, అమరేష్, శెట్టి సాయి, శ్రీకాంత్, ప్రవీణ్, శివ, సలహాదారులుగా కొప్పునూరు బసప్ప, గంగా కుమారస్వామి, ఎన్.వి భద్రప్ప, దేశాయ్ బండే గౌడ, ఇమ్మడి వీరేశం, జగదీష్ చంద్, శశిధర్, బాల్‌రాజులను నియమించినట్టు తెలిపారు.

మృతుడి కుటుంబానికి బొంతు శ్రీదేవి పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

చిన్న చర్లపల్లికి చెందిన మహేష్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సోమవారం మృతుడి తల్లిదండ్రులను, భార్యా పిల్లలను పరామర్శించారు. వారికి మనోధైర్యాన్ని నింపి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు.

అతిసార వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

అతిసార వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్, సూర్యనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డయేరియా, అతిసార వ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవితో కలిసి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..అతిసారం ఇప్పటికీ ప్రజారోగ్య సమస్యగా ఉందని తెలిపారు. అతిసార వ్యాధితో పిల్లలు చనిపోతున్నారన్నారు. అతిసార వ్యాధిని అరికట్టడానికి వైద్య, నీటిసరఫరా కార్పొరేషన్, తదితర శాఖల సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో అతిసార వ్యాధి నిర్మూలనకు తీసుకోబోయే చర్యలను తెలుసుకున్నారు. ఒక్కొక్క శాఖ తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ మాధవి పలు సూచనలను చేశారు. జూలై 1 నుంచి 31 ఆగస్టు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన వారికి మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, వివిధ రకాల విటమిన్ మాత్రలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానికులు పద్మారెడ్డి, ఫైళ్ల ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి, ఉస్మాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు దేవుళ్లతో సమానం : వేముల సంజీవ గౌడ్



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లు దేవుళ్లతో సమానమని టీడీపీ మండల అధ్యక్షుడు వేముల సంజీవ గౌడ్ అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని డాక్టర్లను టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాణం పోసే ప్రతీ డాక్టర్ దేవుడుతో సమానమని తెలిపారు. డాక్టర్లు రోగులను ప్రేమతో చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, జగన్మోహన్, డాక్టర్లు కొట్టియా నాయక్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, కిరణ్, విజయదుర్గ శారద, జ్యోతిర్మయి, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ సమస్యల పరిష్కారానికి ఉప కమిషనర్ అంజనేయులు సర్కిల్ కార్యాలయంలో సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు డివిజన్లలో డ్రయినేజీ, స్ట్రీట్ లైట్‌ల సమస్యలు ఉన్నాయని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఉప కమిషనర్ సమస్యల ను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సర్కిల్ పరిధిలో క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.



చిల్కానగర్ డివిజన్ సమస్యలపై బీజేపీ నాయకులు ఫిర్యాదు

చిల్కానగర్ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కరించాలని బీజేపీ నాయకులు గోనె శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉప్పల్ మున్సిపల్ కమిషనర్ ఆంజనేయులును కలిసి సమస్యలు విన్నవించారు. డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, బీరప్పగడ్డలో నూతన రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఉన్నా నిర్మాణం చేపట్టడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం గోనె శ్రీకాంత్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లో రోడ్లు తవ్వి వదిలేయడంతో గుంతలు ఏర్పడి ప్రయాణికులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గతంలో నాయకుల ఇండ్ల ముందు రోడ్లు వేసుకున్నారని ఆరోపించారు. డ్రయినేజీ సమస్య విపరీతంగా ఉందని, ఎక్కడ చూసినా మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని బస్తీల్లో తాగునీటిలో డ్రయినేజీ నీరు కలుస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరప్పగడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, నర్సింహ్మా యాదవ్, షేక్ హసన్, కిరణ్ కుమార్, మణికంఠ, మహ్మద్ సికిందర్, వై. శ్రీధర్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ చారి ఉన్నారు.

బేకరీని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని ప్రశాంత్ నగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన ఎస్ ఎల్‌వీ బెంగళూరు అయ్యంగార్ బేకరిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత, నిర్వాహకులు అశోక్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రం వ్యాపారానికి అనుకూలంగా ఉందని తెలిపారు. దీనికి బెంగళూరు నుంచి వచ్చి స్థిరపడ్డ అశోక్ ఆదర్శమని పేర్కొన్నారు. బేకరీలో నాణ్యమైన ఆహార పదార్థాలను తయారు చేసి పేద ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు విక్రయించాలన్నారు. వ్యాపారంలో ఉన్నతంగా రాణించాలని అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, పల్లె రాజ్ కుమార్, చేర్యాల శ్రీనివాస్, పిట్టల నరేష్, మాస శేఖర్, రామానుజం, శ్రీనివాస్ యాదవ్, అశోక్ చారి, అలిబిలి మహేందర్ , బాలు, బాలేందర్, నర్సింగ్ నేత, కుమార్, సోమిరెడ్డి, కైలాసపతి, నాగప్ప,శ్యామ్,బాలు మొదలగువారు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజావాణిలో వివిధ విభాగాలకు చెందిన 24 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ భిక్షపతి, టీపీవో అలిపాషా, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్ గ్రూప్ చైర్మెన్ నాగేశ్వర్ రెడ్డికి పితృ వియోగం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఎస్ఎల్ గ్రూప్ చైర్మెన్ గుర్రాల నాగేశ్వర్‌రెడ్డి తండ్రి కొండాపూర్ మాజీ వార్డు సభ్యుడు గుర్రాల రామచంద్రారెడ్డి (88) సోమవారం మరణించారు. రాంచంద్రారెడ్డి మూడు దశాబ్దాల క్రితం గ్రామ వార్డు సభ్యుడిగా, వివిధ రంగాల్లో గ్రామానికి ఎనలేని సేవలు అందించారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. మృతుడి అంత్యక్రియలు మంగళవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ గ్రామంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు గుర్రాల నాగేశ్వర్ రెడ్డి, గుర్రాల నర్సింహా రెడ్డిలు తెలిపారు.

కాలుష్య రహిత సమాజం కోసం మొక్కలు నాటాలి



- ఎంపీపీ దాసరి ఎల్లూభాయి

నవతెలంగాణ-శామీర్‌పేట

కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని శామీర్‌పేట ఎంపీపీ దాసరి ఎల్లూభాయి బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. హరితహారంలో కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అలియాబాద్, లాల్‌గడీ మలక్ పేట గ్రామాల్లో ఎంపీపీ దాసరి ఎల్లూబాయిబాబు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతబాయి, ఎంపీటీసీలు కోడూరి అశోక్, ఆల ఇందిరా రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, బాబు, కల్పన, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వరల్డ్ స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా



- ఎస్ఎఫ్ఐ నాయకులతో వాగ్వాదానికి దిగిన ప్రిన్సిపాల్

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్ యాజ మాన్యం విద్యాశాఖ అధికారుల నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా యూనిఫాంలు, షూస్, టై, బెల్టు, పుస్తకాలు అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు స్కూల్ యూనిఫాంలు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించగా సంచుల్లోని యూనిఫామ్‌లు, పుస్తకాలు సిబ్బందితో బయటికి వేశారు. మరికొన్నింటిని సిబ్బంది సహాయంతో స్కూల్‌పై అంతస్తులోకి తరలించడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారితో పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఫీటర్ వాగ్వాదానికి దిగారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ..నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్న ఢిల్లీ వరల్డ్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు బాలకిరణ్, బిర్లా శేఖర్,బిర్లా నరసింహ పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రామలింగేశ్వర నగర్ రైల్వే గేట్ సమీపంలోని సర్వే నంబర్ 1058,1059లో ఉన్న పార్కు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేస్తు న్నారని కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కార్యాల యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఇట్టి పార్కు స్థలంలో కొంతమంది వ్యక్తులు నిర్మాణాలు చేపడుతూ రోడ్డు స్థలాన్ని సైతం ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో ప్రసాద్,సురేష్, వంశీ లు ఉన్నారు.

సూరారం సీఐగా ఎస్.భరత్ కుమార్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం పోలీస్ స్టేషన్ సీఐ ఏ.వెంకటేశం రూ.1 లక్ష లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్‌గా ఏసీబీకి చిక్కడంతో... ఆ స్థానంలో ఎస్.భరత్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న ఆయన నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టారు. భరత్ కుమార్ గతంలో పఠాన్ చెరువు ఎస్.ఐ, అమీన్ పూర్ ఎస్.ఐ, హత్నూర ఎస్.ఐ, మెదక్ టౌన్ ఎస్ఐ గా, జహీరాబాద్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, షాద్ నగర్ డి.ఐ గా, గచ్చిబౌలి ఉమెన్స్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ... శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జూదం, గంజాయి, అక్రమ బెల్ట్ షాపులు, వాటిపై ఎట్టి పరిస్థితులను రాజీపడే ప్రసక్తేలేదన్నారు. పోలీసు సిబ్బంది నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీలో డాక్టర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

డాక్టర్స్ డే పురస్కరించుకొని సోమవారం కేపీహెచ్‌బీ 5వ ఫేజ్ వద్ద లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ (లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ - మెగా సిటీ యువభారత్) వారి ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే లయన్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, లయన్ డి.కోటేశ్వర్ రావు లు ముఖ్య అతిథులుగా హాజరై వైద్య వృత్తిలో ఎన్నో సేవలు అందించిన డాక్టర్ ఎం.మల్లేశ్వర రావు, డాక్టర్ పి. రఘుపతి, డాక్టర్ హెచ్. సూర్య ప్రకాష్, డాక్టర్ వెంకటేష్మి, డాక్టర్ ఎం.తేజశ్రీలను శాలువాతో కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ ఎం.అనిల్ కుమార్, లయన్ అనిల్ కుమార్ రెడ్డి, లయన్ ఎస్.చెన్నారెడ్డి, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. మూసాపేట డివిజన్‌లోని శక్తి నగర్‌లోని పార్క్ కమ్యూనిటీ హాల్‌లతో పాటు, రామారావు నగర్ కాలనీ నుంచి స్నేహపూరి కాలనీకి అనుసంధానంగా ఉన్న నాలా పనులను, స్థానిక మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మోతి నగర్‌లోని వార్డు కార్యాలయంలో స్థానిక ప్రజలు, కాలనీ అసోసియేషన్‌ల అధ్యక్షుల ఫిర్యాదులను, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శక్తి నగర్‌లోని కమ్యూనిటీ హాల్ పార్కులను వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. అదేవిధంగా స్నేహపురి కాలనీ నాలా పనులలో జాప్యం జరగడం ద్వారా రానున్న వర్షాకాలంలో, ప్రజలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా డివిజన్‌లోని ఎక్కువ కాలనీలలో, డ్రయినేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, తద్వారా దోమల బెడదతో, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దానిని నివారించడానికి ఎంటమాలజీ, సిబ్బంది దోమల పిచికారి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రమేష్, డి.ఈ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ సిహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, కాలనీ అసోసియేషన్లు పాల్గొన్నారు.

వి వన్ స్పోర్ట్స్ కేఫ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు..

దేశ యువత క్రీడలపై, వ్యాయామాలపై శ్రద్ధ చూపుతుందని,అందులో ముఖ్యంగా క్రికెట్ ఆట పైన ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి బాల కృష్ణనగర్ సిజేఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో, నూతనంగా ఏర్పాటు చేసిన వి వన్ స్పోర్ట్స్ కేఫ్‌లను స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం వి వన్ స్పోర్ట్స్ యజమానులు దేవానంద్, వెంకటేష్‌లు ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ క్రికెట్‌లో భారత్ ప్రపంచ కప్పును గెలుచు కున్న తర్వాత యువకులందరూ హైదరాబాదులో ఘనంగా వేడుకలు చేసుకున్నారన్నారు. ఆటలు ఆడడం ద్వారా ఒకవైపు ఆరోగ్యం, మరో వైపు క్రీడలపై మక్కువ పెరుగుతుందని, ఇలాంటి మంచి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసిన దేవానంద్, వెంకటేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్, డివిజన్ అధ్యక్షులు సంతోష్ అంబటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువు, నాలలో వేయొద్దు



- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువులో గుఱ్ఱపుడెక్క పెరిగి దోమల బెడద ఎక్కువగా ఉందని పరిసర ప్రాంతాల ప్రజలు, సమస్యను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, కార్పొరేటర్ ఎంటమాలజీ సిబ్బందితో, కలిసి ఆకు తొలగించే యంత్రం సహాయంతో, గుఱ్ఱపుడెక్క ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుఱ్ఱపుడెక్క వల్ల దోమలవ్యాప్తి విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలు కూడా తమవంతు బాధ్యత వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కూడా ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు చెరువులో కానీ నాలాలో కానీ వేయొద్దని స్థానిక ప్రజలను కోరారు. చెత్తను వీధుల్లోనూ కాలువలోను కాకుండా తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ మీ ఇంటి దగ్గరికి వచ్చే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించాలని అన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, బాలస్వామి, రాజుగౌడ్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీరారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్, ఉషోదయ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సంఘ సేవకులు పీరారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, శ్రేయోభిలాషుల మధ్య ఘనంగా నిర్వహించారు. పలువురు శాలువాలతో సన్మానిస్తూ కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నివాస కార్యాలయం వద్ద పీరారెడ్డికి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు దొండేటి విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ ఎస్.కమలాకర్, కస్తూరి బాలరాజు, ఉమాదేవినగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.సమ్మయ్య యాదవ్ కూరపాటి కరుణాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కె.పి.వివేకానంద సమక్షంలో పుట్టినరోజు వేడుకలు...

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో బీఆర్ఎస్ 130 - సుభాష్ నగర్ డివిజన్ పార్టీ సీనియర్ నాయకులు అడప శేషు, 125 - గాజుల రామారం డివిజన్ ఉషోదయ కాలనీ ఫేస్ -2 సంక్షేమ సంఘం అధ్యక్షులు వీరారెడ్డి వారి జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ వేడుకల్లో గాజులరామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, బాబీ చౌదరి, వంశీ, సమ్మయ్య యాదవ్, పద్మజా రెడ్డి, కటింగ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నర్సింహారెడ్డి కళాశాలకు సీఎస్ఐ పురస్కారాలు

- బెస్ట్ డైరెక్టర్ పురస్కారం అందుకున్న కళాశాల డైరెక్టర్ డా.ఎ మోహన్



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సొసైటీ అఫ్ ఇండియా (సీఎస్ఐ) ఆధ్వర్యంలో పలు విభాగాలలో అవార్డులను దక్కించుకుంది. శనివారం శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్షిక శ్రేష్ఠత పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డా.ఎ. మోహన్‌కు బెస్ట్ డైరెక్టర్‌గా అవార్డు అందుకు న్నారు. బెస్ట్ ఔట్ స్టాండింగ్ వాలంటీర్ అవార్డు పయ్యావుల దినేష్ కుమార్‌కు, టెక్నికల్ యాక్టీవిస్ట్ స్టూడెంట్ బ్రాంచ్ సీ.ఎస్.ఈ. డిపార్ట్‌మెంట్ విభాగానికి అవార్డు, బెస్ట్ పేపర్ ప్రెజెంటేషన్ అవార్డ్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సైబర్ సెక్యూరిటీ కరెంట్ పర్స్పెక్టివ్స్ (ఐసీసీఎస్ పి -2024) "ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ బేస్డ్ న్యాచురల్ డిజాస్టర్ ప్రిడిక్షన్ అండ్ ఎర్లీ వార్నింగ్ సిస్టం" అంశం పైన డా. నల్లమోతు కవిత, కె.హేమలతకు, "క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ సైబర్ సెక్యూరిటీ: నావిగేటింగ్ ది న్యూ ఫ్రాంటియర్" అంశంపైన డా.సుజిత్, సిరిమళ్ళ సిరిచందన వచ్చినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నట్లు కళాశాల చైర్మెన్ జక్కుల నర్సింహా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి, ట్రెజరర్ జక్కుల త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. లోకనాథం, కళాశాల డీన్ - అకాడెమిక్స్ శ్రీలక్ష్మి, హెచ్.ఓ.డి. పురుషోత్తం పురస్కారాలు అందుకున్న ఫాకల్టీని, విద్యార్థులను అభినందించారు.

అంగన్‌వాడీలను ఇంటికి పంపించే నిర్ణయం ఉపసంహరించుకోవాలి



- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి, ఈ నెల 24వ తేదీ తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష చెల్లించాలని, యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 65 ఏండ్లు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10 వేల మంది ఉన్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని గతేడాది సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో 24 రోజులు నిరవధిక సమ్మె చేస్తే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 పెంచుతామనీ, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను ఈ నెల 4వ తేదీ తర్వాత ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. తమకు తీవ్రమైన నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీవో 10ని రద్దు చేయాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 లక్ష పెంచుతూ కొత్త జీవోను జారీ చేయాలని కోరారు.

హత్య కేసులో హంతకులకు జీవిత ఖైదు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హత్య కేసులో దోషులకు రంగారెడ్డి జిల్లా 6 ఏడీజే కూకట్‌పల్లి కోర్టు జీవిత ఖైదీలుగా జైలు శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ముజాహిద్, ఇస్మాయిల్ వేరే వేరే కేసులలో జైలుకు వెళ్లి జైలులో వీళ్ళిద్దరూ 2018లో పరిచయం అయ్యారు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత కూడా వీరి స్నేహం కొనసాగుతూ వచ్చింది. ముజాహిద్ శివరాంపల్లి తాడ్బన్ దగ్గర ఉన్న 500 గజాల స్థలాన్ని ఇస్మాయిల్‌కి గిఫ్ట్‌గా ఇచ్చాడు. వీరి స్నేహం ఇంకా దగ్గరవడంతో వ్యాపారం మొదలు పెట్టారు. జహీరాబాద్ దగ్గర కొంత భూమి కొని వెంచర్ వేశారు. వెంచర్ పనులు పూర్తి కావస్తున్న సమయంలో ఇస్మాయిల్ పాత కేసులలో మూడు నెలలు జైలుకు వెళ్ళవలసి వచ్చింది. వెంచర్ బాధ్యతలు ఇస్మాయిల్ ముజాహిద్‌కు అప్పగించాడు. ఇస్మాయిల్ జైలు నుంచి బయటికి వచ్చే సమయానికి వెంచర్‌లోని ప్లాట్స్ 90 శాతం విక్రయించుకున్నారు. దాంతో ఇస్మాయిల్ ముజాహిద్‌ని పలుమార్లు డబ్బులు అడగగా తాను వాడుకున్నానని తన దగ్గర లేవు అని సమాధానం ఇచ్చాడు. వీరిద్దరికీ ఇదే కారణంగా పలుమార్లు వాగ్వాదం జరిగింది. మాసబ్ ట్యాంక్‌లోని ఒక అడ్వకేట్ దగ్గర ముజాహిద్ సెటిల్మెంట్ చేసుకుందామని ఇస్మాయిల్‌ని పిలిచాడు. ఇస్మాయిల్ అక్కడికి వచ్చిన అనంతరం అక్కడ కూడా డబ్బు గురించి వాగ్వాదం జరిగింది. ఫైనల్‌గా రూ. 20 లక్షలు ఇస్తానని ఒప్పుకోగా ఇస్మాయిల్ ముజాహిద్ వేరే వేరే కార్లలో అక్కడి నుంచి బయలుదేరారు. మధ్యలో ఒక చోట ఆగి వీరిద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. జిలాని, ఫెరోజ్ వీరిద్దరూ ద్విచక్ర వాహనం తీసుకొని వారిని గమనిస్తూ వెళ్లారు. మాదాపూర్ 100 ఫీట్ రోడ్డు స్టార్టింగ్ పాయింట్ నీరుస్ దగ్గర మాట్లాడు తున్న క్రమంలో జిలాని వెనుక నుంచి వచ్చి ఇస్మాయిల్‌ను గన్‌లో కాల్చి చంపేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్ అదే రోజు ముగ్గురిని రిమాండుకు తరలించారు. సాక్ష్యాధారాలన్నీ పరిశీలించి దోషులకు రంగారెడ్డి జిల్లా జడ్జి సి.పావని శిక్ష విధించారు.

పాత్రికేయుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించండి



- మేడ్చల్ డీఈఓ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-దుండిగల్

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, చాలీ చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జిల్లాలోని ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ)ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ జిల్లా ప్రతినిధి బృందం సోమవారం డీఈఓ విజయకుమారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేది, క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేది జర్నలిస్టులే అని వారు అన్నారు. ఒక రకంగా అటు ప్రభుత్వంతో ఇటు ప్రజలతో ఉంటూ సర్వీసు చేస్తున్న జాబితాలో జర్నలిస్టులు ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో అలాంటి చాలా మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ పిల్లలను చదివించుకోలేక పోతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తోందని, జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక కోటా కింద అడ్మిషన్లు కల్పించాలని కోరారు. అదే సమయంలో జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకునే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇప్పించేలా సర్క్యులర్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జిల్లాకు చెందిన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యావాపురం రవి, జిల్లా కోశాధికారి బెలిదె అశోక్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ యంపల్లె పద్మారెడ్డి, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు గడ్డమీది అశోక్, కార్యదర్శి పి.శంకర్, కోశాధికారి ప్రచార కార్యదర్శి సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తా..




- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని స్థానిక నాయకులు అధికారుల సహాయ సహకారాలతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ తెలపారు. మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్‌లో సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో నెలకొన్న సమస్యలను నాయకులు అయన దృష్టికి తీసుకు రాగా అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా ఇక్కడ ఉన్న అంగన్వాడి పాఠశాలలో ఆయా మాత్రమే ఉందని, టీచర్ లేకపోవడంతో చిన్నారులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. మరుగుదొడ్లు, వాటర్ కరెంటు కూడా లేదని అసోసియేషన్ సభ్యులు రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ రెవెన్యూ వాటర్ వర్క్స్ అధికారులు సమస్యల పరిష్కారంలో సత్వరమే స్పందించడం తమకు సానుకూల అంశం అన్నారు. పెన్షన్లు, జీరో కరెంటు బిల్లుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, ఎక్కడికక్కడ అణదొక్కడం చేశారని రమేష్ ధ్వజమెత్తారు. అలాంటి పరిస్థితుల్లో నాయకుల పోరాటంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్స్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, కుక్కల రమేష్, బాకీ, మాధురి రాము, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను నియమించండి



- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు సీపీఐ వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మండలానికి శాశ్వత తహసిల్దార్ (ఎం.ఆర్.ఓ) ను నియమించాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్‌తోపాటు సీపీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు మాట్లాడుతూ మండల రెవెన్యూ అధికారి (తహసిల్దార్) లేకపోవడం వల్ల ప్రజలకు విద్యార్థులకు కులం, స్థానికత ఇతరత్రా పత్రాలు సకాలంలో లభించడం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మండలంలోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నాయని వెంటనే ఇన్‌చార్జి కాకుండా రెగ్యులర్ తహసిల్దార్‌ను నియమించాలని కోరారు. దీనికి కలెక్టర్ గౌతమ్ స్పందిస్తూ రెండు రోజుల్లో తహసిల్దార్ వస్తారని లేనిపక్షంలో కొత్తవారిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు వి.హరినాథ్,వంగాల శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, చర్లపల్లి రాములు, ఇమామ్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా టి.భాను



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్‌లో సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నవోదయ హైస్కూల్లో ఉత్కంఠ భరితంగా నిర్వహించారు. శ్రీనివాస్ నగర్ బస్తీలో 700 వందల పై చిలుకు ఓట్లు ఉండగా అందులో 573 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. అధ్యక్ష బరిలో టి.భాను ప్రకాష్, దుర్గం మురళి గౌడ్, శేషాని నర్సింగ్ గౌడ్‌లు దిగారు. టి.భాను ప్రకాష్‌కు 254 ఓట్లు రాగ బరిలో ఉన్న మురళి గౌడ్‌కు 171, నర్సింగ్ గౌడ్‌కు 145 ఓట్లు వచ్చాయి. 83 ఓట్ల మెజార్టీతో టి.భాను ప్రసాద్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. అనంతరం భాను ప్రకాష్ ప్యానెల్ సభ్యులు, అభిమానులు సాయంత్రం పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, శ్రీనివాస్ నగర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడుగా గెలిచిన టి.భాను ప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గెలిపించిన బస్తీ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. కుల మతాల, పార్టీల కతీతంగా అందరిని కలుపుకుపోతూ వర్గ విభేదాలకు తావివ్వకుండా బస్తీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి..



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి ఇప్పటి వరకు జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ తమ పరిధిలో ఇప్పటి వరకు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలనీ, మీ పరిధిలో పరిష్కరించలేని దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుదారునికి వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజావాణికి 114 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



'తుల్జా భవాని' అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన కత్తిని ఎమ్మెల్యేని నిజాంపేట్ మధురానగర్ కాలనీ వాసులు బహుకరించారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మధురానగర్ ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్ రావు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌కి "తుల్జా భవాని" వద్ద పూజలు చేయించిన కత్తిని బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ నా గెలుపు కొరకై కృషిచేసిన కుత్బుల్లాపూర్ ప్రజానీకానికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్ మాదాసు రాంచంద్రకాలనీలో తాతారావుకు చెందిన బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణంతో పాటు సమీపంలో గల మరో అక్రమ బిల్డింగ్ నిబంధనలకు విరుద్ధంగా ,నిర్మించడంతో.. ఇటీవల మల్లంపేట్ లో యేథేచ్ఛగా అక్రమ నిర్మాణాలపై వివిధ వరుస కథనాలు వార్త పత్రికలలో వచ్చాయి. దాంతో సోమవారం ఎట్టకేలకు అక్రమ రెండు బిల్డింగ్‌లపై అధికారులు చర్యలు చేపట్టి స్లాబ్ లు గోడలు కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఎన్ఎస్‌లో ఎల్‌బీనగర్‌లో మొదటి కేసు

నవతెలంగాణ-హయత్ నగర్

బ్రిటిష్ కాలం నాటి నుంచి అమలులో ఉన్న చట్టాలకు కాలం చెల్లింది. 150ఏండ్ల తరువాత మారి సోమవారం నుంచి ఇండియన్ పీనల్ కోడ్ ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీ ఎస్ ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్పీసీ)స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత(బీ ఎస్ఎస్-ఎస్)ఇలా ప్రతి దానిలో మార్పులు చేర్పులు చేశారు. ఇప్పటికే పోలీసులకు వాటిపై అవగాహన కల్పించారు. ఇక ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొదటగా నూతన చట్టం ప్రకారం కేసు నమోదైంది. బాలాపూర్ మండలం నందీహిల్స్ రోడ్ నెంబర్ 11లో నివాసం ఉంటున్న చింతం రెడ్డి నారాయణ రెడ్డికి ఎల్‌బీనగర్ లోని ఆలేఖ్య టవర్స్ వద్ద ఉన్న కిరణ్ బహర్ కేఫ్‌లో ఉండే యజమాని అయిన కిరణ్ వద్ద నారాయణ రెడ్డిలు ఇద్దరు కలిసి మాట్లాడుకుంటున్న సమయంలో గొడవ జరిగింది. దీంతో తనపై కిరణ్ దాడి చేశారని తన ఎడమ కాలికి గాయం అయ్యి తీవ్ర రక్త స్రావం అయిందని నారాయణ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కంటోన్మెంట్

మనస్తాపానికి గురై ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకు చనిపోయిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళ్తే బొల్లారం ఆ పిక్చర్ కాలనీలో ఉండే 17 సంవత్సరాల నిఖిల్ తన నానమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. అతను రెండోసారి కూడా పదో తరగతి ఫెయిల్ అయ్యాడు. దాంతో మనస్తాపానికి గురై ఇంట్లో తాడుతో ఉరేసుకుని చనిపోయాడు. విషయం తెలిసిన వెంటనే బొలారం పోలీసులు సమాచారం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

జపాన్ 2వ ప్రపంచ కాంగ్రెస్‌కు ప్రొ. రాథోడ్ , ప్రొ.రాజేష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రానికి చెందిన ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్‌లు మాజీ వీసీ ప్రో.లక్ష్మీ కాంత్ రాథోడ్, మాజీ ప్రిన్సిపాల్ ,ప్రస్తుత ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రో.రాజేష్ కుమార్‌లు జూలై 5 నుంచి 8 వరకు జపాన్ టోక్యోలో గల టోక్యో గకుగీ యూనివర్సిటీలో జరగనున్న ఇంటర్నేషనల్ అలయన్స్ ఫర్ హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, డ్యాన్స్ అండ్ స్పోర్ట్స్ 2వ ప్రపంచ కాంగ్రెస్‌లో పాల్గొంటున్నారు. ఈ మేరకు వారి ఇరువురుకి ఆహ్వానం అందింది. స్పోర్ట్స్ కాన్ఫరెన్స్‌లోని ప్రో.ఎల్.బి. లక్ష్మీకాంత్ రాథోడ్ మహబూబ్‌నగర్-పాఠశాల స్థాయి పురుష ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక చేసిన ఫిజికల్ ఫిట్‌నెస్ వేరియబుల్స్‌పై నిర్దిష్ట శిక్షణ కార్యక్రమం ప్రభావం అనే అంశంపై పేపర్ సమర్పణ చేసి ప్రసంగించనున్నారు. ప్రొఫెసర్ రాజేష్ కుమార్, డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్, భారతీయ పాఠశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యత అనే అంశంపై పేపర్ సమర్పణ చేసి ప్రసంగించనున్నారు. వీరు ఇరువురు గతంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో పేపర్స్ సమర్పించారు. పలు సెమినార్స్ , సదస్సులో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో క్రీడా రంగానికి విశేష సేవాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రొపెసర్స్ ,విద్యార్థులు , ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

డీఎస్సీ వాయిదా వేసి ఖాళీల సంఖ్య పెంచాలి

- **డాక్టర్. ప్రేమ్ కుమార్**



నవతెలంగాణ-ఓయూ

డీఎస్సీ వాయిదా వేసి పోస్టుల సంఖ్య పెంచాలని డా.ప్రేమ్ కుమార్ కోరా రు. నిరుద్యోగులు ఎన్నో సంవత్సరాల నుంచి ఆర్థిక పరిస్థితులను కూడా లెక్క చేయకుండా అహర్నిశలు కుటుంబాలకు దూరముండి కష్టపడుతూ ఎంతో ఆశ తో ఎదురుచూస్తున్న తరుణంలో గత ప్రభుత్వాలు చేసిన మాదిరే ఈ ప్రభుత్వం కూడా డీఎస్సీ కొనసాగించడనికి సిద్ధమైందన్నారు. అధికారం లోకి రాకముందు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను వాడుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయం తక్కువ ఉండడం వల్ల ప్రిపరేషన్‌కు ఇబ్బంది గా మారిందని రెండు లేదా మూడు నెలలు వాయిదా వేసి పోస్టులు ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని, లేనిచో పోటీపడే నిరోద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని, కొన్ని జిల్లాల్లో కొన్ని సబ్జెక్ట్ సున్న ఖాళీ లు చూపిస్తున్నాయని, కొన్ని జిల్లలో ఒకటి,లేదా రెండు ఖాళీలు ఉన్నాయని, ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరారు.



ఓయూ సి.ఎఫ్.ఆర్.డి.లో రీసెర్చ్ టెక్నిక్‌లపై ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

నవతెలంగాణ-ఓయూ

విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (సీఎఫ్ఆర్డి) రీసెర్చ్ టెక్నిక్లపై నాలుగో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ కార్యక్రమం సైన్స్‌లో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన కోసం అత్యాధునిక పద్ధతుల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా వారం రోజుల పాటు జరిగే కార్యక్రమం నిర్వహించనున్నారు. బయోకెమిస్ట్రీ విభాగం కోఆర్డినేటర్, హెడ్ ప్రొ. మంజుల భానూరి, మైక్రోబయాలజీ విభాగంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ కోఆర్డినేటర్, చైర్‌పర్సన్ డాక్టర్ హమీదా బీ, ఓయూ హెచ్చిడిసి కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళిధర్ రెడ్డి లైఫ్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, బయోమెడికల్ ఇంజినీరింగ్, కెమికల్ టెక్నాలజీ వంటి అనుబంధ విషయాల కోసం ప్రోగ్రామ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఉన్నత స్థాయి పరిశోధనలు చేయాలనుకునే ఎవరికైనా ఈ భవనంలో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఈ కార్యక్రమం కన్వీనర్, సి. ఎఫ్. ఆర్. డి. డైరెక్టర్ ప్రొ. సందీప్తా బుర్గుల వివరించారు.



నాదెండ్ల భాస్కర్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన మర్రి పురురవ రెడ్డి

నవతెలంగాణ-బేగంపేట్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు 90 వ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర యువ నాయకులు గౌరవ పెద్దలు మర్రి పురురవ రెడ్డి సోమవారం జూబ్లీహిల్స్ లోని వారి ఇంటికి చేరుకొని ఆయన పుష్పగుచ్చమును అందజేసి, శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేసారు. అక్కడే నాదెండ్ల భాస్కర్ రావుతో పాటు ఉన్నవారి తనయుడు జనసేన పార్టీ నాయకులు, ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల మంత్రి అయినందున శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ సందర్భంగా మర్రి పురురవ రెడ్డి మాట్లాడుతూ నాదెండ్ల భాస్కర్ రావు తో తమ కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయని.. తమ తాత డా. మర్రి చెన్నారెడ్డి తో మొదలుకొని తమ వరకు అలాగే సంబంధాలు సాగుతున్నాయని తెలియజేసారు. పార్టీలు వేరైనా వారు సన్నిహితులు. వారు మరిన్ని పుట్టిన రోజులు జరుపుకుంటూ మంచి ఆరోగ్యంతో జీవించాలి మర్రి పురురవ రెడ్డి భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి, ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 140 మంది అర్జీలు సమర్పించారు. ప్రజా ప్రతినిధులు సమర్పించిన దరఖాస్తులు, ప్రజా దర్బార్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 140 అర్జీలు రాగా.. 79 గృహ నిర్మాణ శాఖవి, 16 హైదరాబాద్ పెన్షన్, 3 డీఈవో, 4 అసిస్టెంట్ డైరెక్టర్ డిజేబుల్ వెల్ఫేర్, 11 ఎస్సీ కార్పొరేషన్, 30 ఇతర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెను వెంటనే పరిషార్కరం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, అధికారులు,తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్..

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఇద్దరు మహిళల పై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని సుల్తాన్ బజార్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్ స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పర్ పల్లి, లింగంపల్లి, మక్తల్ ప్రాంతానికి చెందిన చాంద్ పాషా(26) వృత్తి రీత్యా కూలి పనులు చేసుకుంటూ ఇసామియా బజార్ లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలపై లైంగిక దాడికి పాల్పడి పరారీలో ఉన్నాడు. ఒక సంవత్సరం క్రితం ఒకరిని, మరో మూడు సంవత్సరాల కిందట మరొకరి పై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆ మహిళల తండ్రి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ కిందకేసు నమోదు తీసుకున్న మల్కాజ్ గిరి పోలీసులు సుల్తాన్ బజార్ పోలీసులకు ఈ కేసును అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చాంద్ పాషాన్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు

ప్రభుత్వ పాఠశాలకు దారి ఇవ్వండి

- **ఎమ్మార్వో కార్యాలయాన్ని స్కూలుకు కేటాయించాలి**
- **సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**



నవతెలంగాణ-ఓయూ

చిలకలగూడ,దూద్ బావిలోని గల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరియైన రోడ్డు మార్గం గానీ, ప్రధాన గేటు గాని లేకపోవడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు చాలా అవస్థలకు గురవుతున్నారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అంగన్వాడి కేంద్రం కూడా ఇదే పాఠశాలలో కొనసాగుతుందని.. చిన్నపిల్లలకు, గర్భిణులకు అందించే పోషకాహారాన్ని తీసుకురావాలన్నా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. పాఠశాల ప్రహరీకి ఆనుకొని ప్రధాన రహదారి ఉన్నప్పటికీ ప్రధాన ద్వారం లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గర్భిణులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థు ల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని తక్షణమే స్కూల్ తూర్పు వైపున ప్రధాన ద్వారం (పెద్ద గేట్) ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులంతా ప్రయివేటు స్కూల్ వైపు మొగ్గు చూపుతున్నారని.. అడ్డగుట్టలోని మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయం అక్కడి నుండి తరలించి ప్రభుత్వ స్కూలుకు ఆ భవనాన్ని అప్పజెప్పాలన్నారు. ఎమ్మార్వో కార్యాలయం ప్రభుత్వ స్కూల్ సొంత భవనం కావున స్కూలుకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న 7వేల స్కాలర్‌షిప్‌ను తక్షణమే విడుదల చేయాలని హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ కలెక్టర్‌కు విన్నవించారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, గువ్వల మల్లేష్ పాల్గొన్నారు.

24 గంటల్లోగా సమస్య పరిష్కరించాలి

- **ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశం**



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్టలోని గంగాపుత్ర సంఘం సమీపంలో నిర్మాణ సామగ్రి, చెత్త చెదారం వల్ల పాముల బెడదను తాము ఎదుర్కొంటున్న అంశాన్ని స్థానికులు సోమవారం ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను కలిసి వివరించారు. తాము పట్టుకున్న పామును వారు ఈ సందర్భంగా చూపుతూ తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. జీహెచ్ఎంసి. అధికారులను సంప్రదించి 24 గంటల్లో వారి ఇబ్బందిని పరిష్కరించాలని, పాములు సంచరించకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించని పక్షంలో తాము తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

పార్కుల అభివృద్ధికి ఏర్పాట్లు : ఎమ్మెల్యే

ఓయూ : పార్కులు, క్రీడా మైదానాల అభివృద్ధికి ఏర్పాట్లు జరుపుతున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. చిలకలగుడా పార్కు లో షటిల్ ఆడే క్రీడాకారులు సోమవారం సితాఫలమండిలోని క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమను పార్కులో ఆడుకొనేందుకు మున్సిపల్ అధికారులు అనుమతించడం లేదని ఫిర్యాదు చేశారు. పార్కులో వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు జరుపుతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఫ్రైడే మార్కెట్ సమీపంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదించామని, త్వరలోనే నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



ఆధార్ కార్డ్ సెంటర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

పాత బోయిన్‌పల్లిలో ఆధార్ కార్డు నమోదు సెంటర్‌ను బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆధార్ కార్డులో ఏదైనా తప్పొప్పులుంటే ఈ సెంటర్‌లో వెళ్లి సరిచేసుకోవచ్చని తెలిపారు. కొత్త కార్డులు కూడా ఈ సెంటర్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:00 వరకు ఈ సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ప్రెసిడెంట్ సయ్యద్ ఇజాజ్, నదీమ్ పటేల్, ఇలియాస్ బైగ్, అడ్డు బాయ్, మహద్ షరీఫ్, షకీల్, పిట్ల రాజు ముదిరాజ్, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.

పల్లవి మోడల్ స్కూల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-బేగంపేట్

నాణ్యమైన ఉత్తమ విద్యను విద్యార్థులకు అందించడమే ధ్యేయంగా పెట్టుకున్న పల్లవి మోడల్ స్కూల్, బోయిన్ పల్లి శాఖ వారు 30వ ఆవతరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు, పల్లవి సంస్థల చైర్మెన్ మల్కా కొమురయ్య నేతత్వంలో ఈ పాఠశాల దినదినాభివృద్ధిచెంది శాఖోపశాఖలుగా విస్తరించింది. కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ముఖ్య అతిథి లెఫ్టినెంట్ కల్నల్, మంజుల్ శర్మను గౌరవ అతిథి మల్కా కొమరయ్యను, మల్కా యశస్విని పాఠశాల ప్రిన్సిపాల్ రేణు చక్రబర్తి సత్కరించి, స్వాగతించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పట్టుదల, కృషి, క్రమ శిక్షణతో విద్యార్థులు ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. "జీవితంలో అత్యున్నత స్థాయి విజయాన్ని సాధించేందుకు తగిన ఆత్మవిశ్వాసంతో, బహుముఖ ప్రజ్ఞతో ముందుకు సాగాలని, జీవితంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలి" అని విద్యార్థులను ఉద్దేశించి చైర్మెన్ మల్కా కొమరయ్య ప్రసంగించారు. పల్లవి సంస్థల సి.ఇ.ఒ. మల్కా యశస్వి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక దశాబ్ద అనుభవాన్ని, రెండు దశాబ్దాల అనుభవాన్ని పూర్తి చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్య అతిథి లెఫ్టినెంట్ కల్నల్ మంజుల్ శర్మ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన విద్యార్థి క్యాబినెట్ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని మంచి నాయకులుగా ఎదగాలి" అని తెలిపారు. 2023- 2024లో 10, 12 తరగతులకు బోధించిన ఉపాధ్యాయుల అంకిత భావాన్ని గుర్తించి, సత్కరించారు.సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకు లను ఎంతగానే అలరించాయి. వైస్ ప్రిన్సిపల్ పూజ సక్సేనా, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయ బందం, తల్లిదండ్రులు.... తదితరులు పాల్గొన్నారు.

ఓయూ జేఆర్‌గా శ్రీనివాస్..



- **విశేష అనుభవం, మెరిట్‌కు పెట్టింది పేరు శ్రీనివాస్..**
- **ఓయూలో సంస్కరణలు, ఉద్యోగుల అభ్యున్నతికి కృషి : శ్రీనివాస్..**

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం నూతన జాయింట్ రిజిస్ట్రార్ (పరిపాలన విభాగములో)గా ఎం. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రో.పి.లక్ష్మీ నారాయణ నుంచి ఆయన నియామక పత్రం స్వీకరించారు. శ్రీనివాస్ 1986లో ఓయులో జూనియర్ అసిస్టెంట్ గా విధుల్లో చేరి, సీనియర్ అసిస్టెంట్ గా, సూపరింటెండెంట్‌గా, ఏఆర్‌గా, ప్రస్తుతం డిప్యూటీ రిజిస్ట్రార్ గా పని చేస్తూ జాయింట్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఆయన అన్ని విభాగాల్లో మెరిట్ ఆధారంగా ఇక్కడికి చేరుకున్నారు. శ్రీనివాస్ పాలక మండలి సమావేశల్లో, ఫైనాన్స్ కమిటీ సమావేశాల్లో, ఓయూ బడ్జెట్ రూపకల్పనలో, విశేష అనుభవంతో సేవలు అందజేశారు. సచివాలయంలో ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఉన్న శ్రీనివాస్ ఓయూకు బ్లాక్ గ్రాంట్స్ తీసుకు రావడంలో ముందు ఉన్నారు. ఓయూలో పలు సంస్కరణలకు కృషి చేస్తానని, ఉద్యోగుల, యూనివర్సిటీ అభ్యున్నతికి తోడ్పాటు చేస్తానని చెప్పారు.

వేల విద్యార్థులకు ఆరుగురే ఉపాధ్యాయులా..?

- **కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్**

నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్ నగర్ లోని గవర్నమెంట్ రౌండ్ టేబుల్ స్కూల్ లో తీవ్రంగా ఎదుర్కొంటున్న టీచర్స్ కొరత సమస్యపై స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణిని సోమవారం ఆమె కార్యాలయంలో కలిసి సమస్యలు గురించి వివరించారు. 30 మంది టీచర్లకు గాను గాను ఆరుగురే ఉండటం వల్ల విద్యార్థులకు బోధన విషయం లో సమస్య ఏర్పడుతోందని.. దీనిపై దష్టి కేంద్రీకరించాలని కోరారు. అందుకు డీఈఓ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. అదేవిధంగా బీ జే ఆర్ నగర్ లోని శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను పునర్నిర్మించి స్థానిక విద్యార్థులకు విద్యానందించే అవకాశం కల్పించాలని, ఎన్నో సంవత్సరాలనుండి విద్యాబోధన కీనోచుకోకుండా శిదిలావస్థలో ఉన్న స్కూల్ భవనం విషయంలో,ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించి నూతన పాఠశాల భవనం నిర్మిస్తే బాగుంటుందని కార్పొరేటర్ తెలిపారు.



నిరుద్యోగుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

- **రాజారామ్ యాదవ్**

నవతెలంగాణ-బేగంపేట్

నిరుద్యోగుల డిమాండ్ లను తక్షణమే పరిష్కరించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ కు ఏమైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గాంధీ ఆస్పలో వారం రోజులుగా ఓయూ విద్యార్థి నాయకుడు మోతిలాల్ నాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నేపథ్యంలో సోమవారం ఆయనకు మద్దతుగా పరామర్శించడనికి విద్యార్థి నాయకులతోపాటు బీఆర్ఎస్, నాయకులు, వివిధ సంఘాల నాయకులు గాంధీ ఆస్పత్రికి వచ్చారు. పోలీసులు భారీగా మోహరించి అక్కడే వారిని అడ్డుకొని అరెస్టు చేయడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పలువురు రాజకీయ నాయకులతో పాటు విద్యార్థి నాయకులను అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బక్కా జడ్సన్, పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మోతిలాల్ నాయక్‌తో మాట్లాడాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులతో చర్చ జరిపి, ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు నిరుద్యోగుల పక్షాన బీసీ జన సభ పోరాటం చేస్తుందని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగులకు మద్దతుగా ఎంతవరకైనా తెగించి కొట్లాడుతామని, విద్యార్థులు అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. మోతిలాల్ నాయక్ దీక్ష విరమించాలని మీడియా సాక్షిగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఏడు రోజుల నుండి ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేకపోవడం దురదృష్టకరమన్నారు.ఆనాడు నిరుద్యోగుల కోసం మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాంరెడ్డి, రియాజ్, బల్మూరి వెంకట్, ఆకునూరి మురళి ఇప్పుడు స్పందించాలన్నారు .ప్రభుత్వం మెడలు వంచైనా, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేసేవరకు విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని రాజారాం యాదవ్ హెచ్చరించారు.




కరెంటు పోతే పునరుద్ధరించట్లేదు...

- **రాజీవ్ నగర్ కాలనీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పీఎస్ జి. కృష్ణశర్మ**

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీలో చిన్నపాటి వర్షానికి కరెంటు పోతుందని, వర్షం పోయిన రెండు గంటల వరకు విద్యుత్ అధికారు లకు ఫిర్యాదు చేసిన, వెంటనే చర్యలు తీసుకునుటలేదని, రాజీవ్ నగర్ కాలనీ అధ్యక్షుడు, తెలంగాణ స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణ శర్మ ఆవేదన వెలిబుచ్చారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం మొదలైన అప్పటినుంచి రెండు రోజులకు ఒకసారి చిన్నపాటి వర్షం రాగానే కరెంటు పోతుందని, వెంటనే కాలనీ అధ్యక్షుడిగా తానే స్వయంగా విద్యుత్ అధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసి, స్వయంగా ఫోన్ చేసి చెప్పినప్పటికీ వర్షం పోయిన రెండు గంటల వరకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించుటలేదన్నారు. కరెంటు లేక సంపులోని వాటర్‌ను పైన ఉన్న ట్యాంకుకు పంపలేకపోతున్నామని, తమ కాలనీలోని అపార్ట్మెంట్ వాసులు అందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలం వచ్చినప్పుడు వర్షం పోయిన వెంటనే కరెంటు పునరుద్ధరించాలని, కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నామన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
మంగళవారం | జులై 02, 2024 | www.navatelangana.com

జలమండలిలో 51 మంది పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 51 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరిలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 గా విధులు నిర్వర్తించిన అజ్మీరా కృష్ణ, ఓ అండ్ ఎం డివిజన్-7 సీజీఎం శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు డివిజన్ జనరల్ మేనేజర్ రెహమాన్ సహా పలు స్థాయుల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, ప్రాజెక్టు డైరెక్టర్ రఘు, డైరెక్టర్ ఆపరేషన్స్ - 1 విజయరావు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంతటి వారైనా జాన్తానై

- గ్రేటర్ హైదరాబాద్‌పై ప్రభుత్వం ఫోకస్
- ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు తప్పుచేసిన అధికారులపై చర్యలు
- అసెట్స్ ప్రొటెక్షన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ పేరుతో స్పెషల్ వింగ్ ఏర్పాటుకు కసరత్తు
- 3000లకు పైగా అధికారులు, సిబ్బంది



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇన్నాళ్లో లెక్కా... ఇప్పుడో లెక్కా.... ప్రభుత్వ ఆస్తులు, పార్కులు, నాలాలు, చెరువులను కబ్జా చేస్తే ఎంతటి వారిపై అయినా సరే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. బడా రియల్ఎస్టేట్ వ్యాపారులైనా, రాజకీయ నాయకులు, భూ కబ్జాదారులతోపాటు ప్రముఖులైన సరే జాన్తానై తాటి తీయ్యనున్నారు. అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌పై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఆస్తుల రక్షణతో పాటు తప్పుచేసిన అధికారులపై చర్యలకు సిద్ధమవుతోంది. అసెట్స్ ప్రొటెక్షన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ పేరుతో స్పెషల్ వింగ్ ఏర్పాటు కసరత్తు చేస్తోంది. రాబోయే రెండు నెలల్లో యాక్షన్‌ను ప్రభుత్వం మొదలు పెట్టనుందని సమాచారం.

స్పెషల్‌గా ఇండిపెండెంట్ బాడీ

హైదరాబాద్ నగరంతో పాటు, హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించింది. ప్రభుత్వ భూముల లెక్కలను తీయాలని ఇప్పటికే ఇటు జీహెచ్ఎంసీ, అటు హెచ్ఎండిఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి భూముల లెక్కలకు సంబంధించిన రిపోర్టులు ఇప్పటికే అందాయని తెలిసింది. అయితే ఇప్పటి వరకు ఉన్నటువంటి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకునే పరిస్థితి పూర్తిస్థాయిలో లేకపోవడంతో స్పెషల్‌గా ఇండిపెండెంట్ బాడీ అంటే ఏసీబీ, విజిలెన్స్ తరహా ఒక వింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఐజీ స్థాయి అధికారి...

జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్‌గా ఎస్పీ స్థాయి అధికారిని నియమించే వారు. కానీ తాజాగా ఐజీ స్థాయి అధికారిని నియమించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం, ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు దుర్వినియోగం కాకుండా చూడటానికి ప్రత్యేక వింగ్ ఏర్పాటుకు సన్నహాలు చేస్తోంది. ఈ వింగ్ ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తులు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడటం, ఇప్పటివరకు కబ్జాలకు గురైన చెరువులు, భూములు ఆక్రమణ, అక్రమంగా నిర్మించిన బడా భవనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఆక్రమణ భూములని తేలితే చర్యలతోపాటు వాటిని స్వాధీనం చేసుకోవడం లాంటి అంశాలను దష్టిలో పెట్టుకొని, ఐజి స్థాయి అధికారిగా ఐపీఎస్ ఏవీ రంగనాథ్‌ను నియమించింది. ఇక ఇప్పటివరకు జరిగిన తప్పులల్లో అధికారుల పాత్రను కూడా తేల్చేందుకు ఈ ప్రత్యేకమైన వింగ్‌కు ప్రత్యేక అధికారాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది.

స్పెషల్ వింగ్‌లో... ఈవీడీఏం విలీనం!

అసెట్స్ ప్రొటెక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అనే పేరుతో లేదా చిన్న చిన్న మార్పులు చేసి మరొక పేరుతో రాబోయే రోజుల్లో స్పెషల్ వింగ్ ఏర్పాటు కానుంది. ఈ వింగ్‌లో ఇప్పటికే ఉన్న జీహెచ్ఎంసీ ఈవీడియంను ప్రభుత్వం విలీనం చేయనుందని తెలిసింది. దానితోపాటు ఇప్పటివరకు జీహెచ్ఎంసీ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ జీహెచ్ఎంసీ పరిధి వరకే ఉంది. అయితే ఈ స్పెషల్ వింగ్ ఏర్పాటు తర్వాత జీహెచ్ఎంసీ పరిధి, అవతల నాలుగు కిలోమీటర్ల మేరకు ఉండనున్నాయి. అయితే ఇప్పటివరకు కబ్జాలు భూ ఆక్రమణలు, అధికారుల తప్పిదాలు, తేల్చాలంటే ఇప్పుడున్న మ్యాన్ పవర్ సరిపోదని ఐజీ స్థాయి అధికారి ఈ వింగ్‌కు ఏర్పాటు చేయాలనే సర్కార్ నిర్ణయంతో ఐజీ రంగనాథ్‌ను నియమించారు. ఈ స్పెషల్ టీంలో ముగ్గురు ఏస్పీ స్థాయి అధికారులు, 8 మంది డీఎస్పీ స్థాయి అధికారులు, మరికొంత మంది సీఐలు, డిప్యూటీ కలెక్టర్ల హెూదాలో ఉన్న మరికొంత మంది అధికారులు, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, ఫైర్ సిబ్బంది, మొత్తంగా దాదాపు 3,000లకుపైగా సిబ్బందిని ప్రభుత్వం ఈ స్పెషల్ అసెట్స్ ప్రొటెక్షన్ వింగ్‌కు కేటాయించ నుంది.

అవసరమైతే అధికారులు, భూ కబ్జాదారులపై కేసులు

ఇప్పటి వరకు జరిగిన ప్రభుత్వ భూ కబ్జా భూములను వెనక్కి తీసుకోవడంతో పాటు, కబ్జాకు సహకరించిన అధికారులపై కొరడా ఝులిపించేందుకు సిద్ధం అవుతోంది. అవసరమైతే వారిపై కేసులు పెట్టేందుకు ఈ వింగ్‌కు పూర్తి అధికారాలను ఇవ్వనుంది. మరి రాబోయే రెండు నెలల్లో గ్రేటర్ నిర్ణయాలపై సర్కార్ యాక్షన్ ప్లాన్ మొదలవుతుందా లేదా చూడాల్సిందే.

నిమ్స్‌లో అందుబాటులోకి వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జనరల్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ నవల్ చంద్ర, డైరెక్టర్ నగరి బీరప్పతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ క్లినిక్ ద్వారా అంటు వ్యాధులను నివారించడంలో ఇమ్యునైజేషన్ ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరికీ అవసరమైన టీకాలను అందించేందుకు వీలు కలుగుతుంది. రోగనిరోధక వ్యవస్థ మార్పులు, అనారోగ్యం బారిన పడిన వారికి ఉపశమనం కల్పించేందుకు ఈ టీకాలను వినియోగించుకోవచ్చు. దీర్ఘకాలికంగా రోగాలతో పోరాడుతున్న వారు వ్యాధులు నయం కాకపోవడంతో ఏటా 25 లక్షలకు పైగా మత్యువాత పడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. ఈ క్లినిక్ సాయంతో వేగంగా అంటు వ్యాధులను గుర్తించి టీకా సాయంతో పూర్తిగా నయం చేయడంతోపాటు ఆరోగ్య రక్షణ కోసం సూచనలు చేసేందుకు అవకాశం ఉంటుంది. వయోజన వ్యాక్సినేషన్ క్లినిక్ సేవలు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే ఉంటుంది. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, డీన్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ శాంతి వీరు, జనరల్ మెడిసిన్ సీనియర్ ప్రొఫెసర్ సత్యనారాయణ రాజు, డాక్టర్ సుబ్బలక్ష్మి.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం : డీఈఓ రోహిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డ్స్-2024గాను ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల నుంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుందని, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్(హెచ్‌టీటీపీ: //నేషనల్‌అవార్డ్స్‌టుటీచర్స్.ఎడ్యూకేషన్.గొ.ఇన్) ద్వారా పంపించాలని ఆమె కోరారు.



''డ్రగ్స్ నిర్మూలిద్దాం- సమాజాన మేలుకొలుపుదాం'' అంటూ జూలై ఒకటి నుండి 31 వరకు ప్రభుత్వ హై స్కూల్స్, జూనియర్, డిగ్రీ ,ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రజానాట్యమండలి నిర్వహించనున్న ఎగ్జిబిషన్ కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హైదరాబాద్ జిల్లా విద్యాధికారి డీఈఓ ఆర్ రోహిణి. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కార్యదర్శులు ఎన్ మారన్న , టి రఘు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

విశేషంగా ఆకట్టుకున్న నృత్య తరంగిణి చిన్నారి అనికారావు నాట్యం





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని శిల్పకళా వేదికలో జరిగిన నృత్యతరంగిణి చిన్నారి అనికారావు సొదరి కూచిపూడి అరంగేట్రం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ నృత్య గురువులు రాజా-రాధారెడ్డి, కౌసల్యా రెడ్డి, యామినీ రెడ్డి మార్గనిర్దేశంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనికారావు సౌందరి అలరించింది. సంప్రదాయ, సృజనాత్మక నృత్యాల అపురూప సంకలనమైన కూచిపూడి దర్పణాన్ని ఆహ్లాదకర వాతావరణంలో ప్రదర్శించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో వినసొంపైన సంగీతానికి కనువిందు చేసే రీతిలో నృత్యప్రదర్శనతో కళాప్రియులను మంత్రముగ్దుల్ని చేసింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు, రాజకీయ ప్రముఖులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'పౌరాణిక నాటకాల పరిరక్షణలో అయ్యదేవర విశేష కృషి'



నవతెలంగాణ-కల్చరల్

ఆధునిక కాలంలో అయ్యదేవర పురుషోత్తమ రావు పౌరాణిక నాటకాల పరిరక్షణలో విశేష కృషి చేసిన మహనీయుడు అని ప్రముఖులు పేర్కొన్నారు. అలకా పురిలోని శృంగేరి శంకర మఠం ప్రాంగణంలో అయ్యదేవర పురుషోత్తమ రావు 92 వ జయంతి సభ జరిగిం. ప్రముఖులు మారమ రాజు, సామ శ్యామ్ ప్రసాద్, నీల కంఠెశ్వర రావు, ఎం.ఎస్.ఎస్.హరీష్ లు మాట్లాడుతూ పురుషోత్తమ రావు నటుడుగా దర్శకుడుగా రచయితగా ప్రసిద్ధుడు అన్నారు. ఆయన నాటక శిక్షణలో ఎందరో నటులు రూపొందారని అన్నారు. అయ్యదేవర పురుషోత్తమ రావు కుమార్తె బసవరాజు విజయ లక్ష్మి, మనువడు కిరణ్‌తో పాటు మాధవ స్వామి ఎర్ర స్వామి తదితరులు పాల్గొన్నారు అనంతరం తిరుపతి వెంకట కవులు రచించిన పాండవో ద్యోగ విజయాలు లోని శయన దృశ్యంను పెద్ద వెంకటయ్య,నారాయణ స్వామి, అచ్యుత శివ రామ్ ప్రసాద్ ప్రదర్శించగా మల్లాది రమణ పర్యవేక్షణ చేశారు

హైదరాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఘనంగా డాక్టర్స్ డే



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ జిల్లా ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన, గైనిక్ హెచ్ఓడి డాక్టర్ జలజ, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ సంతోష్ బాబు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ ఆంజనేయులు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్ లంక, న్యూ కమలా నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాదయాత్రలో భాగంగా స్థానికులు బస్తీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేషంట్ సంరక్షణకు ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్



● మెడి9 హెల్త్ సైన్సెస్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పేషంట్ సమగ్ర సంరక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ ఎంతో ఉపయోగపడుతుందని మెడి9 హెల్త్ సైన్సెస్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మెడి9 ఇంటిగ్రేటెడ్ మెడికల్ సిస్టమ్స్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూక్తిని ప్రేరణగా తీసుకుని ఇంటిగ్రేటెడ్ మెడికల్ సిస్టమ్స్ ను సమీకృతీకరించి మెడి9 హెల్త్ సైన్సెస్ సంస్థ హెరీమియోపతి, ఆయుర్వేద, పేషెంట్ సమగ్ర సంరక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ మంచి అవకాశాలను అందిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ఆయుష్ మంత్రి త్వశాఖ, మానవ క్లినికల్ ట్రయల్స్ నిర్వ హించడానికి ఐసీఎంఆర్ భాగస్వామిగా ప్రాముఖ్య తను సంతరించుకుందన్నారు. ఆయుర్వేదం, హెరీమియోపతి, నేచురోపతి ఆక్యుపంక్చర్, అక్యూ ప్రెషర్ సిద్ధ యోగా, హెర్బల్, కిరోప్రాక్టిక్ వంటి ప్రత్యామ్నాయ లేదా సాంప్రదాయ పద్ధతులతో 'పాశ్చాత్య' వైద్యాన్ని మిళితం చేస్తుందన్నారు. గత 30 ఏండ్లకు పైగా అనుభవం నిపుణ త, పరిశీలన కలిగిన డాక్టర్స్ బృందం వ్యాధి కారకాలను తెలుసుకుని వ్యాధి మూలాలకు చికిత్స చేస్తారన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ చికిత్సలో మెడిసిన్, ఎక్సర్ సైజ్, డైట్, ఇమ్యూ నీటీ బూస్టర్స్ ద్వారా చికిత్సను అందిస్తారని ఆయన తెలి పారు. తక్కువ ఖర్చుతో నొప్పి లేకుండా వ్యాధి మూలాలకు చికిత్స చేయడమే మెడి 9 ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో డా.వరలక్ష్మి, డా. విజయలక్ష్మి, డా.రమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కె.అనిల్ కుమార్ ఎన్నిక'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ ఫోటో జర్నలిస్టు కె.అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన కె.అనిల్ కుమార్ ను సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ క్లబ్ పాత్రికేయ బృందం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో అనిల్ కుమార్ యూనియన్‌లో మరిన్ని కీలక పదవులు అలంకరించాలని పాత్రికేయ బృందం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు దేశపాక స్వామి, పుండరీ చారి, సీనియర్ జర్నలిస్టులు పాండు రంగారావు, తెలుకంటి వేణుగోపాల్, తెలుకంటి గణేష్, టి.వెంకటేష్, రామినేని దేవేంద్రప్రసాద్, వక్కల వెంకటేష్, రాంబాబు, సత్యం, ఉపేంద్ర, గిరిబాబు, దయాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో లోక్ దళ్ పార్టీని బలోపేతం చేస్తాం'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలో భారత జాతీయ లోక్ దళ్ పార్టీని బలోపేతం చేస్తామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు తెలిపారు. పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకుల ముఖ్య సమావేశంలో పార్టీ కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుర్ర రామన్న, ఆది చంద్రమౌళి, షేక్ అస్లాం షరీఫ్, సతీష్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా విప్లవదత్ శుక్లా, గోవర్ధన్ ముదిరాజ్, మెదక్ జిల్లా అధ్యక్షుడిగా విజయ్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి సూర్యచందర్ లను ఆయన నియమించారు.

పేద రోగులకు వైద్యులు నిస్వార్థంగా సేవలు అందించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పేద రోగులకు వైద్యులు నిస్వార్థంగా సేవలందించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు డాక్టర్స్ డే జరుపుకుంటున్నామని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం కోఠిలోని ఐఎంఎ ఆడిటోరియంలో డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలోని ప్రముఖులను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడు తూ.. వైద్యరంగంలో మార్పులు తీసుకువచ్చిన బీసీ రాయ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ డాక్టర్స్ డే సెలబ్రేషన్స్ ప్రతి ఏడాది ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించు కుంటున్నామని ఆయన తెలిపారు. వెస్ట్ బెంగాల్ రెండో చీఫ్ మినిస్టర్‌గా బీసీ రాయ్ వైద్యరంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారన్నారు. పేద రోగుల పాలిట ఆయన చేసిన సేవలను కొనియాడారు. డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. వైద్యులు రోగుల పట్ల ఎంతో నిస్వార్థంగా వ్యవహరిస్తారని రోగి ఆరోగ్యమే వైద్యులకు ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ బ్రాంచ్ అధ్యక్షులు టివి శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ మీనాజ్ జాఫర్ నసీర్ , కోశాధికారి డాక్టర్ ఎస్ విజయ్ కుమార్, ఫాస్ట్ ప్రెసిడెంట్లు డాక్టర్ దయ్యాల్ సింగ్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి



● ప్రముఖ ప్రముఖ డయాబెటిస్ డాక్టర్ స్వాతి

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని చిన్నపాటి సమస్యలు వచ్చిన వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని ప్రముఖ డయాబెటిక్ డాక్టర్ స్వాతి సూచించారు. జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించు ముషీరాబాద్‌లోని అమ్వి క్లినిక్‌లో ఆరోగ్యంపై అవగాహన కలిగించేందుకు నిర్వహించిన సదస్సుకు ఆస్పత్రి ఎండి సందీప్ అధ్యక్షత వహించగా వివిధ ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ.. డాక్టర్ల సలహాలు లేకుండా మెడికల్ షాప్‌లో ఇచ్చే మందులు వాడొద్దని సూచించారు. వ్యాధులపై అవగాహన లేని డాక్టర్ల వద్దకు వెళ్లి ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లకు సందీప్ శాలువాలు కప్పి మెమొంటోళ్లు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకియార్జిస్ట్ డాక్టర్లు అందే సౌమ్య, ప్రముఖ డెంటల్ సర్జన్ డాక్టర్ ఎస్. సౌమ్య, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పూజ సాహూ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత విశ్వనాథంకు విప్లవ జోహార్లు

● ఆయన ఆకస్మిక మరణం తీరని లోటు
● ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ



నవతెలంగాణ-ముషీరాబాద్

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఎల్.విశ్వనాథం ఆకస్మిక మరణం కార్మిక లోకానికి తీరనిలోటని ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనురాధ అన్నారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ.. ఎల్.విశ్వనాథం సిద్దిపేటలో అనారోగ్యంతో మరణించారనే వార్త షాక్‌కు గురి చేసిందన్నారు. ఆలేరులో గత రెండు రోజులు రాజకీయ శిక్షణ తరగతుల్లో కలిసి కలిసి మాట్లాడుకున్నామని తెలిపారు. ఇల్లందు మండలం రోంపేడులో జన్మించిన కామ్రేడ్ లంజపల్లి విశ్వనాథం యుక్త వయస్సు నుండి ప్రతిఘటన పోరాట దళాలకు ఆకర్షితుడై అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. ఇల్లందు ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. కొత్తగూడెంలో గత 25 ఏండ్లుగా సింగరేణి బొగ్గు గని కార్మికులు, మోటార్ కార్మికులు, హమాలీ కార్మికులు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎంతో చురుకుగా పాల్గొన్నారన్నారు. కొత్తగూడెంలో గుర్తింపు పొందిన కార్మిక నేతగా ఎదిగిన కామ్రేడ్ విశ్వనాథం ఆకస్మిక మరణం విప్లవ కార్మిక ఉద్యమానికి తీరని నష్టకరమైందని, ఆయన మృతికి విప్లవ జోహార్లు అర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా





నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ ప్రభుత్వం ఎన్నికల తర్వాత తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని ఎంసీపీఐ(యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం దేశవ్యాప్త ధర్నాలో భాగంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేసింది. అనంతరం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్ల పాలనలో అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించడమే కాకుండా కార్మిక, రైతాంగ, ఆదివాసీ, గిరిజన వ్యతిరేక చట్టాలను తెచ్చిందని విమర్శించారు. నేటి నుంచి నూతన క్రిమినల్ చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని.. చెప్పి ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఆదివాసీ, గిరిజనులకు వ్యతిరేకంగా వారి సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు నూతన గిరిజన చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఉపా, రాజద్రోహం చట్టాల కన్నా భారత న్యాయ సహిత సెక్షన్ 113 సామాన్య ప్రజల పట్ల అతి ప్రమాదకరమైనదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ తప్పుడు విధానాలపైన ప్రశ్నించే వారిని మేధావులను, ఉద్యమకారులను సాధారణ ప్రజానీకాని ఎలాంటి కారణాలు లేకుండా వారి అధికార బలంతో జైల్లో పెడుతుందన్నారు. భారత రాష్ట్రపతి ద్వారా ఎంసీపీఐ(యూ) డిమాండ్లను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక అలాగే నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గాద మల్లేష్, పి. భాగ్యమ్మ, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఈ. దశరథ్ నాయక్, కమిటీ సభ్యులు బి.యాదగిరి, జి.లావణ్య, డి.నరసింహ, డి.లలిత, ఎం. రాణి, బి.పార్వతి, డి.శ్రీనివాసులు, బి.శంకర్, పి.విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఫిట్‌నెస్ సర్వీస్ ప్రొవైడర్లలో జస్ట్ డయల్ 50 శాతం వృద్ధి'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

జస్ట్ డయల్ భారతదేశం నెంబర్ వన్ హైపర్ లోకల్ బిజినెస్ సెర్చ్ ఇంజన్, కరోనా మహమ్మారి ముందు నుండి పోస్ట్-పాండమిక్ యుగం వరకు ఫిట్ నెస్ సెంటర్ జాబితాలో 50 శాతం గణనీయమైన వృద్ధిని సాధించినట్లు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నేటి వేగవంతమైన ప్రపంచంలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం గతంలో కంటే చాలా ముఖ్యమైనదిగా మారింది. ప్రజలు ఫిట్‌గా యాక్టివ్‌గా ఉండటానికి మార్గాలను ఎక్కువగా అన్వేషిస్తున్నారు. ఫిట్‌నెస్ సర్వీస్ ప్రొవైడర్లు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఎలా అవలంబిస్తున్నారనే దానిపై ఈ ధోరణి ప్రతిబింబిస్తుంది. మెట్రో నగరాలతో పోలిస్తే నాన్-మెట్రో నగరాల్లో వృద్ధి వరుసగా 78 శాతంగా ఉంది. తక్కువగా ఉన్న ఈ మార్కెట్లలో ఫిట్‌నెస్ ఎంపికలపై పెరుగుతున్న దృష్టిని సూచిస్తుంది. సాధారణ మెంబర్‌షిప్‌లకు దూరంగా, ప్రత్యేక ఫిట్‌నెస్ సెంటర్‌ల వైపు వెళ్లడంతో జిమ్ ఆఫర్‌లలో స్పష్టమైన మార్పును డేటా వెల్లడిస్తుంది. కాలిస్టెనిక్స్ జిమ్‌లు, కార్డియో ఫిట్‌నెస్ సెంటర్‌లు, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ సెంటర్‌లు, క్రాస్‌ఫిట్ జిమ్‌ల జాబితాలు వరుసగా 95 శాతం నుంచి 105 శాతం వృద్ధిని సాధించాయి. హైదరాబాద్ జనాభాతో పోలిస్తే ఆశ్చర్యకరంగా అధిక సంఖ్యలో ఫిట్‌నెస్ కేంద్రాలతో నిలుస్తుంది. కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాలు ఎంపికల పెరుగుదలను చూస్తున్నాయి. దేశవ్యాప్తంగా అభి వృద్ధి చెందుతున్న ఫిట్‌నెస్ సంస్కృతిని సూచిస్తుందని తెలిపింది.



సుల్తాన్ బజార్ ఏఎస్ఐ సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా ఆయనను పూలమాల,శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న ఇన్ స్పెక్టర్ శ్రీనివాసచారి, ఎస్ఐ మధుసూదన్, పోలీసులు తదితరులు నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

'ఉగాది కీర్తిరత్న పురస్కారం అందుకున్న దంపతులు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ (ఎఫ్ఎన్ సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ మలేషియా ఉగాది కీర్తిరత్న పురస్కారాలు-2024' ఉత్సవాల్లో భాగంగా సోమవారం మలేషియా తెలుగు అకాడమీ సుందర ప్రాంగణంలో ప్రముఖ సామాజిక సేవకులు, తెలంగాణ పెరిక కుల సంఘం, పెరిక కుల వధూవరుల పరిచయ వేదిక కన్వీనర్ సుంకరి ఆనంద్, ఆయన భార్య పద్మలకు "ఉగాది కీర్తిరత్న" పురస్కారం అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా (టీఏఎం) అధ్యక్షులు డా.వెంకట ప్రతాప్ మాట్లాడుతూ అనాథలైన మానసిక వికలాంగులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి వారికి మరో జన్మనిస్తున్న సుంకరి ఆనంద్ దంపతుల సేవలను కొనియాడారు. దాతల సహకారంతో అనాధ పిల్లలకు అండగా ఉంటూ, పెద్దల సహకారంతో విరామం లేకుండా నిరంతర ఉచిత వధూవరుల వేదికలు నిర్వహిస్తూ పెళ్లిడు కొచ్చిన వేలాది మంది పిల్లల అభిలాషకు అనువైన సంబంధాలను పరిచయం చేయడం అభినందనీయమన్నారు. తెలుగు వారిపై ఉన్న మమకారంతో వ్యయ ప్రయాసలకోర్చి ఇంత దూరం వచ్చి ఇంతా మంది తెలుగు వారి అభిమానాన్ని చూరగొన్న సుంకరి ఆనంద్‌కు వేదిక సంపూర్ణ అభినందనలు అందిస్తుందని ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ అంతర్జాతీయ అధ్యక్షులు డా.ఎంజెఆర్ వంప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీఏఎం పూర్వ అధ్యక్షులు డా.అశోక్ కుమార్ రావు, మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బూరెడ్డి మోహన్ రెడ్డి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కౌసల్య జువెల్ పాల్గొని వారిని అభినందించారు.

యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య అన్నారు. సోమవారం అశోక్ నగర్‌లోని నాగార్జున స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు కొత్త చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ యువత సైబర్ నేరాలకు గురవకొండ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి మత్తు పదాలకు బానిసలు కాకుండా వాటి నివారణకు తోడ్పడాలని కోరారు. నూతన చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యత గల పౌరులుగా ఉండాలని సూచించారు.

హైదరాబాద్ జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు లిమిటెడ్ 3వ అంతస్తులో ఉద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సైదాబాద్‌కు చెందిన నాలుగోవ తరగతి ఉద్యోగి ఓంకార్ చైర్మెన్ బాత్‌రూమ్‌లోని కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రామానుజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజ్ భవన్‌లో నిర్వహించిన డాక్టర్స్ డే సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌కు షీల్డ్ అందించి శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తదితరులు

ఉస్మానియా ఆస్పత్రిలో ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, సీఎస్ ఆర్ఎంఓ, ఇతర ఆర్ఎంఓలు, నర్సింగ్ సిబ్బంది ఓజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన వృత్తి దైవంతో సమానమని, ఇది మనకు వరమన్నారు. ఆ దిశగా ఏ భేదం లేకుండా సేవలందించాలని సూచించారు. వైద్యులందరినీ ఆయన అభినందించారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు..

● జోనల్ కమిషనర్ టీ. వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కి ఫూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్రమ నిర్మాణంపై 1, ఆస్తి పన్ను సమస్యలపై 2, మొత్తం 03 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలన్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, డీప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) అమీనా బీ, డీప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యాం కుమార్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

● గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళలు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కేంద్రాన్ని సద్విని యోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ , నీవి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కేంద్రం గాంధీనగర్ డివిజన్, వివి గిరి నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ లయన్స్ క్లబ్ 1స్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంపా నాగేశ్వర్ రావు, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరే టర్ మాట్లాడుతూ.. మహిళలు ఉచిత మగ్గం కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత శిక్షణ కేంద్రాలలో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా పలు రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మరిన్ని వృత్తులపై త్వరలో మహిళలకు ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గంపా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెడుతున్నారని వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరచడానికి ఉచిత శిక్షణ కేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. మగ్గం వర్క్‌తో పాటు త్వరలో బ్యూటీషన్, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కార్పొరేటర్‌తో చర్చలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ జీవీఎస్ రామయ్య నాయుడు, జోన్ చైర్ పర్సన్ మొర్రం సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షులు సెరిపల్లి గణేష్, కార్యదర్శి ఎన్. చంద్రమోహన్, కోశాధికారి ఎంఎస్ ప్రకాష్, ప్రాజెక్టు చైర్మెన్ ముస్త్యాల కమలాకర్, కాశం శ్రీనివాస్, మధు క్లబ్ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు విజయలక్ష్మి, శ్రీకాంత్, ఉమేష్, ఆకుల సురేందర్, ఆనంద్ రావు, గ్యనేష్, పాల్గొన్నారు

'బృందావన్ ఏంజిల్..'

ఉత్తరప్రదేశ్.. మధురైలోని బృందావన్ దేవాలయాల నగరంగా ప్రసిద్ధి చెందింది. బృందావన్‌లోని యమునా నదిలో స్నానాలు చేసేందుకు వేలాది మంది భక్తులు వస్తూ ఉంటారు. అక్కడకు వచ్చిన వారిలో వితంతువులూ ఉంటారు. అందరూ తిరిగి వెళతారు. కానీ వితంతువుల్లో కొందరు అక్కడే ఉండిపోతారు. అలాంటి వారికి సంవత్సరాలుగా సేవలందిస్తున్న డాక్టర్ **లక్ష్మీ విజయ్ గౌతమ్**ను బృందావన్ ఏంజిల్‌గా అక్కడి ప్రజలు ఆప్యాయంగా పిలుచుకుంటున్నారు. వితంతువులు, అనాథలకు తోచిన సహాయం అందించాలన్న తపనకు బీజం ఆమె చిన్నతనంలోనే పడింది. 2013లో ప్రారంభించిన తన ఎన్జీవో 'కనక ధార' ద్వారా వారికి ఆపన్నహస్తం అందిస్తున్న ఆమె జీవిత ప్రస్థానం నేటి మానవిలో..



ఎనిమిదేండ్లకే భర్తను కోల్పోయానని, అప్పటి నుంచి ఈ బాధల జీవితంలోకి నెట్టబడ్డానని ఓ వితంతువు చెప్పిన చిన్ననాటి జ్ఞాపకం డాక్టర్ లక్ష్మి గౌతమ్ మనసులో చెరగని ముద్ర వేసింది. అప్పుడు లక్ష్మికి 10 ఏండ్లు. ఆమె తండ్రి గ్రామంలో ప్రఖ్యాత పండితుడు. ఆధ్యాత్మిక మార్గనిర్దేశం కోసం తన తండ్రి వద్దకు వచ్చిన ఇద్దరు స్త్రీల రూపాన్ని ఆమె గమనించింది.

ఇద్దరు స్త్రీల కథ

'వారిద్దరూ ఇప్పటికీ నా కండ్లలో మెదులుతారు. వారు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చారు – ఒకరు ఎర్ర అంచున్న తెల్లటి బెంగాలీ చీరను ధరించి, తలపై కుంకుమ, చేతులకు గాజులతో ఉన్నారు. మరొకరు గుండు, మాసిపోయిన బట్టలు, బొట్టులేదు, గాజులూ లేవు. ఇద్దరిలో ఈ వ్యత్యాసం ఏమిటో అప్పుడు నాకు అర్థం కాలేదు. ఈ విధంగా ఎందుకు అని నేను ఆశ్చర్యపోయాను..' అంటుంది లక్ష్మి. అదే ప్రశ్న తండ్రిని అడిగింది. 'నువ్వు చిన్న పిల్లవు. ఇలాంటివి నీకు ఇప్పుడే అర్థం కావులే...' అన్న తండ్రి సమాధానం తెలుసుకోవాలన్న ఆసక్తిని మరింత పెంచింది. కారణాన్ని స్వయంగా తెలుసుకోవాలనుకుంది.

అప్పుడే నిర్ణయించుకుంది...

ప్రతి సంవత్సరం తమ ఇంటికి వచ్చే దూరపు కుటుంబ స్నేహితుల్లో ఒకరిని గమనించింది. ఆమె కూడా అంతే... గుండుతో, తెల్ల చీర కట్టుకొని ఉండటాన్ని చూసింది. ధైర్యాన్ని కూడగట్టుకుని.. ఆమెను అడిగింది. తొమ్మిదేండ్ల వయసులో ఆమె కంటే చాలా ఎక్కువ వయసున్న వ్యక్తితో పెళ్లయింది. భర్త మరణించటంతో ఆమె జీవితం మసకబారింది. 'ఆ రోజు నుంచి, నాకు గుండు చేయిస్తున్నారు. ఆడుకోవడానికి కూడా బయటకు అనుమతించరు. పాత బియ్యంతో ప్రత్యేకంగా అన్నం వండుకోవాలి. బెంగాలీ ఆహారంలో ముఖ్యమైనది.. నేను చాలా ఇష్టంగా తినే చేపలను కూడా తిననివ్వరు' అని ఆమె లక్ష్మికి చెప్పింది. భర్తలను కోల్పోయిన మహిళలు ఇంత దుర్భరమైన జీవితంలోకి ఎందుకు నెట్టబడుతున్నారో అర్థంకాలేదు. ఇలాంటి ఆచారాన్ని ధిక్కరించాలని అప్పుడే నిర్ణయించుకుంది.



'వితంతువుల నగరం'గా..

పశ్చిమ బెంగాల్ సహా దేశంలో బాల్య వివాహాలు చాలా ఎక్కువ. వయసు రీత్యా ఏ కారణంతోనైనా భర్త చనిపోతే.. వీరు వితంతువులుగా మిగిలిపోతున్నారు. అవమానాలు భరించలేక.. ఇంటి నుంచి వారు వచ్చేస్తున్నారు. బృందావన్‌లో కొన్ని ఆశ్రమాలు వితంతువులకు ఆశ్రయం ఇస్తున్నాయి.

వెలుగులోకి ఇలా...

వితంతువులకు నిజంగా ఇక్కడ మెరుగైన జీవితం ఉందా? వాస్తవం మరోలా వుంది. 2011లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు దర్శనం కోసం బృందావనం వచ్చారు. అక్కడ వితంతువులు పడుతున్న అవస్థలను ఆయన వెలుగులోకి తెచ్చారు. పవిత్ర నది ఒడ్డున అనాథలుగా చనిపోతున్న వితంతువులు అంటూ మీడియాలో కథనాలూ వచ్చాయి. వారికి న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ క్రమంలో, పట్టణాన్ని సర్వే చేసి, వితంతువుల కష్టాలపై అవగాహనకు ఏడుగురు సభ్యుల ప్యానెల్‌ను నియమించింది. ఆ కమిటీలో డాక్టర్ లక్ష్మి కూడా ఒకరు. ఈ కమిటీలో భాగం కావడం ద్వారా వితంతువుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను లోతుగా తెలుసుకుంది. అలాగే వారి సామాజిక–ఆర్థిక స్థితిని అర్థం చేసుకోవడానికి కొన్ని ప్రశ్నలు రూపొందించారు. అందులో వారి అంత్యక్రియలు నిర్వహణపైనా ప్రశ్న ఉంది. ఆ ప్రశ్నకు హృదయ విదారక సమాధానాలు వచ్చాయి. వారి అంతిమ సంస్కారాలను ఎవరూ పట్టించుకోకపోవడం ఆమెను ఆవేదనకు గురిచేసింది. 'మృతదేహాలను క్లెయిమ్ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోతే.. వాటిని ముక్కలుగా నరికి, గోనె సంచిలో వేసి.. పారేస్తారు...' సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.

అమలు అంతంత మాత్రమే

'ఇది దిగ్భ్రాంతికరమైనది. షెల్టర్ హోమ్‌లలో మరణించిన మహిళలకు వారి మతాచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలి' అని మధురలోని సివిల్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను 2012లో సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా.. అమలు అంతంత మాత్రమే.. బృందావనంలో ఏ ఒక్క వితంతువు కూడా దయనీయస్థితిలో చనిపోకూడదు. అత్యంత దారుణంగా వారి అంత్యక్రియలు జరగకూడదని డాక్టర్ లక్ష్మి తనకు తాను వాగ్దానం చేసుకున్నది. వారి కర్మకాండలు గౌరవప్రదంగా చేయాలనే ఉద్దేశంతో 'కనకధార' అనే ఎన్జీఓను ప్రారంభించింది. 'కనకధార' అనేది ఆమె అత్తయ్య పేరు. తను స్థాపించిన ఈ ఎన్జీఓ ద్వారా వితంతువులకు ఆసరాగా నిలుస్తున్నది. ఇటు ఎన్జీఓ పనులు... అటు కళాశాల ప్రొఫెసర్‌గా విధులు.. రెండిటినీ సమతుల్యం చేయడం అంత సులభం కాదు, కానీ డాక్టర్ లక్ష్మి దానిని సజావుగా నిర్వహిస్తున్నది. కనక ధార ద్వారా అనేక కార్యకలాపాలు జరుగుతాయి.

వితంతువులకు అంత్యక్రియలు

ఇప్పటి వరకు, డాక్టర్ లక్ష్మి దాదాపు వెయ్యి మందికి పైగా వితంతువులకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని అంబులెన్స్ ఎక్కించటం నుంచి... చివరి వరకూ... ప్రతిదీ ఆమె చూసుకుంటుంది. సాధువులు, కుటుంబాలు ముందుకు రావడానికి నిరాకరించిన నిరుపేదలకు కూడా తన వంతు సహాయం చేస్తున్నది. కరోనా మహమ్మారి తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు. 72 రోజుల పాటు మధురలో వందలాది మంది అనాథలకు వండి వడ్డించింది. యువతులు పారిపోవటం, కిడ్నాప్‌కు గురికావటం వంటి కేసుల్లోనూ కనక ధార సహాయం చేస్తుంది. "మేం వారి అడ్రస్ గుర్తించడానికి ప్రయత్నిస్తాం, పోలీసులకు ఈ విషయాన్ని తెలియజేస్తాం. ఈ విధంగా వందలాది మంది అమ్మాయిలకు సహాయం చేసాం" అని ఆమె చెప్పింది. ఫుడ్ డ్రైవ్‌లు, మెడికల్ క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాల ద్వారా డాక్టర్ లక్ష్మి బృందావన్‌లోని నిరుపేదలకు మెరుగైన జీవితాన్ని అందిస్తున్నారు.





కరోనా సమయంలోనూ..

అత్యంత క్లిష్టమైన కేసును గుర్తుచేసుకుంటూ.. అది మహమ్మారి దశ. 'ఘాట్ వద్ద పడివున్న మృతదేహానికి సంబంధించి నాకు అర్ధరాత్రి ఒంటి గంటకు కాల్ వచ్చింది. నేను అక్కడికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించాను' అని చెప్పింది లక్ష్మి. 'మీరు భయపడలేదా?' అని కొందరు నన్ను ప్రశ్నించారు. 'ప్రాణమున్న వారితోనే భయపడాలి.. మృతదేహాలు ఏం చేస్తాయి?...' అంటుంది లక్ష్మి.

సంకల్పం ఉంటే..

అత్త ప్రోత్సాహంతో పీహెచ్‌డీ పూర్తిచేసిన ఆమె లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే సామాజిక సేవలో భాగస్వామి అవుతున్నది. 'నేను ఒకసారి ఇన్విజిలేషన్ డ్యూటీలో ఉన్నాను. ఎవరూ తీసుకెళ్ళకుండా పడివున్న ఓ వితంతువు మృతదేహం గురించి ఫోన్ వచ్చింది. తన ఇన్విజిలేషన్ డ్యూటీకి ప్రధానోపాధ్యాయుడికి ప్రత్యామ్నాయం చూపించి వెళ్ళాను' అంటూ గుర్తుచేసుకున్నారు. నేను సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ఒక బైకర్‌ను లిఫ్ట్ అడిగాను. అంబులెన్స్ సహాయంతో మృతదేహాన్ని స్మశానవాటికకు చేర్చాం. అంత్యక్రియలు నిర్వహించాం, అంతా పూర్తయ్యే వరకూ దాదాపు మూడు గంటలు అక్కడే ఉన్నాను' అని చెప్పింది. చేయాలన్న సంకల్పం ఉంటే చాలు. ఎలాంటి ఇబ్బందులూ అడ్డురావు అంటుంది లక్ష్మి.

- కె. లలిత

ఇలా చేస్తే..

వంట చేసేప్పుడు.. కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌ, సింక్ ఎక్కువగా వాడుతుంటాం. వీటిని శుభ్రంగా



ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇవి శుభ్రంగా లేకపోతే.. వంట చేయాలనిపించదు. కిచెన్ ప్లాట్‌ఫామ్ శుభ్రంగా లేకపోతే.. బొద్దింకలు, ఈగలు కూడా ఇబ్బంది పెడుతుంటాయి. అంతేకాదు, వర్షాకాలం ఇళ్లు పరిశుభ్రంగా లేకపోతే.. రకరకాల అనారోగ్యాల ముప్పు పెరుగుతుంది. అందుకే కిచెన్ శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

వంట పూర్తైన తర్వాత..కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌను చక్కగా శుభ్రం చేసుకుంటే.. చూడటానికి అందంగా ఉంటుంది. నీళ్లలో వెనిగర్ కలిపి శుభ్రం చేస్తే.. క్రిములు మాయం అవుతాయి.

కిచెన్‌లో నూనె ఒలికిపోతే వెంటనే నూనె మీద గోధుమ పిండి చల్లాలి. ఐదు నిమిషాల తరువాత పేపర్‌తో తుడిస్తే నూనె పడిన ప్రాంతం జిడ్డులేకుండా శుభ్ర పడుతుంది.

కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై మరకలు ఉంటే.. బేకింగ్ సోడా వేసిన నీళ్లతో తుడిస్తే వెంటనే తొలగుతాయి.

కూరగాయలు తరిగిన తర్వాత వాటి చెత్త అంతా గట్టు పైన పేరుకుంటుంది. వంట అంతా అయ్యాక పడేద్దామని అలాగే పెట్టకూడదు. వాటి తేమ, మరకలు క్యాబినెట్‌ని పాడుచేస్తాయి.

వంట పూర్తైన తర్వాత.. సింక్ శుభ్రం చేసుకుంటే.. వైరస్, బ్యాక్టీరియాలు వృద్ధి చెందకుండా జాగ్రత్తపడచ్చు. అంతేకాదు సింక్‌లో మాంసాహారం కడిగిన తర్వాత దాన్ని సోప్ వాటర్‌తో శుభ్రం చేయండి. ఇలా చేస్తే.. దుర్వాసన రాకుండా ఉంటుంది.

రేపు మంత్రివర్గ విస్తరణ?

(మొదటిపేజి తరువాయి)

ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు), కురుమ సామాజిక వర్గానికి చెందిన బీర్ల ఐలయ్య (ప్రభుత్వ విప్), రజక సామాజిక వర్గానికి చెందిన వీర్లపల్లి శంకర్ (షాద్‌నగర్) ఆయా బెర్తులకు పోటీ పడుతున్నారు. మంత్రివర్గంలో ప్రస్తుతం కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఇద్దరూ బీసీలుగా ఉన్నారు. అందువల్ల మిగతా రెండు పదవులు ఎవరికి దక్కనున్నాయనేది వేచి చూడాలి. వీరితోపాటు లంబాడ సామాజిక వర్గానికి చెందిన బాలు నాయక్ (చీఫ్ విప్) కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. భవిష్యత్ రాజకీయ అవసరాల దృష్ట్యా వీరిలో ఎవరికి బెర్తు దక్కుతుందనేది చూడాలి. ఇక భువనగిరి ఎంపీ సీటును గెలిపించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి పార్టీకి విధేయుడిగా ఉన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు మాత్రం ఇప్పటికే మంత్రి పదవులు ఖాయమైనట్టు సమాచారం. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు హోం శాఖ దక్కే అవకాశాలు పుష్కలంగా కనబడుతున్నాయి. అయితే ఆమెకు ఆ రెండు శాఖలు ఇస్తారా..? లేక పంచాయతీరాజ్ తీసేసి హోం శాఖనే అప్పజెపుతారా..? అనేది సీఎం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. గత డిసెంబరులో ఖమ్మం జిల్లాతోపాటు పక్కనున్న వరంగల్‌లోనూ హస్తం పార్టీని భుజానేసుకుని గెలిపించిన మంత్రి పొంగులేటి కూడా హోం శాఖపై కన్నేసినట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా క్యాబినెట్‌లో బెర్తు కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో రేవంత్ వీరందర్నీ ఎలా సమన్వయ పరుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇక అత్యంత కీలకమైన పీసీసీ అధ్యక్ష పదవిని ఇప్పటికే బీసీలకు ఖాయం చేసినట్టు గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీగా ఉండి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్ పేరు ఆ పదవికి దాదాపు ఖరారైంది. అయితే ఇతర సామాజిక వర్గాలకు చెందిన నేతలు మాత్రం మహేశ్‌కు బదులు మాజీ ఎంపీ, సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ పేరును ప్రతిపాదిస్తున్నారు. ఈ పరిస్థితిని కూడా ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడైన రేవంత్ అధిగమించాల్సి ఉంటుంది. ఇటీవల అలకబూనిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా పీసీసీ చీఫ్ పదవి కావాలని అడుగుతున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదంటూ సీఎం, ఏఐసీసీ పెద్దలు ఆయనకు నచ్చజెప్పినట్టు వినికిడి. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవీకాలం కూడా మరో ఐదారు నెలలే ఉండటంతో అది ముగియగానే ఏదో ఒక కార్పొరేషన్‌కు అయనన్ను చైర్మెన్‌ను చేస్తారని సమాచారం.

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ..

రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, ఆ సందర్భంగా ప్రతిపాదించబోయే పలు రకాల బిల్లులు, నామినేటెడ్ ఎమ్మెల్సీల భర్తీ, మంత్రివర్గ విస్తరణ తదితరాంశాలపై వారిరువురూ చర్చించినట్టు తెలిసింది. సీఎం వెంట ఆయన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

సీఎంతో యంగోన్ కార్పొరేషన్ సీఈవో భేటి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో యంగోన్ కార్పొరేషన్ సీఈవో, చైర్మెన్ కిహాక్ సంగ్ బృందం భేటీ అయింది. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా పాల్గొన్నారు.

విభజన హామీలను పరిష్కరించుకుందాం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన విభజన హామీల పరిష్కారానికి కలిసి చర్చించుకుందా మంటూ తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఈమేరకు మంగళవారం లేఖ రాశారు. విభజన జరిగి పదేండ్లు దాటినా కొన్ని అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని అభిప్రాయపడ్డారు. ఈనెల 6న(వచ్చే శనివారం మధ్యాహ్నం) మీ ప్రాంతంలోనే ముఖాముఖిలో కలిసి చర్చించుకుందా మని ప్రతిపాదించారు. పరస్పర సహకారం, తెలుగు ప్రజల అభ్యున్నతికి ఇది తోడ్పడుతుందని లేఖలో పేర్కొన్నారు. ఉమ్మడి అంశాలపై సామరస్యపూర్వక పరిష్కారానికి ఎదురుచూస్తున్నట్టు లేఖలో తెలియజేశారు. ఇరు రాష్ట్రాల పురోగతి, రాష్ట్రాల మధ్య సహకారం తదితర అంశాలపై రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేసేందుకు తాను ఎదురుచూస్తున్నానంటూ అభిప్రాయపడ్డారు.

రెండువారాల్లో జాబ్ క్యాలెండర్!

(మొదటిపేజి తరువాయి)

పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహిస్తున్నది. దీంతోపాటు పోలీసు నియామకాలకు సంబంధించి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, గురుకుల పోస్టులకు సంబంధించి రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐఆర్బీ), టీచర్ల నియామకాలను విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఖాళీలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్బీ), విద్యుత్తు శాఖ తమ పరిధిలోని ఖాళీల నియామకాలు చేపడుతున్నాయి. అయితే ఎక్కువ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్న టీజీపీఎస్సీ ఎంతో కీలకంగా ఉండనుంది. పదేండ్లుగా ఉద్యోగ నియామకాల ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాలతో కోర్టు సమస్యలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అడుగడుగునా అడ్డంకులతో నియామకాల ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలపై నిరుద్యోగుల్లో అసంతృప్తి నెలకొంది.

నిరుద్యోగుల్లో భరోసా కల్పించేందుకు చర్యలు

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసాగా నిలబడేందుకు పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే జాబ్ క్యాలెండర్ రూపొందిస్తున్నది. టీజీపీఎస్సీ పాత పాలకవర్గాన్ని తప్పించి కొత్త చైర్మెన్‌తోపాటు బోర్డు సభ్యులను నియమించింది. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణను కూడా కట్టుదిట్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి యూపీఎస్సీ చైర్మెన్‌తో చర్చలు జరిపిన విషయం తెలిసిందే. జాతీయ స్థాయిలో యూపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో నియామకాల్లో అడ్డంకిగా ఉన్న రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల విషయంలోనూ కోర్టు తీర్పులకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అనుసరించింది. అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే 28,942 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ప్రభుత్వం అందించింది. టీజీపీఎస్సీతోపాటు మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డు, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా వాటిని భర్తీ చేసింది. 2022 నుంచి టీజీపీఎస్సీ ఇప్పటివరకు 27 ఉద్యోగ ప్రకటనలను జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో ప్రశ్నాపత్రాల లీకేజీతో ఐదు ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించిన రాత పరీక్షలు రద్దయ్యాయి. అప్పుడు నిర్వహించిన పరీక్షల ఫలితాలు ఒక్కటి కూడా వెల్లడి కాలేదు. గత ప్రభుత్వ హయంలో వివిధ రిక్రూట్‌మెంట్ బోర్డుల పరిధిలో ప్రధాన అడ్డంకిగా మారిన కోర్టు కేసుల చిక్కుముడులన్నింటినీ ఒక్కటొక్కటిగా కొత్త ప్రభుత్వం అధిగమించింది.

త్వరలో గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలు

సుమారు మూడు లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష గత ప్రభుత్వ నిర్వాకంతో హైకోర్టు రెండు సార్లు రద్దు చేసింది. ఏకంగా సుప్రీంకోర్టులో గత ప్రభుత్వం వేసిన కేసును కొత్త ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రెండుసార్లు రద్దయిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించింది. అందుకు సంబంధించిన కీ కూడా ఇటీవలే విడుదలైంది. త్వరలోనే ఫలితాలను వెల్లడించేందుకు టీజీపీఎస్సీ సన్నాహాలు చేస్తున్నది. అక్టోబర్‌లో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల తేదీలను కూడా ప్రకటించింది. కొత్త ప్రభుత్వం నియమించిన టీజీపీఎస్సీ బోర్డు ఉద్యోగ నియామకాలను వేగవంతం చేసింది. గ్రూప్–2 పరీక్షను షెడ్యూలు ప్రకారం ఆగస్టులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. గతంలో పెండింగ్‌లో ఉన్న గ్రూప్–4 ఫలితాలను విడుదల చేసింది. ప్రస్తుతం ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. 1,540 ఏఈఈ పోస్టులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన కూడా పూర్తయింది. వ్యవసాయ, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల జాబితా కూడా విడుదలైంది. 581 వసతి గృహ సంక్షేమాధికారుల పోస్టులకు పరీక్షలు గతనెల 29తో ముగిశాయి. టెట్‌ను ప్రశాంతంగా నిర్వహించి ఫలితాలను ప్రకటించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహిస్తున్నది. 2.79 లక్షల మంది అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేశారు.

కవితకు షాక్

(మొదటిపేజి తరువాయి)

ఆరోపణలతో మార్చి 15న ఈడీ అధికారులు కవితను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 11న సీబీఐ అధికారులు విచారణ కోసం రెండు రోజులు ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. ఆ తరువాత అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ఆమె తీహార్ జైలులో ఉన్నారు. సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలని ఆమె ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. విచారించిన న్యాయస్థానం బెయిల్ నిరాకరిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈడీ, సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకుని కవిత పిటిషన్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం

(మొదటిపేజి తరువాయి)



నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. వారిరువురి మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. నాయకులు, విద్యార్థులను దొరికిన వారిని దొరికినట్టుగానే ఎత్తుకెళ్లి వ్యాన్లలో ఎక్కించి అరెస్టు చేశారు. ఈ సమయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. విద్యార్థు లను వ్యాన్లలోకి బలవంతంగా తోసేయడంతో కొందరికి గాయాలయ్యాయి. విద్యార్థులు, నాయకులపై పిడిగుద్దులు గుద్దుతూ తీసుకెళ్లి వ్యాన్లలో కుక్కారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఓ విద్యార్థి సంఘం నాయకుని పట్ల సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర అనుచితంగా ప్రవర్తించారు. వ్యాన్‌లోపలికి వెళ్లి ఆ నాయకున్ని చితకబాదడం గమనార్హం. దాన్ని గమనించిన మీడియా ప్రతినిధులు సెంట్రల్ జోన్ డీసీపీ పూర్ణచందర్‌ను ఆ విద్యార్థిని ఎందుకు కొట్టారంటూ ప్రశ్నించారు. 'ఏం జరగలేదు, ఏం కాలేదు, ఎవరూ కొట్టలేదు'అంటూ ఆయన సమాధానమిచ్చారు. 'నన్ను తీవ్రంగా కొట్టారు. గాయాలయ్యాయి'అంటూ పీడీఎస్‌యూ నాయకుడు గడ్డం శ్యామ్ మీడియాకు చెప్పారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి రామకృష్ణ, పి మహేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్ సహా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విద్యార్థి సంఘాలు నిర్వహించాయి. 'వియ్ వాంట్ జస్టిస్, నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి, ఎన్టీఏను రద్దు చేయాలి, మోడీ డౌన్... డౌన్, ప్రధాని వెంటనే స్పందించాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థి సంఘాల జెండాలను చేతబూని పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్‌రోడ్ ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శనగా వచ్చారు. అక్కడ భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి : బల్మూరి వెంకట్

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో దేశంలోని 24 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. బీహార్, గుజరాత్ కేంద్రంగా ప్రశ్నాపత్రం లీకైందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ సమస్యపై నోరుమెదపడం లేదని చెప్పారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గవర్నర్‌కు తమ బాధను చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. నీట్ రాతపరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచే వరకు పోరాడతామని చెప్పారు.

మోడీ స్పందించకుంటే భారత్‌బంద్ : నాగరాజు

నీట్ సమస్యపై ప్రధాని మోడీ స్పందించకుంటే భారత్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చెందుతుంటే ప్రధాని మోడీ, కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏను రద్దు చేయాలని కోరారు. నీట్ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీలు : మణికంఠరెడ్డి

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీలు అవుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి విమర్శించారు. ప్రధాని మోడీ స్పందించకపోవడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల దేశ ప్రతిష్ట మసకబారుతున్నదని చెప్పారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి రామకృష్ణ, పి మహేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రధాని మోడీ మౌనం వీడి నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై స్పందించాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకైందంటూ విద్యార్థులే ప్రకటించారని గుర్తు చేశారు. తప్పు జరిగింది కాబట్టే ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్‌ను తొలగించారని అన్నారు. నీట్ సమస్యపై సీబీఐ విచారణ చేపట్టడం పట్ల అభ్యంతరాలున్నాయనీ, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజనీకాంత్, శంకర్, కె అశోక్‌రెడ్డి, లెనిన్‌గువేరా, మమత (ఎస్ఎఫ్ఐ), చందనరెడ్డి, విష్ణు, అభిజిత్‌యాదవ్, మన్నేజీవన్, జాన్, సోహైల్ (ఎన్ఎస్‌యూఐ), రఘురాం నాయక్, రఘు (పీడీఎస్‌యూ), ఆజాద్, ఎస్కే, నరేందర్, సురేష్, గడ్డం శ్యామ్ (పీడీఎస్‌యూ), హష్మీబాబు, ఎండీ జావెద్, క్రాంతి, కృష్ణ (డీవైఎఫ్ఐ), నెర్లకంటి శ్రీకాంత్, శ్రీమాన్, సత్యప్రసాద్, ఆర్ బాలకృష్ణ, షేక్ మహమూద్ (ఏఐవైఎఫ్), బిఎస్ కృష్ణ, రవికుమార్, భీమేష్, సాయి (పీవైఎల్), మాసంపల్లి అరుణ్‌కుమార్, వీరన్న, కొత్త రవి, బాలకృష్ణారెడ్డి, నవాజ్ (విద్యార్థి జనసమితి) తదితరులు పాల్గొన్నారు.

ఈ యాప్స్‌లో బిల్లు చెల్లింపులు కుదరవ్..

(మొదటిపేజి తరువాయి)

కార్డుల ద్వారా ప్రభుత్వ బిల్లు చెల్లింపులు చేస్తే రివార్డు పాయింట్లు ఇవ్వబోమని కస్టమర్లను ముందే హెచ్చరించాయి. తాజాగా కరెంటు బిల్లుల్ని తమ సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాలనీ, జులై 1వ తేదీ నుంచి ఫోన్‌పే, పేటీఎమ్, అమెజాన్ పే, గూగుల్‌పే వంటి థర్డ్‌పార్టీ యాప్స్ ద్వారా బిల్లుల్ని స్వీకరించబోమని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. రిజర్వుబ్యాంకు గైడ్‌లైన్స్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. క్రెడిట్ కార్డుల తరహాలోనే థర్డ్‌పార్టీ యాప్స్ కూడా ప్రభుత్వ బిల్లు చెల్లింపుల సేవల్ని నిలిపివేశాయి. ఈ యాప్‌ల ద్వారా ప్రభుత్వ బిల్లులు చెల్లించాలని ప్రయత్నించినప్పుడు భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌కు రిజిస్టర్ కాలేదని చూపిస్తోంది. థర్డ్‌పార్టీ యాప్‌లు, క్రెడిట్‌కార్డ్ సంస్థలు తప్పనిసరిగా భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌లో రిజిస్టర్ కావాలంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే రిజర్వుబ్యాంకు (ఆర్బీఐ) ఆదేశాలు జారీ చేసింది. వినియోగదారుల భద్రత దృష్ట్యా ఈనిర్ణయం తీసుకున్నట్టు ఆర్బీఐ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నా, లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా దీన్ని వాయిదా వేశారు. తాజాగా జులై 1 నుంచి ఈ నిబంధనల్ని అమల్లోకి తెచ్చారు. బిల్లు చెల్లింపులన్నీ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్) ద్వారానే జరగాలనీ, దీనికోసం థర్డ్‌పార్టీ క్రెడిట్‌కార్డు, మొబైల్ యాప్ సంస్థలు తమ సిస్టమ్స్‌లో బీబీపీఎస్‌ను ఎనేబుల్ చేసుకోవాలని నిర్దేశించింది. అయితే ఇప్పటి వరకు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ వంటి ప్రయివేటు బ్యాంకులు ఈ పేమెంట్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకోలేదు. దీనివల్ల మొబైల్ యాప్స్, క్రెడిట్‌కార్డుల ద్వారా ప్రభుత్వ బిల్లు చెల్లింపులు సాధ్యం కావట్లేదు. ఇన్నాళ్లు అరచేతిలోని ఫోన్‌తో బిల్ పేమెంట్స్‌కు అలవాటైన ప్రజలకు, ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో ఆయా కార్యాలయాలకు వెళ్లడమో, లేదా అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా బిల్లులు చెల్లించడమో చేయాల్సి వస్తుంది. ఈ ప్రభావం ఆయా శాఖల బిల్లు చెల్లింపులపైనా పడే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఐసీసీ జట్టులో ఆరుగురు మనోళ్లే

టీ20 ప్రపంచకప్ టీమ్ ఆఫ్ ది టోర్నీ



దుబాయ్ : 17 ఏండ్ల సుదీర్ఘ విరామానికి తెరదించుతూ 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను భారత్ సొంతం చేసుకుంది. గ్రూప్, సూపర్ దశలో అజేయంగా నిలిచిన టీమ్ ఇండియా.. సెమీఫైనల్, ఫైనల్లో మెరుపు విజయాలు నమోదు చేసింది. మెగా ఈవెంట్‌లో అంచనాల మేరకు రాణించిన భారత క్రికెటర్లు.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో సింహభాగం బెర్తులు దక్కించుకున్నారు. కెప్టెన్, ఓపెనర్‌గా రోహిత్ శర్మ జట్టులో నిలువగా.. మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య.. పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు జట్టులో చోటు సాధించారు. అఫ్గాన్ క్రికెటర్లు రషీద్ ఖాన్, ఫజల్‌హాక్ ఫరూకీ సహా ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ ఐసీసీ జట్టులో చోటు సాధించటం విశేషం. విండీస్ నుంచి నికోలస్ పూరన్, ఆస్ట్రేలియా నుంచి మార్కస్ స్టోయినిస్ తుది జట్టులో నిలువగా.. రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా తరఫున పేసర్ ఎన్రిచ్ నోకియా అదనపు ఆటగాడిగా ఎంపికయ్యాడు. దక్షిణాఫ్రికా నుంచి మరో ఆటగాడు ఐసీసీ జట్టులో చోటు సాధించలేదు.

ఐసీసీ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ : రోహిత్ శర్మ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (అఫ్గాన్), సూర్యకుమార్ యాదవ్, మార్కస్ స్టోయినిస్ (ఆసీస్), హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రషీద్ ఖాన్ (అఫ్గాన్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ఫజల్‌హాక్ ఫరూకీ (అఫ్గాన్). (12 ఆటగాడు : ఎన్రిచ్ నోకియా)



సఫారీలు చిత్తు

అమ్మాయిలకు ఎదురులేదు. రెడ్‌బాల్ ఫార్మాట్‌లో వరుసగా మూడో టెస్టులో అఖండ విజయం నమోదు చేశారు. దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన టీమ్ ఇండియా 1-0తో టెస్టు సిరీస్ సొంతం చేసుకుంది. యువ స్పిన్నర్ స్నేహ్ రానా పది వికెట్ల ప్రదర్శనతో సఫారీలను తిప్పేయగా.. షెఫాలీ వర్మ, స్మృతీ మంధాన బ్యాట్‌తో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడారు. వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్ తాజాగా టెస్టు సిరీస్‌ను సైతం సొంతం చేసుకుంది.

- ఏకైక టెస్టులో భారత్ ఘన విజయం
- పది వికెట్లతో మాయ చేసిన స్నేహ్ రానా

నవతెలంగాణ-చెన్నై

టెస్టు క్రికెట్‌లో టీమ్ ఇండియా తీన్‌మార్. భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఏకైక టెస్టు మ్యాచ్‌లో గెలుపొందిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. నాలుగు రోజుల మ్యాచులో వరుసగా మూడో విజయం సాధించింది. ఫాలోఆన్‌లో దక్షిణాఫ్రికాను 373 పరుగులకు కుప్పకూల్చిన భారత్.. స్వల్ప లక్ష్యాన్ని ఊదేసింది. షెఫాలీ వర్మ (24 నాటౌట్, 30 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శుభ సతీశ్ (13 నాటౌట్, 26 బంతుల్లో 1 ఫోర్) 9.2 ఓవర్లలో లాంఛనం ముగించారు. 10 వికెట్ల తేడాతో భారత్ అద్వితీయ విజయం సాధించింది. అంతకుముందు కెప్టెన్ లారా (122, 314 బంతుల్లో 16 ఫోర్లు), సునె లుస్ (109, 203 బంతుల్లో 18 ఫోర్లు) సెంచరీలు సహా క్లెర్క్ (61, 185 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో సఫారీలు భారత్‌ను రెండోసారి బ్యాటింగ్‌కు రప్పించగలిగారు. పది వికెట్లతో మాయజాలం చేసిన యువ స్పిన్నర్ స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. టెస్టు సిరీస్ ట్రోఫీ 1-0తో టీమ్ ఇండియా అమ్మాయిల సొంతమైంది. భారత్, దక్షిణాఫ్రికా మహిళల టీ20 సిరీస్ జులై 5న చెన్నైలో తొలి మ్యాచ్‌తో షురూ కానుంది.

అలవోకగా..

నాల్గో రోజు చివరి సెషన్లో ఛేదనకు బరిలోకి దిగిన టీమ్ ఇండియా.. 9.2 ఓవర్లలో లాంఛనం ముగించింది. 37 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఓపెనర్లు ఊదేశారు. స్మృతీ మంధాన స్థానంలో శుభ సతీశ్ (13 నాటౌట్) ఓపెనర్‌గా వచ్చి మెప్పించింది. విధ్వంసక బ్యాటర్ షెఫాలీ వర్మ (24 నాటౌట్) తొలి ఇన్నింగ్స్ ద్వి శతక దూకుడు కొనసాగించింది. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగింది. భారత్ 10 వికెట్ల తేడాతో ఏకైక టెస్టులో ఘన విజయం సాధించింది.

సమిష్టిగా కూల్చారు

దక్షిణాఫ్రికాను తొలి ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ స్నేహ్ రానా 8 వికెట్ల మ్యాజిక్‌తో కుప్పకూల్చింది. కానీ ఫాలోఆన్‌లో ఆ జట్టు ప్రతిఘటించింది. స్నేహ్ రానా సహా ఇతర బౌలర్లు వికెట్ల వేటలో చెమటోడాల్సి వచ్చింది. కెప్టెన్, ఓపెనర్ లారా (122), నం.3 బ్యాటర్ సునె లుస్ (109) శతకాలతో కదం తొక్కారు. మిడిల్ ఆర్డర్‌లో డి క్లెర్క్ (61) అర్థ సెంచరీతో మెరిసింది. దీంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 373 పరుగులు చేసింది. 154.4 ఓవర్ల పాటు భారత బౌలర్లను విసిగించిన సఫారీ అమ్మాయిలు.. ఆతిథ్య జట్టుకు 36 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. స్నేహ్ రానా (2/111), దీప్తి శర్మ (2/95), రాజేశ్వరి (2/55) రెండేసి వికెట్లు పడగొట్టారు. పూజ, షెఫాలీ, హర్మన్‌ప్రీత్ తలా ఓ వికెట్ ఖాతాలో




స్కోరు వివరాలు :

భారత్ మహిళల తొలి ఇన్నింగ్స్ : 603/7 డిక్లేర్డ్
దక్షిణాఫ్రికా మహిళల తొలి ఇన్నింగ్స్ : 266/10
దక్షిణాఫ్రికా మహిళల రెండో ఇన్నింగ్స్ : 373/10
భారత్ మహిళల రెండో ఇన్నింగ్స్ : 37/0

ఆగమనం ఆలస్యం!

- తుఫాన్‌తో బార్బడోస్ విమానాశ్రయం మూసివేత
- హోటల్ గదులకే పరిమితమైన భారత క్రికెటర్లు



బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్) : ప్రపంచకప్ విజయోత్సవాలు, ఆటగాళ్ల భావోద్వేగపూరిత దృశ్యాలు, భారత క్రికెటర్ల గెలుపు ధమాకా వంటి ఫోటోలు అభిమానులను కేరింతలు కొట్టించగా.. బార్బడోస్ నుంచి ఆదివారం సాయంత్రం నుంచి కలవర పాటుకు గురిచేసే వార్తలు, ఫోటోలు రావటం మొదలైంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయానందంలో మునిగిపోయిన టీమ్ ఇండియా క్రికెటర్లు.. షెడ్యూల్ సమయానికి స్వదేశానికి రాలేకపోతున్నారు. ఆదివారం ఉదయమే దక్షిణాఫ్రికా క్రికెటర్లు ఇంటిముఖం పట్టగా.. భారత క్రికెటర్లు సాయంత్రం ప్రత్యేక విమానంలో నేరుగా ముంబయికి చేరుకోవాల్సి ఉంది. కానీ బార్బడోస్‌కు సౌత్‌ఈస్ట్‌కు 125 కిలోమీటర్ల దూరంలో తుఫాన్ కేంద్ర బిందువు ఉండటంతో.. అక్కడి విమానాశ్రయంతో పాటు స్థానిక దుకాణాలు, షాపింగ్ మాల్స్, ప్రజా రవాణా వ్యవస్థను పూర్తిగా బంద్ చేశారు. సోమవారం అర్థరాత్రి వరకు తుఫాన్ (కేటగిరీ 3 తుఫాన్) బార్బడోస్‌ను దాటి వెళ్లే అవకాశం ఉంది. ఆ తర్వాతే విమానయాన సర్వీస్‌లు మొదలు కానున్నాయి. భారత క్రికెటర్లు అక్కడి హిల్టన్ హోటల్‌లో ఉండగా.. తగినంత మంది సిబ్బంది సైతం అందుబాటులో లేరని సమాచారం. ప్రపంచకప్ కవరేజీ కోసం కరీబియన్ దీవులకు వెళ్లిన భారత క్రీడా పాత్రికేయులు సైతం అక్కడే చిక్కుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత భారత క్రికెటర్ల ప్రయాణంపై ఓ స్పష్టత రానుంది. 'ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్ విజయం సాధించిన భారత జట్టుకు స్వదేశంలో భారీ స్థాయిలో సన్మానం చేసేందుకు ప్లాన్ చేశాం. ఇక్కడ క్రికెటర్లు తుఫాన్ కారణంగా హోటల్‌కు పరిమితమయ్యారు. ప్రస్తుతం భారత క్రికెట్ జట్టును స్వదేశం చేర్చటంపైనే బీసీసీఐ ఫోకస్ పెట్టింది. ఆ తర్వాత క్రికెటర్లకు సన్మానంపై ఆలోచన చేస్తామని' బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

దినేశ్ కార్తీక్ కొత్త ఇన్నింగ్స్

ఆర్‌సీబీ బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా నియామకం



బెంగళూర్ : భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆటకు వీడ్కోలు పలికిన అనంతరం సరికొత్త అవతారం ఎత్తాడు!. ఇప్పటి వరకు వ్యాఖ్యాతగా మెప్పించిన దినేశ్ కార్తీక్ వచ్చే ఏడాది ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ (ఆర్‌సీబీ)కి బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. 39 ఏండ్ల దినేశ్ కార్తీక్ గత ఐపీఎల్ సీజన్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ప్రాతినిథ్యం వహించాడు. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు సారథ్యం వహించిన అనుభవం దినేశ్ కార్తీక్ సొంతం. 'ప్రొఫెషనల్ స్థాయిలో కోచ్‌గా బాధ్యతలు తీసుకోనుండటం ఎంతో ఆసక్తిగా ఉంది. నా జీవితంలో సరికొత్త అధ్యాయం పట్ల ఎంతో మక్కువగా ఎదురుచూస్తున్నాను. ఆటగాడిగా నా అనుభవం ఆర్‌సీబీ క్రికెట్ పురోగతికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను' అని దినేశ్ కార్తీక్ తెలిపాడు.




మెద్వదేవ్ ముందంజ

గాయంతో రిబకినా అవుట్

లండన్ : వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో రష్యా స్టార్ డానిల్ మెద్వదేవ్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఐదో సీడ్ మెద్వదేవ్ 6-3, 6-4, 6-2తో అమెరికా ఆటగాడిపై వరుస సెట్లలో విజయం సాధించాడు. స్విస్ ఆటగాడు స్టానిస్లాస్ వావ్రింకా 6-3, 7-5, 6-4తో లోకల్ ఆటగాడిపై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. బెరాటిని (ఇటలీ) 7-6(7-3), 6-2, 3-6, 6-1తో మార్టన్ (హంగరీ)పై గెలుపొందాడు. ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ 7-6(7-2), 6-4, 6-4తో ఆసీస్ ఆటగాడు బోల్ట్‌పై పైచేయి సాధించాడు. ఫోగ్నిని 6-1, 6-3, 6-5తో వరుస సెట్లలో ఫ్రాన్స్ ఆటగాడు లూకాను చిత్తు చేశాడు. మహిళల సింగిల్స్‌లో రిబకినా గాయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆమె స్థానంలో క్వాలిఫయర్స్ నుంచి ఒకరికి అవకాశం లభించింది. ఏడో సీడ్ ఇటలీ అమ్మాయి జాస్మిన్ పావొలిని 7-5, 6-3తో వరుస సెట్లలో అలవోక విజయం సాధించింది. చైనా అమ్మాయి జాంగ్‌పై 6-3, 6-0తో దరియా విజయం సాధించింది.

నవచిత్రం



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్

మరో సూపర్‌హిట్ కోసం..

షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న 8వ చిత్రాన్ని 'చావు కబురు చల్లగా' ఫేమ్ కౌశిక్ పెగళ్లపాటి డైరెక్టర్‌గా సోమవారం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, మరో నిర్మాత దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. సతీష్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ హ్యాండోవర్ చేశారు.
డిఫరెంట్ వరల్డ్, యూనిక్ ప్రిమైజ్‌లో సెట్ చేయబడిన ఈ హర్రర్ మిస్టరీ మూవీ ఇప్పటికే ఆసక్తికరమైన ఫస్ట్‌లుక్‌తో సంచలనం సృష్టించింది. ఈ మూవీలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. గతంలో ఈ కాంబోలో రిలీజైన 'రాక్షసుడు'చిత్రం విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఈ జంట మరో హిట్ కోసం సీట్ ఎడ్జ్ గ్రిప్పింగ్ నెరేటివ్ అందించబోతున్నారు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈనెల11న ప్రారంభమై, శరవేగంగా సాగనుంది అని చిత్ర బృందం తెలిపింది.
శ్రీమతి అర్చన ప్రెజెంట్స్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీతం - బి. అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ - చిన్మయ్ సలాస్కర్, ప్రొడక్షన్ డిజైన్ - మనీషా ఎ దత్, ఆర్ట్ డైరెక్టర్ - డి శివ కామేష్, ఎడిటర్ - నిరంజన్ దేవరమానే, ఫైట్స్: జాషువా మాస్టర్, సహ రచయిత - దరహాస్ పాలకొల్లు.

థ్రిల్ చేసే కోడి బుర్ర



శ్రీరామ్, శృతిమీనన్

శ్రీరామ్ హీరోగా, శృతి మీనన్, ఆరుషి హీరోయిన్స్‌గా నటించనున్న కొత్త చిత్రం 'కోడి బుర్ర'.
ఈ సినిమా సోమవారం ఫిలింనగర్ దైవ సన్నిధానంలో లాంఛనంగా ప్రారంభమైంది.
ఈ చిత్రాన్ని వీ4 క్రియేషన్స్ బ్యానర్‌పై కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ నిర్మిస్తున్నారు. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వం వహిస్తున్నారు. మహావీర్ కీ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథిలుగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ క్లాప్ నివ్వగా, దర్శకుడు భరత్ కమ్మ స్క్రిప్ట్ అందజేశారు.
దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా శ్రీరామ్ కనిపిస్తారు. అందరికీ నచ్చేలా మంచి క్రైమ్ థ్రిల్లర్ సినిమా అవుతుందని నమ్ముతున్నాం' అని తెలిపారు. 'ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్ కథతో మీ ముందుకు రాబోతోంది. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో పార్ట్ కావడం హ్యాపీగా ఉంది' అని హీరో శ్రీరామ్ చెప్పారు. 'ఈ నెల 22వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తున్నాం. మంచి కథ, మా డైరెక్టర్ ఎంతో క్రియేటివ్‌గా స్క్రిప్ట్ చేశారు. ఈ సినిమా హిట్ ఖాయం అనే నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాతలు అన్నారు.



రామ్

పక్కా మాస్ బీట్‌తో స్టెప్పామార్

రామ్ పోతినేనిన్, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో రాబోతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ ప్రాజెక్ట్, మచ్ ఎవైటెడ్ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్ ఇది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్ట్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.
ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రాన్ని దూకుడుగా ప్రమోట్ చేయాలని మేకర్స్ చూస్తున్నారు. టీజర్‌కు సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చిన తర్వాత టీమ్ తాజాగా ఫస్ట్ సింగిల్ 'స్టెప్పామార్'తో మ్యూజిక్ ప్రమోషన్‌లను ఆరంభించారు.
స్టెప్పా మార్ ట్రూలీ మాస్ డ్యాన్స్, రిథమ్, హై ఎనర్జీని సెలబ్రేట్ చేసుకునే సాంగ్. రామ్ పోతినేని అద్భుతమైన పెర్ఫార్మెన్స్, పూరి జగన్నాథ్ స్టైలిష్ టేకింగ్, విజువల్ మాస్ ఫీస్ట్‌లా ఉంది. వోకల్స్, లిరిక్స్ లిజనర్స్‌కి గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఆకట్టుకునే లిరిక్స్ ఉన్న ఈ పాట సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలుస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు.
మణిశర్మ కంపోజ్ చేసిన ఈ ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్ మ్యూజిక్ ప్రమోషన్‌లను అద్భుతంగా ప్రారంభించింది. భాస్కర భట్ల సాహిత్యం హీరో వైబ్‌ని గొప్పగా వర్ణిస్తుంది. ప్రతి ఒక్కరికీ విన్న వెంటనే కనెక్ట్ అవుతుంది. అనురాగ్ కులకర్ణి, సాహితీ తమ డైనమిక్ వోకల్స్‌తో సాంగ్‌కి మాస్ టచ్ జోడించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అద్భుతమైన మూమెంట్స్ మరొక హైలైట్. ఇందులో రామ్ డ్యాన్స్ మూమెంట్స్ ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేశాయి. పవర్‌ఫుల్ విజువల్స్, డైనమిక్ కెమెరా వర్క్ సాంగ్‌ని మరింత ఎలివేట్ చేసి మస్ట్ వాచ్‌గా నిలిపాయి.
బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో నటించగా, కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈచిత్రం బిగ్ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. అలీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, సిఈవో: విష్, సంగీతం: మణి శర్మ సినిమాటోగ్రఫీ: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, స్టంట్ డైరెక్టర్: కేచ, రియల్ సతీష్.

భిన్న కాన్సెప్ట్‌తో పాన్ ఇండియా సినిమా



సుధీర్ బాబు

ఇటీవల 'హరోం హర'తో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న హీరో సుధీర్ బాబు ఈసారి సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించబోతున్నారు. ఇది భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందనుంది. ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఆడియెన్స్‌కి అందించేలా, లార్జర్ దేన్ లైఫ్ స్టోరీ లైన్‌తో ఇంతకు ముందెన్నడూ చూడని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కబోతున్న ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎంతో ప్రాధ్యానత ఉంది.
వెంట్ కళ్యాణ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'రుస్తుం, టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మ్యాన్, పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ పాన్ ఇండియా సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రం రూపొందనుంది. త్వరలోనే చిత్ర యూనిట్‌తో బాలీవుడ్ హీరోయిన్ జాయిన్ కానుంది. త్వరలోనే మేకర్స్ ఆ వివరాలను తెలియజేస్తారు.
ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది శివరాత్రి సందర్భంగా మార్చిలో విడుదల చేయనున్నారు. లోతైన కథతో రానున్న ఈ చిత్రంలో కుట్ర, పన్నాగాలు కలగలిసిన చెడుకి, మంచి జరిగే యుద్ధంగా ఇండియన్ సినిమాల్లో ఓ మైల్ స్టోన్ మూవీలా బిగ్గెస్ట్ పాన్ ఇండియా చిత్రంగా ఇది తెరకెక్కనుంది.
ఈ సందర్భంగా హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ, 'నేను ఈ సినిమా స్క్రిప్ట్ నచ్చి ఏడాది పాటు టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు ఎప్పుడెప్పుడు వద్దామా అని చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. వరల్డ్ క్లాస్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ప్రేక్షకులకు అందించటానికి ప్రేరణ అరోరా, ఆమె టీమ్ సభ్యులు ఎంతగానో కష్టపడుతున్నారు. ఇది ప్రేక్షకుల మనసుకు హత్తుకుంటుందనే గట్టి నమ్మకం ఉంది' అని అన్నారు. ప్రేరణ అరోరా, శివిన్ నారగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఆగస్ట్ 15న విడుదల చేయనున్నారు.

షణ్ముఖిలో శక్తివంతమైన పాత్ర



అవికాగోర్

వైవిధ్యమైన చిత్రాలను, విభిన్నమైన కథలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు.
'శాసనసభ' పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.
సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన చివరి షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న అవికాగోర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రంలో ఆమె లుక్‌ను రివీల్ చేస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్.
ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ,'ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రంలో కథానాయిక అవికాగోర్ 'సర' పాత్రలో సాహసోపేతమైన పనులు చేసే శక్తివంతమైన అమ్మాయి పాత్రలో కనిపించనుంది. లక్ష్య సాధనలో ఆది పాత్రకు సపోర్ట్ చేస్తూ ఆయనకు తోడుగా నిలిచే పాత్ర. తప్పకుండా ఈ చిత్రం ఆది, అవికాగోర్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



కూలిన మట్టి మిద్దె ఇల్లు

- నిద్రలోనే తల్లి, ముగ్గురు పిల్లలు మృతి
- ఆదివారం కురిసిన వర్షంతో ఘోరం
- నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో ఘటన

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పాత మిద్దె ఇల్లు నలుగురిని కప్పేసింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇల్లు అమాంతం కూలిపోయింది. దాంతో నిద్రలోనే తల్లి, ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇంటి పెద్ద తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్ల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడుగు భాస్కర్, పద్మ (28) భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమార్తెలు పప్పీ(6), వసంత(7), కుమారుడు విక్కీ(1) సంతానం. భాస్కర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పద్మ వ్యవసాయ పనులకు వెళ్లేది. ఆదివారం రాత్రి అందరూ భోజనం చేశాక పడుకున్నారు. రాత్రి భారీ వర్షం కురవడంతో వారి మిద్దె ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో భాస్కర్ భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు అక్కడికక్కడే మృతిచెందారు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని పోలీసులు, అధికారులు పరిశీలించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆస్పత్రిలో బాధితున్ని కలెక్టర్ పరామర్శించి.. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

రూ.20 లక్షల పరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

పాత మిద్దె ఇల్లు కూలి నలుగురు మృతి చెందడం బాధాకరం. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. రూ.20లక్షల పరిహారం ఇవ్వాలి. ఇంటి పెద్ద భాస్కర్‌కు పూర్తి వైద్యం అందించాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది. అధికారులు ముందే గుర్తించి మట్టి ఇంట్లో నివసించే వారిని తరలించే యత్నం చేస్తే.. ప్రమాదం జరిగేది కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. పాత మట్టి ఇండ్లల్లో ఉండేవారిని గుర్తించి.. వారిని ఇతర ఆవాసాలకు మార్చాలి. పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి.

కుటుంబాన్ని ఆదుకుంటాం: కలెక్టర్ బదావత్ సంతోష్

బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం. గాయాలతో బయట పడిన భాస్కర్‌కు ఆధునిక వైద్యం అందిస్తాం. రూ. నాలుగు లక్షలు అందజేస్తాం. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడం బాధాకరం. వర్షాకాలం నేపథ్యంలో మట్టి మిద్దె ఇండ్లల్లో నివసిస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలి.

ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష : అమర్‌సింగ్ పవార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో చేయకపోవడం దారుణమని బీజేపీ గిరిజన మోర్చా నేత అమర్‌సింగ్ పవార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ సర్కార్ మాదిరిగానే వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

యువమోర్చా నాయకుల్ని కొట్టడం, అరెస్టు చేయడం దారుణం

- పోలీసు అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలి : ఎస్. మహేందర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద యువమోర్చా నాయకుల్ని పట్టుకుని ఓ పోలీసు అధికారి కొట్టడం దారుణమని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ అన్నారు. ఆ పోలీసు అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేదనీ, ప్రశ్నించేవారిని పోలీసులతో అణచాలని చూస్తున్నదని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలపై దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను కలువనివ్వకుండా పోలీసుల బందోబస్తు పెట్టడమేంటని ప్రశ్నించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వెంటనే బులిటెన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యువమోర్చా నాయకులను పరామర్శించిన ఏలేటి

తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న యువ మోర్చా నాయకులను బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. గాంధీ ఆస్పత్రిలో దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు. నిరుద్యోగుల పోరాటానికి తమ మద్దతుంటుందని చెప్పారు.

వచ్చే ఏడాది నాటికి విస్తరణ పనులు పూర్తి చేయండి

- మైక్రోసాఫ్ట్ ప్రతినిధులకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల విస్తరణ పనులను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసి, కార్యకలాపాలను పెంచాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ సంస్థ ప్రతినిధులను కోరారు. విస్తరణ పూర్తయితే అత్యాధునిక డేటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్స్ రంగాల్లో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డేటా సెంటర్లకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనపై శ్రీధర్‌బాబు మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో సమీక్షించారు. డేటా సెంటర్ కోసం మేకగూడలో సేకరించిన 22 ఎకరాలకు సంబంధించి స్థానిక పంచాయతీతో కొన్ని గొడవలున్నాయనే విషయాన్ని వారు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకురాగా... వెంటనే పరిష్కరించాలంటూ ఆయన రంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు, వరదనీటి కాల్వల నిర్మాణం లాంటి పనులను గడువులోగా పూర్తి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సంస్థ సేకరించిన భూముల వినియోగ మార్పిడి పనులను వేగంగా పూర్తి చేయాలంటూ అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనుల పర్యవేక్షణ కోసం ఒక అధికారిని నియమిస్తామంటూ మైక్రోసాఫ్ట్ ప్రతినిధులకు హామీనిచ్చారు. సమావేశంలో ఆ సంస్థ ఏషియా ఆపరేషన్స్ హెడ్ ఇయాన్ కాలన్, భూ అభివృద్ధి విభాగం హెడ్ ఉత్తమ్ గుప్తా, ఇండియా కమ్యూనిటీ హెడ్ శ్రీ చందన తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చండి : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం యువకులు చేస్తున్న పోరాటంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదని పేర్కొంటూ సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిని, ఇతర నాయకులను అరెస్టు చేయటంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అత్యుత్సాహాన్ని మానుకోవాలని హితవు పలికారు.

'ఇందిరమ్మ ఇండ్ల'పై అధ్యయనం



- ఇతర రాష్ట్రాలకు బృందాలు
- బడ్జెట్ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఇతర రాష్ట్రాలకు అధికారులను పంపి, అధ్యయనం చేయించి ప్రభుత్వానికి త్వరగా నివేదికనివ్వాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పేదలకు ఇండ్ల కోసం (ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున) బడ్జెట్‌లో నిధులు కేటాయించామని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా వీటిని నిర్మిస్తున్నామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి సమీక్ష నిర్వహించారు. కాలుష్య రహిత గ్రీన్ ఎనర్జీని తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు తప్పనిసరి అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నిర్మాణ సమయంలోనే కచ్చితంగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో అవుటర్, రీజనల్ రింగ్ రోడ్ చుట్టూ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకోసం రెవెన్యూ శాఖ నుంచి భూమిని సేకరించుకోవాలని ఆదేశించారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాల్సిన బాధ్యత గృహ నిర్మాణ శాఖపైన్నే ఉందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్, బర్కత్‌పుర, కూకట్‌పల్లి, ఈసీఐఎల్ లాంటి ప్రాంతాల్లో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్ఐజీ, ఎమ్ఐజీ, హెచ్ఐజీ పేరిట గతంలో ఇండ్లను నిర్మించటం వల్ల ఎంతో మందికి లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు.

ఇందిరమ్మ ఇండ్లపై అధ్యయనం కోసం మూడు బృందాలుగా ఇతర రాష్ట్రాలకు వెళుతున్నట్టు గృహ నిర్మాణ శాఖ అధికారులు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు వివరించారు. చెన్నై, బెంగళూరు, ముంబయి నగరాల్లో ఆయా బృందాలు పర్యటిస్తాయని తెలిపారు. అనంతరం ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ సర్కారు జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష బెడ్ రూం ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించుకుని, 69 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసిందని వారు డిప్యూటీ సీఎంకు వివరించారు. అందులో 65 వేల ఇండ్లను మాత్రమే లబ్దిదారులకు పంపిణీ చేశారని తెలిపారు. మిగతా వాటి నిర్మాణం కొనసాగుతోందని అన్నారు. ధరణిలోని పెండింగ్ దరఖాస్తుల గురించి భట్టి ఆరా తీయగా... డిజిటల్ భూ సర్వే చేయటానికి వీలుగా నిధులను కేటాయించాలంటూ అధికారులు కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న బాబ్లీగేటు

- త్రివేణి సంగమం వద్ద జలకళ

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/రెంజల్

ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ భాగంలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. ఇరు రాష్ట్రాల అధికారుల సమక్షంలో ఉదయం 11 గంటల సమయంలో మొత్తం 14 గేట్లను ఎత్తివేశారు. ఆ సమయంలో బాబ్లీ ప్రాజెక్టులో 0.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రతేడాది వర్షాకాలం ప్రారంభమైన జులై 1వ తేదీ నుంచి బాబ్లీగేట్లను తెరిచి అక్టోబర్ 28వ తేదీన మూసివేస్తారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి, నాందేడ్ ఈఈ బన్‌సూడ్, ఏఈఈ వంశీ, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి సంగమం వద్ద జలకళ

నిజామాబాద్ రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో కొత్త నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. ఇసుక దిబ్బలతో ఎడారిగా కనబడిన గోదావరి.. సోమవారం బాబ్లీ గేట్లను తెరవడంతో మిగులు జలాల రాకతో కళకళలాడింది.

ఎస్సారెస్పీలో 10.47 టీఎంసీల నీరు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1059.9 అడుగుల (10.474 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1064.90 అడుగుల(15.881 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ సారి వర్షాకాలం ప్రారంభమైనా వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి నీరు రాక బోసిపోయింది. గతేడాది కంటే సుమారు 5 టీఎంసీల మేర నీటిమట్టం తగ్గడం గమనార్హం.

తేలికైన మందులతో వైరల్ ఇన్ఫెక్షన్లకు చికిత్స

- డాక్టర్ వసంత్ కుమార్ గౌరానీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న కోవిడ్, డెంగ్యూ, చికున్ గున్యా, స్వైన్ ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లను తేలికపాటి మందులతో నయం చేయొచ్చని హైదరాబాద్ సుల్తాన్ బజార్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వసంత్ కుమార్ గౌరానీ తెలిపారు. సోమవారం హైదరాబాద్ కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారికి నెగెటివ్ వచ్చేలా ఈ మందులు పని చేస్తున్నాయని వివరించారు.

ఇందుకు సంబంధించిన ఆధారాలను ఐసీఎంఆర్‌కు, కేంద్ర ఆరోగ్య శాఖకు 2023 ఏప్రిల్ లో, తిరిగి అదే ఏడాది నవంబర్‌లో పంపించినట్టు తెలిపారు. డెంగ్యూ కేసుల్లో ప్లేట్ లెట్లు పడిపోతే 12 నుంచి 24 గంటల్లో వాటి సంఖ్యను పెంచుతున్నట్టు ఆయన తెలిపారు. అసలు చికిత్సే లేదనే దశలో తాము పాటించిన ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్ డెంగ్యూ నుంచి ప్రజలను రక్షించిందని తెలిపారు. డెంగ్యూ వస్తే ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం లేదనీ, బొప్పాయి, టాబ్లెట్లు, ప్లేట్ లెట్ల మార్పిడి అవసరం లేదని స్పష్టం చేశారు. చికున్ గున్యా, స్వైన్ ఫ్లూలను కూడా వంద శాతం నయం చేసినట్టు తెలిపారు.

తమ ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్‌తో హెచ్ఐవీకి కూడా చికిత్స చేయొచ్చని డాక్టర్ వసంత్ కుమార్ తెలిపారు. 56 సంవత్సరాల మహిళకు చికిత్సనందించగా 3 నెలల్లో అద్భుతమైన ఫలితం వచ్చిందని చెప్పారు. 2023 సెప్టెంబర్‌లో ఆమె వైరల్ లోడ్ ఒక కోటికిపైగా కాపీలుగా ఉందని చెప్పారు. చికిత్స తర్వాత అక్టోబర్ నాటికి అది కాస్తా 50 లక్షలకు, నవంబర్ నాటికి ఆరు లక్షలకు , మరో నెల చికిత్స తర్వాత 3.50 లక్షలకు తగ్గిందని చెప్పారు. అన్ని రకాల ఇన్‌ఫెక్షన్లకు తాము ఒకటి లేదా రెండు రకాల మందులతో ఒకే రకమైన ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్‌ను పాటించినట్టు తెలిపారు. ఆయా వ్యాధులను బట్టి చిన్నపాటి తేడా ఉంటుందని చెప్పారు.

కాల్‌సెన్ అనే మందు అన్ని రకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లను నయం చేసేందుకు ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ఈ ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్ ను, మందును ఉపయోగించడం ద్వారా ప్రజలు ఆర్థిక, ఆరోగ్య ఇబ్బందులపడకుండా కాపాడాలని కోరారు. రోగులకు చికిత్సనందించడంలో గాంధీ ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, సంగారెడ్డి వీపీ యూనిట్ డాక్టర్ పుష్పలత తనతో ఉన్నారని వసంత్ తెలిపారు.

'నీట్-యూజీ' కేసు

- గోధ్రాలోని ప్రయివేట్ పాఠశాల యాజమానిని అరెస్ట్ చేసిన సీబీఐ
- ఇప్పటికే ఐదుగురిని అదుపులోకి తీసుకున్న కేంద్ర దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ : మే నెలలో గుజరాత్‌లోని గోధ్రాలోని ఒక ప్రయివేట్ పాఠశాలలో నీట్-యూజీ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ.. ఆ స్కూల్ యజమానిని అరెస్టు చేసింది. పంచమహల్ జిల్లాలోని గోధ్రా సమీపంలో ఉన్న జై జలరామ్ స్కూల్ యజమాని దీక్షిత్ పటేల్ అరెస్ట్‌తో, ఇప్పటివరకు అరెస్టయిన వ్యక్తుల సంఖ్య ఆరుకు చేరుకున్నది. వారిలో ఐదుగురిని గుజరాత్ పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. మే 5న నీట్-యూజీ పరీక్ష జరిగిన నిర్ణీత కేంద్రాల్లో జై జలరామ్ స్కూల్ ఒకటి. ఆదివారం తెల్లవారుజామున పంచమహల్ జిల్లాలోని ఆయన నివాసం నుంచి పటేల్‌ను అరెస్టు చేసినట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ ఠాకూర్ తెలిపారు. కేసును గుజరాత్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించటంతో సీబీఐ బృందం అతనిని (దీక్షిత్ పటేల్) అహ్మదాబాద్‌లోని కోర్టు ముందు హాజరుపర్చిందని చెప్పారు. ఈ కేసులో అరెస్టయిన ఆరో వ్యక్తిగా ఉన్న దీక్షిత్ పటేల్.. పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు కనీసం 27 మంది అభ్యర్థుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. పంచమహల్ పోలీసులు ఇంతకుముందు అరెస్టు చేసిన ఇతర ఐదుగురిలో వడోదరకు చెందిన విద్యా సలహాదారు పరశురామ్ రాయ్, జై జలరామ్ స్కూల్ ప్రిన్సిపాల్ పురుషోత్తం శర్మ, పాఠశాల ఉపాధ్యాయుడు తుషార్ భట్, మధ్యవర్తులు విభోర్ ఆనంద్, ఆరిఫ్ వోహ్రాలు ఉన్నారు.

వారం క్రితం విచారణ చేపట్టిన తర్వాత పరశురామ్ రాయ్ మినహా నలుగురు నిందితులను కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరింది. శనివారం గోధ్రా జిల్లా కోర్టు శర్మ, భట్, ఆనంద్, వోహ్రాలను జులై 2 వరకు సీబీఐ కస్టడీకి అప్పగించింది. నీట్-యూజీలో అధిక స్కోర్లు సాధించేందుకు అక్రమ మార్గాలను అవలంబించే అభ్యర్థులను నిందితులు జై జలరామ్ పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఎంచుకోవాలని కోరినట్టు సీబీఐ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గతేడాది ఇదే పాఠశాలలో జరిగిన నీట్ పరీక్షలో సమాధాన పత్రాలను రాత్రిపూట భద్రపరిచే కీలకమైన దుర్బలత్వం బయటపడిందనీ, ఈ సమయంలో ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ (ఓఎంఆర్) షీట్‌లను తారుమారు చేసేందుకు నిందితులు పథకం పన్నారని సీబీఐ కోర్టుకు తెలిపింది.

నల్లగొండ డీసీసీబీ చైర్మెన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి

ప్రమాణస్వీకారంలో మంత్రి వెంకట్‌రెడ్డి

- పంద్రాగస్టులోపు రుణమాఫీ

నవతెలంగాణ-నల్లగొండ డెస్క్

ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్‌గా మునుగోడు పీఏసీఎస్ చైర్మెన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ప్రమాణస్వీకారం చేయగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇది ఇందిరమ్మ రాజ్యమని, రైతు ప్రభుత్వం కొనసాగుతోందని, ఊహాజనితాలను పటాపంచలు చేస్తూ అన్న మాట ప్రకారం ఆగస్టు 15వ తేదీ లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 2004లో అప్పటి సీఎం వైఎస్ఆర్ రుణమాఫీ చేసి దేశంలోనే చరిత్ర సృష్టించారని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో ఏడు



లక్షల కోట్ల అప్పు ఉండి కూడా సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడానికి కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు.

పైసా పైసా పోగేసి రైతులకు సహాయం చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. నూతన చైర్మెన్‌గా ఎన్నికైన కుంభం శ్రీనివాస్‌రెడ్డి రైతుల అభివృద్ధికి పాటుపడాలని, ఆయనకు తనతోపాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేల సహకారం ఉంటుందని చెప్పారు.

చైర్మెన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని, రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ అధ్యక్షులు బోళ్ల వెంకట్‌రెడ్డి, డీసీసీబీ సీఈవో శంకర్‌రావు, డీసీసీబీ ఎన్నికల నిర్వాహకులు, డీసీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన డీసీసీబీగా బాధ్యతలు చేపట్టిన కుంభ శ్రీనివాస్‌రెడ్డిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

వచ్చిన నీరు వచ్చినట్టే దిగువకు..

మేడిగడ్డ బ్యారేజీ 85 గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-మహదేవపూర్

మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతోపాటు తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో వస్తున్న వరద నీటిని నిజామాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న బాబ్లీ గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. దాంతో జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం వద్ద క్రమక్రమంగా గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం గేట్లు 85 కాగా ప్రస్తుతం 85 గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు పంపిస్తున్నారు. సోమవారం ఇన్‌ఫ్లో 12,600 క్యూసెక్కులు కాగా అంతే మొత్తంలో 12,600 క్యూసెక్కుల నీటిని మొత్తం గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నట్టు ఈఈ తిరుపతిరావు తెలిపారు. కాగా మేడిగడ్డ బ్యారేజీ నీటి సామర్థ్యం 16 టీఎంసీలు. అయితే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కొన్ని కుంగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులు చేపడుతోంది. ఈ క్రమంలో వర్షాకాలం దృష్ట్యా చేపట్టిన ఆ మరమ్మతులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఏడాది మొత్తం పనులు సాగనున్నందున బ్యారేజీకి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

బదిలీపై ఉపాధ్యాయులు.. కన్నీరు పెట్టిన విద్యార్థులు

- విద్యార్థులను హత్తుకున్న టీచర్లు



నవతెలంగాణ-చేర్యాల

"సార్ మీరు ఎక్కడికీ పోవద్దు.. మాతోనే ఉండాలి, మీరే మాకు పాఠాలు చెప్పాలి, మీరులేని ఈ బడికి మేము రాం" అంటూ బదిలీపై వెళుతున్న టీచర్లను పట్టుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగింది. ఈ పాఠశాలలో 123 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సందిటి సులోచన, ఉపాధ్యాయులు తాటికొండ యాదయ్య, గొంటి బుచ్చయ్య, అక్కెనపల్లి ఇంద్రసేనా రెడ్డి, ఉప్పల భాస్కర్, కామిడి రత్నమాల పని చేస్తున్నారు. అదే పాఠశాలలో పని చేస్తున్న టీచర్ మెడిచెల్మి అయోధ్యకు పదోన్నతి రావడంతో అదే పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. మిగతా అందరూ ఎనిమిదేండ్ల కాలపరిమితి దాటడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీపై వెళ్లాల్సి ఉంది. ఇన్నేండ్లుగా పిల్లలు, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మెదులుతూ పిల్లలు బడికి రాకుండా మానేస్తుంటే వారి ఇండ్లకు వెళ్లి నచ్చచెప్పి తీసుకువచ్చిన ఉపాధ్యాయులు.. బదిలీ అవుతుండటంతో విద్యార్థులు దు:ఖసాగరంలో మునిగిపోయారు. పిల్లలు తమపై పెంచుకున్న ప్రేమకు ఉపాధ్యాయులూ కన్నీళ్లు పెట్టుకున్నారు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారంతా బడికి చేరుకున్నారు. పిల్లలు.. టీచర్లను తలుచుకుంటూ రోదిస్తున్న తీరు చూసి తల్లిదండ్రులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు, విద్యార్థులకు చేసిన సేవలను గుర్తు చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ తోళ్ల రాజేశ్వరి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్.. ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత



నవతెలంగాణ-టేకుమట్ల

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ద్వారకపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు గట్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకపేట గ్రామంలో గాజు గట్టయ్య తన గొర్రెలు, మేకల మందను గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఉంచాడు. సోమవారం ఉదయం ఇంటికి వెళ్లి అన్నం తిని వచ్చేసరికి గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దాదాపు 30 నుంచి 40 గొర్రెలపై దాడి చేయగా 20 గొర్రెలు, 4 మేకలు మృత్యువాతపడ్డాయి. తీవ్ర గాయాలైన వాటికి వెటర్నరీ డాక్టర్ వివేక్ కుమార్, వీఏ శారద, గోపాలమిత్ర కుమారస్వామి చికిత్స అందజేశారు. నిరుపేద గట్టయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

- అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం..
- ఔటర్ నిర్మాణంలో ఎవరికీ నష్టం చేయం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- బీఆర్ఎస్ కార్యాలయానికి నోటీసులివ్వాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-నల్లగొండ డెస్క్

"నల్లగొండ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం.. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలి.. అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయానికి అధికారులు నోటీసులు ఇవ్వాలి. ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణంలో ఎవరికీ నష్టం చేయం.. మార్కెట్ ధర కన్నా ఎక్కువ నష్టపరిహారం ఇప్పిస్తాం.." అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ వద్ద రూ.3 కోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే 15 వేల కుటుంబాల వరకు లోవోల్టేజీ సమస్యను అధిగమించొచ్చన్నారు. రెండు మాసాల్లోనే సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నుడాలో నూతనంగా కలిసిన గ్రామాలకు సాగునీటి వ్యవస్థ పునరుద్ధరణ కోసం రూ.200 కోట్లు కేటాయించామని, రూ.90 కోట్లతో నీలగిరి సాంస్కృతిక నిలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. అవసరానికి సరిపోయే భూమి ఇస్తే మరో సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపడతామని వెల్లడించారు. పట్టణంలో టీహబ్‌తో పాటు కలెక్టరేట్ వద్ద మరో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను కడుతున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా మరో 3 సబ్‌స్టేషన్‌ల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి 10 ఎంఎల్‌డీ వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి రూ.30 కోట్ల మంజూరు చేశామని, అదేవిధంగా రూ. 700 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని వివరించారు. ఎస్సెల్బీసీ వద్ద ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఎలాంటి నిర్మాణాలూ చేపట్టినా తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయానికి నోటీసులు అందజేసి కూలగొట్టాలని చెప్పారు. అన్ని వసతులతో మల్టీపర్పస్ హాస్టల్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఎస్సెల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మెన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, ఆర్డీఓ రవి పాల్గొన్నారు.

మధిరకు త్వరలో ఐటీ హబ్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-మధిర

మధిరకు త్వరలో ఐటీ హబ్ తీసుకువస్తున్నామని, దాని ఏర్పాటుకు కావలసిన భూమిని గుర్తించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మధిరలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని అన్నారు. మధిర మండలం ఎండ్లపల్లిగుట్ట వద్ద ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. మధిరలోని యువతకు ప్రోత్సాహం అందించడానికి ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ తీసుకువచ్చామని అన్నారు. ఎస్ఎస్ఎంఈ పరిశ్రమలు పెట్టుకునే యువతకు ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ట్రెడిషనల్ వ్యాపారాన్ని పారిశ్రామీకరణ చేసి ఉత్పత్తి, వినియోగం పెంచడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా డెయిరీ ఏర్పాటుకు కసరత్తు నడుస్తున్నదని తెలిపారు. పాల ఉత్పత్తి ప్యాకింగ్, మార్కెటింగ్, ఇందిరా డెయిరీ నిర్వహించబోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బిజినెస్

విద్యుత్ వాహన అమ్మకాల్లో మందగమనం

- జులైలో 14 శాతం పతనం
- ప్రోత్సాహకాల తగ్గింపు ప్రభావం



న్యూఢిల్లీ : దేశంలో విద్యుత్ వాహనాల అమ్మకాల్లో మందగమనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది జూన్‌లో ఇవి కార్లు, ద్విచక్ర వాహన విక్రయాలు 1,06,081 యూనిట్లకు తగ్గాయి. ఇంతక్రితం నెల మేలో 1,23,704 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే 14 శాతం క్షీణత నమోదయ్యింది. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లోని డేటా ప్రకారం.. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు 8,39,545 విద్యుత్ వాహనాలు అమ్ముడయ్యాయి. మొత్తం వాహన విక్రయాల్లో ఈ సంఖ్య 6.69 శాతంగా ఉంది. ఇవి అమ్మకాల్లో ద్విచక్ర వాహనాల వాటా 57 శాతంగా నమోదయ్యింది. గతేడాది విద్యుత్ ద్విచక్ర వాహనాలకు ఇచ్చే సబ్సిడీని ప్రభుత్వం భారీగా కుదించింది. గరిష్ఠంగా ఇచ్చే సబ్సిడీని రూ.60వేల నుంచి రూ.22,500కు కోత పెట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మరోసారి విద్యుత్ వాహనాలకు ఇచ్చే సబ్సిడీని సగానికి తగ్గించింది. ఫేమ్-2 స్థానంలో కొత్తగా విద్యుత్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్‌ను తీసుకొచ్చింది. ద్విచక్ర వాహనానికి గరిష్ఠంగా ఇచ్చే సబ్సిడీని ఏకంగా రూ.10వేలకే పరిమితం చేసింది. త్రిచక్ర వాహనాల సబ్సిడీలోనూ కోత పెట్టింది. ఈ ప్రభావం ద్విచక్ర ఇవి కంపెనీలపై తీవ్రంగా పడిందని ఆ వర్గాలు తెలిపాయి. అనివార్యంగా ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. దీంతో అమ్మకాలపై ప్రతికూల ప్రభావం పడింది.

ఆర్‌బిఐకి చేరని రూ.7,755 కోట్లు..!

- ఇప్పటికీ 2.13శాతం రూ.2వేల నోట్లు



న్యూఢిల్లీ : ఇప్పటికీ రూ.7,755 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చేరలేదు. మొత్తం చలామణిలోని దాదాపు 97.87 శాతం నోట్లు తమ వద్దకు చేరాయని ఆర్‌బిఐ సోమవారం వెల్లడించింది. ఇంకా 2.13 శాతం నోట్లు బయటి నుంచి రావాల్సి ఉందని పేర్కొంది. 2023 మే 19న ఈ పెద్ద నోట్లను ఆర్‌బిఐ ఉపసంహరించుకుంది. అప్పట్లో ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉంది. గతేడాది అక్టోబర్ 7వరకూ దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బిఐ స్థానిక కార్యాలయాల్లో నోట్ల మార్పిడికి అవకాశం కల్పించారు. పెద్ద నోట్ల పేరిట ప్రధాని మోడీ 2016లో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. వాటి స్థానంలో ఏకంగా రూ.2,000 నోటును ప్రవేశపెట్టారు. తీవ్ర విమర్శలు రావడంతో గతేడాది ఈ నోటును వెనక్కి తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఘనంగా స్టేట్ బ్యాంక్ దినోత్సవం



హైదరాబాద్: దేశ వ్యాప్తంగా స్టేట్ బ్యాంక్ 69వ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కార్యాలయంలోనూ పలు సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. బ్యాంక్ దినోత్సవం సందర్భంగా పలు చోట్ల చెట్లను నాటడంతో పాటుగా పలు కాంపిటీషన్‌ల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. అదే విధంగా ఎస్‌బిఐ ఎల్‌హెచ్‌ఒలో డాక్టర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో తమకు 2 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. రాష్ట్రానికి లీడ్ బ్యాంక్‌గా ఉండటంతో పాటుగా తమకు 1321 శాఖలు ఉన్నాయన్నారు. బ్యాంక్ డే సందర్భంగా ఐదు ఎన్‌జిఒలకు దాదాపు రూ.50 లక్షల వరకు విలువ చేసే వాహనాలను అందజేశారు. సహృదయ ఓల్డ్ ఏజ్ హోం, హెవెన్స్ హోమ్ సొసైటీ, వివేకనంద సంఘం, సత్య హరిచంద్ర ఫౌండేషన్, చెరిష్ ఫౌండేషన్‌లకు మద్దతును అందించారు.

రూ.305 కోట్ల నిధుల సమీకరణ

- వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ వెల్లడి

న్యూఢిల్లీ : బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ వన్ పాయింట్ వన్ సొల్యూషన్స్ లిమిటెడ్ కొత్తగా రూ.304.53 కోట్ల నిధులను సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆ సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ నిధుల కోసం 3,75,94,502 ఈక్విటీ షేర్లను, 1,67,85,714 ఈక్విటీ వారెంట్లను జారీ చేయాలని భావించింది. ఇందుకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. కాగా.. దీనికి జులై 18న జరగనున్న సంస్థ జనరల్ బాడీ సమావేశంలో వాటాదారుల ఆమోదం లభించాల్సి ఉందని వెల్లడించింది.

భారీ విస్తరణపై శ్రీచక్ర మిల్క్ దృష్టి

- బ్రాండ్ అంబాసీడర్‌గా సత్యదేవ్



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో భారీ విస్తరణపై దృష్టి సారించినట్లు శ్రీచక్ర మిల్క్ ప్రొడక్ట్స్ ప్రకటించింది. 2014లో పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రారంభమైన తమ వ్యాపారం.. వేగంగా రెండు రాష్ట్రాల్లో కార్యకలాపాలను విస్తరించిందని పేర్కొంది. 10 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకల్లో సంస్థ నూతన లోగోను ఎపి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆవిష్కరించారు. బ్రాండ్ అంబాసీడర్‌గా నటుడు సత్యదేవ్ నటించిన ప్రచారాన్ని టాలీవుడ్ నటుడు విజయ దేవరకొండ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీ చక్ర మిల్క్ ఎండి రామంజనేయులు మాట్లాడుతూ.. ప్రస్తుతం 18 పాల శీతలీకరణ కేంద్రాలు, టెట్రా ప్యాక్కింగ్ మిషినరీలను నిర్వహిస్తున్నామన్నారు. గత పదేళ్లలో రూ.200 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ సాధించామన్నారు.

ఎరయా లైఫ్‌స్పేస్ చేతికి అమెరికన్ కంపెనీ

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ఎబిఎక్స్.ఐఎన్‌సి కొనుగోలుకు బిడ్‌ను దాఖలు చేసినట్లు ఎరయా లైఫ్‌స్పేస్ లిమిటెడ్ కన్సార్టియం ప్రకటించింది. ఇందుకోసం వేసిన 362 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3009 కోట్లు) తమ బిడ్ వేలంలో అత్యధిక విలువ కలిగి ఉందని పేర్కొంది. ఎబిక్స్‌ను త్వరలోనే తమ సొంతం కానుందని ఎరయా లైఫ్‌స్పేస్ పేర్కొంది. అమెరికా బ్యాంక్ దివాళా చట్టం ప్రక్రియలో భాగంగా ఎబిక్స్ ఐఎన్‌సిని దక్కించుకున్నట్లు పేర్కొంది.

గెలాక్సీ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లకు ముందస్తు బుకింగ్

గూర్‌గావ్ : వచ్చే జులై 10న విడుదల చేయనున్న తదుపరి తరం గెలాక్సీ జడ్ స్మార్ట్‌ఫోన్లకు ముందస్తు బుకింగ్‌ను తెరిచినట్లు సామ్‌సంగ్ ఇండియా ప్రకటించింది. పారిస్‌లో కొత్త ఫోన్ల గ్లోబల్ ఆవిష్కరణ ఉంటుందని పేర్కొంది. ఈ స్మార్ట్‌ఫోన్లను రూ.2,000 మొత్తంతో ముందస్తుగా రిజర్వ్ చేసుకోవడం ద్వారా రూ.7000 వరకు విలువైన రాయితీలను పొందవచ్చని తెలిపింది.

నీట్ నిర్వహణపై విస్తృత చర్చ జరగాలి

- పది రోజుల్లో ఉస్మానియా, గాంధీ హాస్టల్ పనులు ప్రారంభం : మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యవిద్య ప్రవేశాల కోసం నీట్ నిర్వహణపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో డాక్టర్స్ డే సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ ను జాతీయ స్థాయిలో నిర్వహించాలా? లేక ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించాలా? జాతీయ స్థాయిలో నిర్వహిస్తే కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే లోపాలు, అదే విధంగా రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తే కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే ఇబ్బందులు వంటి అంశాలపై ఈ చర్చ ఉండాలని సూచించారు. దేశంలో పార్లమెంటు, రాష్ట్రాల్లో అసెంబ్లీ లాంటి వేదికల ద్వారా విస్తతంగా చర్చించి విద్యార్థులకు ప్రయోజనకరమైన నిర్ణయం తీసుకోవచ్చని తెలిపారు. సామాన్యులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స, పరికరాలు అందుబాటులో ఉండటమే కాకుండా, ఏ వ్యాధికి ఏ ఆస్పత్రిలో చికిత్స అందుతుందనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన మొదలుపెట్టామనీ, తమ ప్రభుత్వం సీనియార్టీకి ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా సీనియర్లను ప్రక్కన పెట్టి బంధుప్రీతి, కులప్రీతిని పట్టించుకుంటే ప్రతిభకు, సీనియార్టీకి అన్యాయం జరగదా? అని ప్రశ్నించారు. అందుకే తాము సీనియర్టీ ప్రాతిపదికన హెచ్ఓడీల దగ్గర నుంచి కింది వరకు మార్పులు చేస్తున్నట్టు వెల్లడించారు. కొత్త మెడికల్ కాలేజీలు వస్తాయని చెప్పారు. శివారు, మారుమూల ప్రాంతాల్లో పని చేసేందుకు డాక్టర్లు, వైద్య సిబ్బంది వెళ్లాలని సూచించారు. అక్కడ విధులు నిర్వహించేందుకు ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

సీతక్కకు హెూంశాఖ దక్కే ఛాన్స్

త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. సోమవారం విలేకర్లతో చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలు వెల్లడించారు. క్యాబినెట్ విస్తరణతో పాటు పలువురు మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. కొత్తగా ఐదారుగురికి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మంత్రి సీతక్కకు హెూం మంత్రిని చేసే అవకాశం ఉందన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్‌కు క్యాబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉందని రాజనర్సింహ వ్యాఖ్యానించారు. నిజామాబాద్ నుంచి ఒకరికి క్యాబినెట్‌లో చోటు దక్కొచ్చని తెలిపారు.

ఫ్రాన్స్ తొలి విడత ఎన్నికల్లో మితవాద అభ్యర్థి లీపెన్ విజయం

- మూడో స్థానంలో మాక్రాన్
- లెఫ్ట్ కూటమికి రెండో ప్లేస్



పారిస్ : ఫ్రాన్స్‌లో ఆదివారం జరిగిన పార్లమెంట్ తొలి విడత ఎన్నికల్లో అతి మితవాద పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్)కి చెందిన మారినె లీ పెన్ విజయం సాధించారు. మొదటి రౌండ్‌లో ఆర్ఎన్ పార్టీకి 34శాతం ఓట్లు లభించాయి. అయితే దీనితోనే పార్లమెంట్‌లో ఆ పార్టీకి సంపూర్ణ మెజారిటీ లభించదు. రెండో రౌండ్ ఈ నెల 7న జరగనుంది. ఆ తర్వాత స్పష్టమైన దృశ్యం ఏర్పడుతుంది. కాగా, ఆర్ఎన్‌కు పూర్తి మెజారిటీకి అవసరమైన 289 సీట్లకు కొద్దిగా తగ్గే అవకాశముంది. ఫ్రాన్స్‌లో ఈసారి హంగ్ పార్లమెంట్ ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఫలితంగా మరింత రాజకీయ అనిశ్చితి నెలకొంటుందని భావిస్తున్నారు. రెండో స్థానంలో వామపక్ష విభాగమైన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్ఎఫ్‌పి)కు 29శాతం ఓట్లు లభించగా అధ్యక్షుడు మాక్రాన్‌కి చెందిన ఎన్‌సెంబుల్ అలయన్స్ కేవలం 20.5 శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రెండో రౌండ్‌లోకూడా తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని లీ పెన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా అత్యధికంగా 65.8శాతం ఓట్లు పోలవడాన్ని మాక్రాన్ స్వాగతించారు. నేషనల్ ర్యాలీ మెజారిటీని సాధించిన తరుణంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు కలవడానికి సమయం ఆసన్నమైందని మాక్రాన్ వ్యాఖ్యానించారు.

రద్దైన పార్లమెంట్‌లో నేషనల్ ర్యాలీకి కేవలం 88 సీట్లే వున్నాయి. రెండో రౌండ్ పూర్తయిన తర్వాత 230 నుండి 280 సీట్లు వరకు ఎన్ఆర్‌కు వస్తాయని అంచనా వేస్తున్నారు. మాక్రాన్ పార్టీ 70 నుండి వంద సీట్లతో వెనుకబడి వుంటుందని ఎన్ఎఫ్‌పికి 125 నుండి 165మధ్య సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. మొదటి రౌండ్‌లో ఫ్రాన్స్ పార్లమెంట్‌కు 76మంది అభ్యర్థులు ఎన్నికయ్యారు. అందులో 39మంది ఆర్ఎన్, దాని మిత్రపక్షాలకు చెందినవారు కాగా, 32మంది ఎన్ఎఫ్‌కి చెందినవారు. మాక్రాన్ కూటమికి చెందినవారు కేవలం ఇద్దరే వున్నారు.

ఇజ్రాయిల్ మిలటరీకి మానవ కవచంలా పాలస్తీనా ఖైదీలు

- హింస, వేధింపులతో ఇంటరాగేషన్
- వెల్లడించిన పాలస్తీనా ఖైదీ



గాజా : ఉత్తర, దక్షిణ గాజా ప్రాంతాల్లో, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో భీకరంగా వీధి పోరాటం సాగుతోంది. ఇజ్రాయిల్ తన భూతల దాడులను ముమ్మరం చేయడంతో పరిస్థితి దారుణంగా వుంది. దీంతో పాలస్తీనా ఫైటర్లు కూడా పొంచి వుండి ఎదురు దాడులు జరుపుతున్నారు. గాజాలోని సుజయె ప్రాంతంలో ఇజ్రాయిల్ ట్యాంకులు ముందుకు చొచ్చుకుని వెళుతున్నాయి. గాజాలో పేలుడు పదార్ధాల గాలింపు కోసం ఇజ్రాయిల్ మిలటరీ పాలస్తీనా ఖైదీలను మానవ కవచంలా ఉపయోగిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. సోమవారం విముక్తుడైన పాలస్తీనా ఖైదీ ఫర్జ్ అల్ సమునీ మాట్లాడుతూ, సెంట్రల్ గాజాలోని ఇజ్రాయిల్ చెక్‌పాయింట్ వద్ద గతేడాది నవంబరు 16న తనను నిర్బంధించారని చెప్పారు. దాడులు జరుపుతామని హెచ్చరిస్తూ తమను అక్కడ నుండి ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారని, దాంతో తాము పారిపోతుండగా, తనను పట్టుకున్నారని, తన కుటుంబాన్ని చంపేశారని చెప్పారు. తీవ్ర స్థాయిలో ఇంటరాగేషన్ జరిగింది. హింస, వేధింపులకు పాల్పడ్డారు. దర్యాప్తు గదిలోకి ప్రవేశించగానే దర్యాప్తు అధికారి తుపాకీతో కాల్పులు జరుపుతూ ఒక రకమైన భయానక వాతావరణాన్ని సృష్టిస్తారని చెప్పారు.

ఇజ్రాయిలీ బందీలు ఎక్కడ వున్నారో చెప్పాలని పదే పదే ప్రశ్నించేవారన్నారు. నేను రైతును, నాకెలాంటి ఐడియా లేదని చెప్పినా వారు నమ్మలేదని, తనను హింసించారని చెప్పారు. తన చెవులను రాసుకువెళ్ళేలా కాల్పులు జరిపారని, ఆ సమయంలో గాయాలై నెత్తురోడాయన్నారు. బట్టలు విప్పి కిందన కూర్చోబెట్టేవారనానరు. ప్రతి పాలస్తీనా ఖైదీ ఇటువంటి పరిస్థితులనే ఎదుర్కొన్నారని చెప్పారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొనేదన్నారు. కళ్ళక గంతలు కట్టేసి, కాళ్ళు చేతులు కట్టేసి ప్రశ్నించేవారని తెలిపారు. ఒకవేళ ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళాల్సి వస్తే వారికి మరింత కఠినమైన, గడ్డు పరిస్థితులు ఎదురయ్యేవని చెప్పారు.

సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలి

- కనీస వేతనాల సలహా మండలి ఛైర్మెన్ జనక్ ప్రసాద్‌కు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచటానికి వెంటనే చర్యలు తీసుకోవాలనీ, జీవో నెంబర్ 22న విడుదల చేయించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో ఈ మేరకు ఆ యూనియన్ నాయకులు కనీస వేతనాల సలహా మండలి ఛైర్మెన్ జనక్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి ఎస్‌సీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తీసుకెళ్లారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామనీ, వేతనాలు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను గుర్తుచేశారు. 2022 సెప్టెంబర్‌లో 18 రోజుల సమ్మె సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషనర్ సమక్షంలో జరిగిన ఒప్పందంలో అంగీకరించిన అంశాలను సైతం సింగరేణి యాజమాన్యం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ అమలు చేయడం లేదని వాపోయారు. కాంట్రాక్ట్ కార్మికులకు క్వార్టర్ల కేటాయింపు, వేతనంతో కూడిన సెలవుల అమలు, తదితర సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులకు సింగరేణి ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదని గుర్తుచేశారు. వినతి పత్రంపై స్పందించిన కనీస వేతనాలు సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, వేతనాల పెరుగుదల అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. సింగరేణి యాజమాన్యం అంగీకరించిన వాటిని అమలు జరిగే చూస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర నాయకులు కె. బ్రహ్మాచారి, డి. వీరన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విశ్వవిద్యాలయ హాస్టల్‌లో మరమ్మతులు

- రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ విశ్వవిద్యాలయం హాస్టల్‌లో మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నానని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది విశ్వవిద్యాలయంలో హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపడతామనీ, అదే క్రమంలో ఈ ఏడాది కూడా హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గ్రూప్ 1 పోటీ పరీక్షల నిమిత్తం విద్యార్థుల కోరిక మేరకు వైస్ చాన్సలర్ ఆదేశాన్ని అనుసరించి ఈ ఏడాది వేసవిలో చదువుకునేందుకు వీలుగా లైబ్రరీలో కూలర్లు ఏర్పాటుచేశామని తెలిపారు. అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తెచ్చి, లైబ్రరీతో పాటు హాస్టళ్లను తెరిచి ఉంచామని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు అర్హత లేక, సిద్ధంగాని విద్యార్థులు గదులకు తాళాలు వేసుకుని సొంత ఇంటికి వెళ్లినందున ఆ గదులకు మరమ్మతులు చేయలేదని తెలిపారు. జూన్ 13న కళాశాల పున్ణ ప్రారంభం అనంతరం మరమ్మతులు ప్రారంభించామనీ, త్వరలో పూర్తవుతాయని రిజిస్ట్రార్ తెలిపారు.

త్వరలో జాబ్ క్యాలెండర్

- యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివసేనా రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడనున్నట్టు తెలిపారు. ఇప్పటికే నిరుద్యోగ సమస్యపై సీఎం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మూడు నాలుగు రోజుల్లో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేండ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో బీఆర్ఎస్, బీజేపీలు చెప్పాలని సవాల్ విసిరారు. నీట్ పరీక్షను రద్దు చేయించాలని బీజేపీ ఎంపీలను డిమాండ్ చేశారు. నీట్ పై బీజేపీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ నిరుద్యోగులు మాజీ మంత్రి హరీశ్ రావును నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పెట్రోల్ దొరికిన హరీశ్ రావుకు అగ్గిపెట్టె దొరకలేదంటూ యువతను రెచ్చగొట్టారని గుర్తుచేశారు.కాంగ్రెస్ నాయకులు మానవతా రాయ్ నిరుద్యోగులు ధైర్యంగా ఉండాలని సూచించారు. చర్చలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరిస్తుందని భరోసానిచ్చారు.

ప్రధాని ఓబీసీ ...అయినా ఏం లాభం? : వీహెచ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఓబీసీ అయినా.. ఆ వర్గాలకు ప్రయోజనం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి కులగణన నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరగాలంటే ఆ వర్గాలకు 80 శా తం వరకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శిగా హరిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఎం హరిత నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హరింత ప్రస్తుతం విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. ఆమెకు ప్రత్యేక కార్యదర్శిగా పదోన్నతి లభించింది. వ్యవసాయ, సహకార శాఖ జాయింట్ సెక్రెటరీగా ఉన్న ఉదయ్‌కుమార్‌ను సహకార, సహకార సంఘాల రిజిస్ట్రార్ శాఖ డైరెక్టర్‌గా, టీజీ విత్తనాభివృద్ధిశాఖ మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

61కు తగ్గిన ఆల్ ఇండియా ర్యాంకర్లు

- నీట్ రీఎగ్జామ్ ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ : నీట్- యూజీ రీ ఎగ్జామ్‌తో ఆల్ ఇండియా ర్యాంకర్ల సంఖ్య 61కు తగ్గింది. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షలపై ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. మే 5న నీట్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, పేపర్ లీకయిందని పలువులు అభ్యర్థుల ఆరోపిస్తున్నారు. అక్రమాల కారణంగానే అనేక మందికి ఉత్తమ ర్యాంక్‌లు దక్కాయని ఆరోపిస్తున్నారు. దీంతో జూన్ 27న ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన 1,563 మంది అభ్యర్థులకు మరోసారి నీట్-యూజీ పరీక్షను నిర్వహించారు. అయితే వీరిలో 813 మంది మాత్రమే రెండోసారి పరీక్షకు హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, మేఘాలయాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. ఈ ఫలితాలను ఆదివారం రాత్రి వెల్లడించారు. ఈ ఫలితాలతో ఆల్ ఇండియా ర్యాంకర్ల సంఖ్య 61కు తగ్గింది. మే 5న జరిగిన నీట్ యుజి ఫలితాలను జూన్ 4న వెల్లడించగా, మొత్తం 67 మంది ఆల్ ఇండియా ర్యాంక్‌ను సాధించిన సంగతి తెలిసిందే. సోమవారంతో ఈసారి సంఖ్య 61కు తగ్గింది. అలాగే గత ఫలితాల్లో 720కు 720 మార్కులు సాధించిన అభ్యర్థులు ఎవ్వరూ కూడా ఈ సారి అదే మార్కులు సాధించలేకపోయారు. ముఖ్యంగా హర్యానాలో ఒక కేంద్రానికి చెందిన ఆరుగురు గత ఫలితాల్లో 720కు 720 మార్కులు సాధించారు. ఈసారి వీరిలో ఒక్కరికీ ఆ మార్కులు రాలేదు.

రెండు దశాబ్దాల నాటి కేసులో మేధాపాట్కర్‌కి జైలు



న్యూఢిల్లీ : రెండు దశాబ్దాల నాటి పరువునష్టం కేసులో నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బిఎ) నేత మేధా పాట్కర్‌కి ఢిల్లీ కోర్టు సోమవారం ఐదు నెలల జైలు శిక్ష విధించింది. రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్షను ఒక నెలపాటు నిలుపుదల చేసింది. నర్మదా బచావో ఆందోళనకు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించారంటూ అప్పట్లో నేషనల్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్ ఎన్‌జిఒకు అధ్యక్షుడిగా ఉన్న సక్సేనాకు పరువు నష్టం కలిగించేలా టివి ఛానల్ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేయడంతోపాటు ప్రకటన ఇచ్చారని, 2001లో నమోదు చేసిన కేసులపై తాజాగా కోర్టు తీర్పు ఇచ్చింది

బైడెన్ అభ్యర్థిత్వ మార్పునకు

ప్రధాన డెమోక్రటిక్ దాతల యత్నం

- న్యూయార్క్ టైమ్స్



అమెరికాలో డెమోక్రటిక్ పార్టీ దాతలు జో బైడెన్‌ను అధ్యక్ష రేసు నుండి అతని ఇష్టానికి వ్యతిరేకంగా తొలగించి, బలమైన అభ్యర్థిని నియమించే మార్గాలను అన్వేషిస్తున్నారని, ఆ ప్రయత్నాల గురించి తెలిసిన మూలాలను ఉటంకిస్తూ ఆదివారం న్యూయార్క్ టైమ్స్ రాసింది. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో గురువారంనాడు జరిగిన చర్చలో బైడెన్ వాదన అత్యంత పేలవంగా వున్న విషయాన్ని యావత్ ప్రపంచం వీక్షించింది. జార్జియాలోని అట్లాంటాలో టెలివిజన్‌లో జరిగిన ఘర్షణను వీక్షించిన 67 శాతం నమోదిత ఓటర్లు ట్రంప్ గెలిచినట్లు భావించినట్లు సీఎన్ఎన్ నిర్వహించిన ఫ్లాష్ పోల్ వెల్లడించింది.

ఆగస్టులో జరగనున్న డెమోక్రటిక్ నేషనల్ కన్వెన్షన్‌కు ముందు 2024 బ్యాలెట్‌లో బైడెన్‌ను బలవంతంగా తీసివేయడానికి అనుమతించే "అర్కేన్ రూల్స్" పై రాజకీయ సలహాదారులతో చర్చలు జరుగుతున్నాయని పరిస్థితికి దగ్గరగా ఉన్న వ్యక్తులు న్యూయార్క్ టైమ్స్ తో చెప్పారు. ఈ వేసవిలో బైడెన్ కోసం నిధుల సమీకరణను హెూస్ట్ చేయాలని ప్లాన్ చేసిన ఒక సిలికాన్ వ్యాలీ దాత ఈవెంట్‌ను విరమించుకున్నట్లు ప్రకటించాడు. ఒక ప్రధాన కాలిఫోర్నియా స్పాన్సర్ డిబేట్ వాచ్ పార్టీని విడిచిపెట్టి, "అట్టర్ డిజాస్టర్" అనే సబ్జెక్ట్ లైన్‌తో స్నేహితుడికి ఇమెయిల్ పంపాడని న్యూయార్క్ టైమ్స్ రాసింది. బైడెన్‌కు "జ్ఞానోదయం కలిగి తనంతట తానుగా నిష్క్రమించాలని నిర్ణయించుకుంటాడని" ఇతర సంపన్న డెమోక్రాట్‌లు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రథమ మహిళ జిల్ బైడెన్‌ను సంప్రదించే ఆలోచనను కూడా పరిశీలిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. బైడెన్ నిర్ణయాన్ని ప్రభావితం చేయగల ఏకైక వ్యక్తి అతని భార్య అని ఎన్బీసీ న్యూస్ కొందరు ప్రముఖులను ఉటంకిస్తూ పేర్కొంది. బైడెన్ దంపతులు ఆదివారం క్యాంప్ డేవిడ్‌లో తమ పిల్లలు, మనవరాళ్లతో చర్చించి "ముందుకు వెళ్లాలా లేక తన ప్రచారాన్ని త్వరగా ముగించాలా అని నిర్ణయించుకుంటాడు" అని భావిస్తున్నారు.

ప్రపంచ సమకం

యూరోపియన్ యూనియన్ బ్యూరోక్రాట్లు

- 'రష్యాతో యుద్ధం కోరుకుంటున్నారు' : ఓర్బన్



యూరోపియన్ యూనియన్ నాయకత్వం తమ సొంత ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూనే, రష్యాతో యుద్ధం వైపు కూటమిని నెట్టివేస్తోందని హంగేరియన్ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్ పేర్కొన్నాడు. యూరోపియన్ యూనియన్ ఆర్థిక సవాళ్లను, తీవ్రవాద ముప్పుతో సహా అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నదని శనివారంనాడు మగ్యార్ నెమ్జెట్ వార్తాపత్రికలో ప్రచురించబడిన ఒక వ్యాసంలో హెచ్చరించాడు. "విషయాలను మరింత దిగజార్చడానికి, ఊహాజనిత లోకంలో నివసించే బ్రస్సెల్స్ బ్యూరోక్రసీ ఇటీవలి సంవత్సరాలలో అనేక తప్పుడు రాజకీయ నిర్ణయాలు తీసుకుంది" అని హంగరి ప్రధాన మంత్రి వాదించాడు. "యూరప్ రోజురోజుకీ యుద్ధంలోకి లాగబడుతోంది. దీనితో పోగొట్టుకునేది తప్ప పొందేది ఏమీ లేదు." యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడిగా మూడోసారి పనిచేయడానికి యూరోపియన్ యూనియన్ నాయకులు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌ను నామినేట్ చేసిన కొద్దిసేపటికే హంగేరియన్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశాడు. అదే సమయంలో, ఎస్టోనియన్ ప్రధాన మంత్రి కాజా కల్లాస్ కూటమి అగ్ర దౌత్యవేత్తగా జోసెఫ్ బోరెల్ స్థానంలో నామినేట్ అయ్యాడు. ఆమె దుందుడుకు విదేశాంగ విధానానికి ప్రతీకగా ఉంది. రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించాలని, ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేయాలనే కీలక ఛాంపియన్‌లలో కల్లాస్ ఒకరు. కీవ్‌కు సహాయం కోసం స్తంభింపజేసిన రష్యన్ ఆస్తులను ఉపయోగించాలని వాదించిన వారిలో ఆమె ఉన్నది. "బ్రస్సెల్స్ బ్యూరోక్రాట్‌లు ఈ యుద్ధాన్ని కోరుకుంటున్నారు. వారు రష్యాను ఓడించాలనుకుంటున్నారు. వారు యూరోపియన్ ప్రజల డబ్బును ఉక్రెయిన్‌కు పంపుతూనే ఉన్నారు. వారు యూరోపియన్ కంపెనీలను ఆంక్షలతో బలిచేశారు. వారు ద్రవ్యోల్బణాన్ని పెంచారు. కోట్లాది యూరోపియన్ పౌరులకు జీవనాన్ని కష్టతరం చేశారు" అని ఓర్బన్ తన వ్యాసంలో రాశాడు . యూరోపియన్ యూనియన్ నాయకత్వం "ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి" బదులుగా సభ్య దేశాల జనాభాపై "తమ స్వంత భావజాలాన్ని విధించింది" అని ఓర్బన్ ఆరోపించాడు. చర్చల ద్వారా దౌత్యపరమైన పరిష్కారానికి అనుకూలంగా ఉండే ఓర్బన్ ఉక్రెయిన్ సంఘర్షణపై యూరోపియన్ యూనియన్ విధానాన్నిబహిరంగంగా విమర్శిస్తాడు. అనేక ఇతర నాటో సభ్య దేశాల మాదిరిగా కాకుండా, హంగరీ కీవ్‌కు ఆయుధాలను పంపడానికి నిరాకరించటమే కాకుండా షరతులు లేని ఆర్థిక సహాయానికి వ్యతిరేకంగా లాబీయింగ్ చేసింది. ఓర్బన్ గతంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ ఖండంలోని "యుద్ధోన్మాదానికి" "మూలాలు" అని పేర్కొన్నాడు. బ్రస్సెల్స్ రష్యాతో ప్రమాదకరమైన యుద్ధ క్రీడను ఆడుతోందని ఆరోపించాడు.